

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



HYDERABAD I KARIMNAGAR I NIZAMABAD I NALGONDA I MAHABUBNAGAR I WARANGAL I KHAMMAM I AMARAVATHI I TIRUPATI I KURNOOL I TADEPALLIGUDEM I VISHAKAPATNAM I ANANTHAPURAM I KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 35 • పేజీలు:12+16 • వెల: రూ.5 | శుక్రవారం • 5-1-2018 | www.manamnews.com | /manamnews



దాణా కేసు తీర్పు మళ్లీ వాయిదా

వరుసగా రెండోరోజూ అదే స్థితి

లాలూ మనుషుల బెదిరింపు

జడ్జి శివ్‌పాల్ సంచలన ఆరోపణ

7లో..

మేవానీ.. ఖాలిద్‌లపై కేసు

'భీమా-కోరేగావ్'లో రెచ్చగొట్టే ప్రసంగాలు

ఎఫ్ఐఆర్ నమోదు

7లో..



కపటం కట్టిపెట్టాలి

'జాదవ్' పేరిట పాక్ వీడియోపై భారత్ ఫైర్



12 మంది పాక్ రేంజర్లు హతం

జవాను మరణంపై బీఎస్ఎఫ్ ప్రతీకారం

పుట్టినరోజు నాడే బలిగొన్న పాక్ సైనికులు

ముగ్గురి చొరబాటు యత్నం ఒకరి కాల్చివేత

న్యూఢిల్లీ, జనవరి 4:

జమ్ముకశ్మీర్ సరిహద్దులో భారత సరిహద్దు దళం (బీఎస్ఎఫ్) గురువారం సుమారు 12 మంది పాక్ రేంజర్లను హతమార్చింది. సాంబ సెక్టార్ పరిధిలో పాక్ దళాల కవ్వింపు కాల్పులు తమ సహచరుణ్ని బలిగొనడంపై ఆగ్రహించిన జవాన్లు 24 మిగతా 6లో..

ఆటల్లేని అంగన్‌వాడీలు

అందని ఆట వస్తువులు

నిధుల సాకు చూపుతున్న అధికారులు

హైదరాబాద్, జనవరి 4 (మనం ప్రతినిధి):

చిన్నారులకు ఆటపాటలతో కూడిన చదువు. ఇంటిని మరిపించేందుకు ఆటవస్తువుల మధ్య చదువు. రెండు, మూడేండ్ల పిల్లలను ఆటలాడిస్తూ చదువులపై ఆసక్తి పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను ఆడించేందుకు ఆటబొమ్మలు, టీచింగ్ మెటీరియల్‌ను సరఫరా చేయాలని నిశ్చయించింది. అయితే ఆచరణలో ఆ లక్ష్యం నీరుగారుతోంది. ఆటపాటలకు అవసరమైన ఆట వస్తువులు పిల్లలకు అందని ద్రాక్షగా మిగిలిపోతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 40వేల అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 3.50 లక్షల నుంచి 4.50 లక్షల మధ్య చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మిగతా 6లో..



ఇదీలోకం!



ఈ చెడ్డీ గ్యాంగ్‌ను కట్టడి చేయకపోతే.. రేపు ప్యాంట్ గ్యాంగ్‌గా అవతరించే ప్రమాదం ఉంది సార్..!

తాగు.. సాగు.. నీరు ఇవ్వండి

ఆర్డీఎస్ ద్వారా విడుదల చేయండి

మంత్రి హరీశ్‌కు కర్ణాటక మంత్రి విజ్ఞప్తి

సీఎంతో చర్చించాక నిర్ణయం: హరీశ్

ఆర్డీఎస్ ఆధునీకరణపై చర్చ..

ఏపీ సహకారానికి నిర్ణయం

హైదరాబాద్, జనవరి 4:

తుంగభద్ర పరీవాహక ప్రాంతంలో ఈ ఏడాది నీటి కొరత తీవ్రంగా ఉన్నందున ఆర్డీఎస్‌లో తెలంగాణకు కేటాయించిన నీటిని వాడుకునేందుకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కర్ణాటక విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం జలసౌధలో మిగతా 6లో..





వయసు ధ్రువీకరణ

స్త్రీలకు తప్పనిసరి

శబరిమల అయ్యప్ప ఆలయ నిబంధన

6లో..

రెచ్చిపోయిన ఇసుకాసురులు

వీఆర్ఏను ట్రాక్టర్‌తో తొక్కించి చంపేశారు

అక్రమ రవాణా అడ్డుకున్నందుకు పైశాచికం

కామారెడ్డి జిల్లా కంబాపూర్‌లో దారుణం

హైదరాబాద్, జనవరి 4:

ఇసుక మాఫియా మరోసారి రెచ్చిపోయింది. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకున్నందుకు ట్రాక్టర్ తో ఢీ కొట్టి ఓ వీఆర్ఏను హత్య చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటన కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కంబాపూర్‌లోని కాకి వాగు సమీపంలో గురువారం చోటు చేసుకుంది. కాకివాగు మిగతా 6లో..



వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో శుక్రవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రతతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలోనూ స్వల్ప మార్పు చోటుచేసుకుంటుంది. రాత్రిపూట చలి గాలులు వణికిస్తాయి. గంటకు 11 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 29 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 15 డిగ్రీలు

గాలిలో తేమ: 43 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: చవితి సా.7.00 తదుపరి పంచమి; నక్షత్రం: మఖ తె.2.14 తదుపరి పుబ్బ; వర్జ్యం: మ.3.03-4.32; దుర్ముహూర్తం: ఉ.9.03-9.47, మ.12.44-1.28; రాహుకాలం: ఉ.10.59-12.21; అమృతఘడియలు: రా.12.26-1.52; శుభసమయం: ఉ.10.00-10.30, మ.1.29-3.00.

సూర్యోదయం: 6.51

సూర్యాస్తమయం: 5.52

నిర్వాసితులను ఆదుకుంటాం

కుటుంబంలో ఒకరికి ఉద్యోగం.. డబుల్ బెడ్ రూం ఇల్లు: కేటీఆర్



మల్కపేట రిజర్వాయర్ పనుల పరిశీలన

ఎల్లారెడ్డి పేట మోడల్ ఠాణా ప్రారంభం

కరీంనగర్, జనవరి 4 (మనం ప్రతినిధి):

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు గురువారం పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా జిల్లాలోని కోనరావుపేట మండలం మల్కపేటలో నిర్మాణంలో ఉన్న రిజర్వాయర్‌ను కేటీఆర్ పరిశీలించారు. రిజర్వాయర్, టన్నెల్ పనులు పరిశీలించిన మిగతా 6లో..



తలొగ్గక తప్పదా!

'తలాక్' బిల్లుపై తొలగని ప్రతిష్టంభన

7లో..

సెలెక్ట్ కమిటీకి పంపి తీరాలి: విపక్షాలు

రాజ్యసభలో నెగ్గలేకపోయిన ప్రభుత్వం

ఆధిక్యం లేక హైరానా.. సభ వాయిదా



గుడిమల్కాపూర్ పూల మార్కెట్ వద్ద గుడిసెలను తొలగించేందుకు వచ్చిన పోలీసు అధికారులకు ఓ మహిళ చుక్కలు చూపించారు. ఏకంగా పోలీస్ టోపీనే లాక్కొని.. తలపై పెట్టుకుని ఇమ్మన్నా ఇవ్వకుండా.. మొండికేసిన దృశ్యం అక్కడున్నవారందరినీ ఆకర్షించింది.

గోవా పర్యటనలో

టీఆర్ఎస్ నేతల వీరంగం

- హోటల్ ముందు వాహనం పార్కింగ్
- మద్యం మత్తులో సిబ్బందిపై దాడి
- పోలీసుల అదుపులో పటాన్‌చెరు నేతలు

పటాన్‌చెరు, జనవరి 4 (మనం న్యూస్): గోవాలో నూతన సంవత్సర వేడుకలను జరుపుకునేందుకు వెళ్లిన టీఆర్ఎస్ పటాన్‌చెరు నేతలు కటకటాల పాలయ్యారు. ఓ హోటల్ ముందు అక్రమంగా పార్కింగ్ చేయడంతో సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేశారు. దాంతో రెచ్చిపోయిన నేతలు ఆ హోటల్ సిబ్బందిపై దాడికి దిగారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నాలుగు రోజులు క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని అమీన్‌పూర్, కిష్టారెడ్డిపేటకు చెందిన టీఆర్ఎస్ నాయకులు నూతన సంవత్సరాన్ని సరదాగా గడిపేందుకు గోవాకు వెళ్లారు. సోమవారం రాత్రి గోవాలోని ఓ హోటల్ ఎదుటు వాహనం పార్కింగ్ విషయంలో హోటల్ సిబ్బందికి, టీఆర్ఎస్ నాయకులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య జరిగిన గొడవలో హోటల్ సిబ్బందిపై దాడి చేసినట్టుగా తెలిసింది. ఈ నేపథ్యంలో నాయకులు తమపై దాడి చేశారని హోటల్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. హోటల్ సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు టీఆర్ఎస్ నాయకులు దర్శన్, శ్రీనివాస్, ప్రశాంత్‌రెడ్డి, సయ్యద్ బదిరుద్దీన్, పురుషోత్తం రెడ్డి, నరసింహారెడ్డి, అజయ్, డి. శ్రీనివాస్, కృష్ణ, కిరణ్, ఆంజనేయులు, భోపాల్, దేవానంద్, అంజయ్యలపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. దాడి చేసిన కేసులో వీరిని అరెస్టు చేశామని గోవా పోలీస్ అధికారి అన్నట్టుగా తెలిసింది. వీరిని కోర్టులో హాజరు పర్చనున్నారు. ఇదిలా ఉండగా స్థానిక టీఆర్ఎస్ నాయకులు కొందరు అరెస్టైన వారిని విడిపించేందుకు గోవాకు వెళ్లారు. అరెస్టు విషయాన్ని స్థానిక నేతలు పార్టీ ముఖ్యుల దృష్టికి తీసుకెళ్లినట్టుగా తెలిసింది. కాగా, మద్యం మత్తులోనే గొడవలకు నాయకులు దిగారనే విమర్శలున్నాయి.

కొడుకా... కనవేమిరా!

- కన్నబిడ్డ కాఠిన్యంతో గడపమీద తల్లిదండ్రులు
- భద్రాద్రి రాముడున్న చోట తండ్రికి కడుపు కోత
- కనికరం చూపమంటూ వేడుకుంటున్న దంపతులు



భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 4 (మనం న్యూస్‌బ్యూరో): ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధులు ఇలా చేతులు జోడించింది వీధిలో కనిపిస్తున్న ఏ దేవుడినో చూసి కాదు... తాము కనిపించగానే దఢాలున ముఖంమీదే తలుపులు మూసిన కన్నకొడుకు కాఠిన్యం భరించలేకనే... నిస్సహాయులైన తమను దారినపోయేవారిలో ఒక్కరైనా ఆదుకోకపోతారా? అన్న ఆశతో వచ్చేపోయే ఊరిపెద్దలకు నమస్కరిస్తూ దీనంగా ప్రార్థిస్తున్నారు. కని, పెంచి, బతికే దారి చూపించినా ఆ కొడుకు వారిపై కనికరం చూపలేదు. చివరకు కన్నతండ్రి కష్టార్జితమైన ఇంట్లో ఆయనకే చోటులేకుండా చేసి మరింత కర్కశంగా ప్రవర్తించాడు... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం గట్టాయి గూడెం గ్రామంలో గురువారం చోటుచేసుకున్న ఈ సంఘటన సమాజం తలదించుకునేలా చేసింది. వివరాలిలా ఉన్నాయి... పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్)లో పనిచేసిన సుదర్శనాచారి 2009లో రిటైరయ్యారు. అన్నేళ్లూ చేసిన సేవల ఫలితంగా అందిన సొమ్ముకు తోడు బ్యాంకు రుణం తీసుకుని ప్రశాంత శేష జీవనం కోసం ఓ చక్కని ఇల్లు కట్టుకున్నారు. ఆయన కుమారుడు 2008లోనే ప్రేమ వివాహం చేసుకోగా కొడుకూ-కోడళ్ల జీవనానికి లోటులేకుండా ఏర్పాట్లు కూడా చేశారు. అయితే, కాలం గడిచేకొద్దీ పెరిగే వయసుతోపాటు అనారోగ్య సమస్యలూ ఆయనమీద పడ్డాయి. దీంతో కొంతకాలం కిందట గుండెకు ఆపరేషన్ కూడా చేయించుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో కన్నతండ్రి ఆరోగ్యం అంతంతమాత్రంగా ఉంటే సపర్యలు చేయాల్సిన కొడుకూ, కోడలు మాత్రం పట్టించుకోలేదు. సరికదా... కనీసం వృద్ధులన్న దయ లేకుండా ఆ దంపతులను మానసికంగా, శారీరకంగా బాధించారు. ఈ హింసను భరించలేక వృద్ధ జంట బంధువుల ఇంట తలదాచుకుంది. కానీ, కడుపున పుట్టినవాడు పరమ దుర్మార్గుడుగా మారినా, కన్నప్రేమను తెంచుకోలేక తిరిగి సొంత ఇంటికి చేరారు సుదర్శనాచారి దంపతులు. అయితే, వారి పొడగిట్టని ఆ సుపుత్రుడు భార్యతోకలసి వారిని బయటకు గెంటేసి, ముఖంమీదే తలుపులు మూసేశారు. తన కష్టార్జితంతో కట్టుకున్న ఇంట్లోనే తమకింత నీడ కరువైన ఆ వృద్ధులిద్దరూ వాకిట్లో కూర్చుని వచ్చేపోయే ఊరి పెద్దలకు ఇలా నమస్కరిస్తూ తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు.

ఈటెల రాజీనామా చెయ్యాల్సిందే

- వియ్యంకుని కోసం అధికార దుర్వినియోగమా
- కాంగ్రెస్ అధికార ప్రతినిధి కొనగాల మహేశ్

హైదరాబాద్, జనవరి 4 (మనం ప్రతినిధి): వియ్యంకుని కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడ్డ ఈటెల రాజేందర్ తన మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి కొనగాల మహేశ్ డిమాండ్ చేశారు. గాంధీ భవన్‌లో గురువారం మహేశ్ విలేకరులతో మాట్లాడారు. మంత్రి ఈటెలకు జీవో నం 57ను కేసీఆర్ బహుమతిగా ఇచ్చారని ఆయన విమర్శించారు. హార్టికల్చర్ డైరెక్టర్ పదవి నుంచి ఈటెల రాజేందర్ వియ్యంకుడుని వెంటనే తొలగించాలని డిమాండ్ చెశారు. గత సంవత్సరం నవంబరు 30న ఉద్యోగ విరమణ పొందిన ఈటెల రాజేందర్ వియ్యంకుడు నాన్ ఐఏస్ కేడర్‌కు చెందిన ఎల్.వెంకట్రామిరెడ్డి ఆ సమయంలో హార్టికల్చర్ విభాగంలో అడిషనల్ డైరెక్టర్ హోదాలో ఉన్నారన్నారు. ప్రభుత్వ పెద్దల ఉత్సాహంతో చట్ట విరుద్ధంగా పదవీ విరమణ రోజునే ఆయనకు డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించడమే కాకుండా హార్టీకల్చర్‌తో పాటు సెరీకల్చర్ విభాగానికి అధిపతిగా నియమించారని, మూడేళ్ల సర్వీసు పొడిగించారని అన్నారు. రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసుల్లో కొనసాగించరాదని ఆర్థిక శాఖ ఆదేశాలు ఉన్నప్పటికీ, ఆ శాఖ మంత్రి ఈటెల తన వియ్యంకుడు కోసం వాటిని పక్కన పెట్టారన్నారు. ఇది ఖచ్చితంగా అధికార దుర్వినియోగమే అన్నారు. నాబార్డు నిధులు స్వాహా చేసేందుకు కేసీఆర్, ఈటెల, వెంకట్రామిరెడ్డి ఈ నాటకానికి తెరతీశారన్నారు. తెలంగాణలో నిరుద్యోగుల ఆత్మహత్యలు కేసీఆర్‌కు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. అవినీతికి పాల్పడితే సొంత బిడ్డనైనా జైలుకు పంపుతానని చెప్పిన కేసీఆర్, ఈటెల వియ్యంకుడు కోసం జీవో ఇస్తుంటే ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఇదంతా జరుగుతుంటే గవర్నర్ గడ్డి పీకుతుండా..? అని అన్నారు. ఈ విషయంపై గవర్నర్ స్పందిచకపోతే జీవో నెం 57పై హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు.

వ్యవసాయానికే మా ప్రాధాన్యం

- రైతన్న సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- పెట్టుబడిగా ఎకరాకు రూ. 8 వేలు
- కోటి ఎకరాలకు సాగునీరు: పోచారం



హైదరాబాద్, జనవరి 4(మనం ప్రతినిధి): రైతు సంక్షేమమే టీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని, అందుకు అనుగుణంగానే చర్యలు తీసుకుం టున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. వ్యవసా యానికి ముందస్తు పెట్టుబడి కోసం రూ. 8 వేలు అందిస్తున్నామని వివరించారు. దీంతోపాటు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయడంతో రాష్ట్రంలో వ్యవసాయ శాఖకు ప్రాధాన్యం పెరిగిందని మంత్రి తెలిపారు. గురువారం సచివాలయంలో తన ఛాంబర్‌లో వ్యవసాయ శాఖ-2018 క్యాలెండర్, తెలంగాణ విత్తన ధ్రువీకరణ ఏజెన్సీ డైరీ, వ్యవసాయ విస్తరణ అధికారుల డైరీ, ఉద్యాన విశ్వవిద్యాలయం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పోచారం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వ్యవసాయ శాఖకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. అందులో భాగంగానే రాష్ట్రంలోని 24 లక్షల మోటార్లకు 24 గంటల పాటు కోతల్లేని విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారని తెలిపారు. గత ఏడాది రూ.17 వేల కోట్లతో రుణమాఫీ పూర్తయ్యిందని, రైతులు తిరిగి అప్పుల బారినపడకుండా ఉండేందుకు ఎకరాకు రూ.8 వేలు అందిస్తున్నట్టు చెప్పారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగు నీరందిస్తామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర తగ్గకుండా పంట దిగుబడులను కొనుగోలు చేస్తున్నామని, గతేడాది రాష్ట్రంలో 5400 కొనుగోలు కేంద్రాల ద్వారా లక్షలాది టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని వివరించారు.

నాణ్యమైన విత్తనాలు..

మంచి దిగుబడులు రావాలంటే నాణ్యమైన విత్తనాలు అవసరమని, తెలంగాణ విత్తన ధ్రువీకరణ ఏజెన్సీకి దేశంలోనే మంచి పేరొచ్చిందని మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఏజెన్సీని కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాలకు నోడల్ ఏజెన్సీగా నియమిం చిందన్నారు. రాష్ట్రంలో సీడ్ విలేజ్ ప్రోగ్రాంను ప్రోత్సహిస్తున్నామని, రైతులకు మూల విత్తనం ఇచ్చి బైబ్యాక్ ద్వారా రైతుల నుంచి ధ్రువీకరణ విత్తనాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులకు అధిక ఆదాయాన్ని ఇచ్చేవి ఉద్యాన పంటలని, రాష్ట్రంలో సుమారు 15 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయన్నారు.

ట్రంప్.. అధ్యక్షుడు కావాలనుకోలేదట!

ప్రపంచంలోనే ప్రముఖ వ్యక్తిగా మాత్రమే నిలవాలనుకున్నారట!



- స్నేహితుడి సూచనతోనే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ
- 'ఫైర్ అండ్ ఫ్యూరీ' పుస్తకంలో వెల్లడి

వాషింగ్టన్, జనవరి 4: గత ఏడాది జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రత్యర్థి హిల్లరీ క్లింటన్‌పై విజయం సాధించి అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన విషయం తెలిసిందే. అయితే ఆయన అగ్రరాజ్యానికి అధ్యక్షుడు కావాలని ఎప్పుడూ అనుకోలేదట. ఈ విషయాన్ని అమెరికన్ జర్నలిస్ట్ మైఖెల్ వుల్ఫ్ రాసిన 'ఫైర్ అండ్ ఫ్యూరీ: ఇన్‌సైడ్ ది ట్రంప్ వైట్ హౌస్' అనే పుస్తకంలో పేర్కొన్నారు. అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ గెలిచారు అని టీవీలో రాగానే ఏదో దెయ్యాన్ని చూసినట్లుగా ఆయన ఫీలయ్యారని మైఖెల్ వివరించారు. అధ్యక్షుడిగా ట్రంప్ గెలిచారు అని వినగానే ఆయన భార్య మెలానియా సంతోషంతో ఏడ్చేశారట. ప్రపంచంలోనే ఫేమస్ వ్యక్తి కావాలన్నది తన కలని., అధ్యక్షుడిగా గెలవాలని మాత్రం కాదని ట్రంప్ తన స్నేహితుడైన సామ్ నన్‌బర్గ్‌కు చెప్పారట. బుల్లితెర రంగంలో కెరీర్ బాగుండాలంటే అమెరికా అధ్యక్షుడిగా పోటీ చేయాల్సిందేనని ట్రంప్‌కు తన స్నేహితుడు రోజర్ ఎయిల్స్ చెప్పారు. అతని మాట మీదే ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా పోటీ చేశారు. ఈ పుస్తకం రాయాల్సిందిగా ట్రంపే తనను ప్రోత్సహించారని మైఖెల్ తెలిపారు. ట్రంప్ అధ్యక్షుడిగా గెలిచిన తర్వాత తదుపరి అధ్యక్ష ఎన్నికల్లో ఆయన కుమార్తె ఇవాంక పోటీ చేయాలని భావించారట. ఈ విషయాన్ని ఆమె తన భర్త జేర్డ్ కుష్నర్ వద్ద ప్రస్తావించారు. ట్రంప్ వైట్‌హౌస్‌లోకి వచ్చాక అక్కడి వాతావరణానికి అలవాటు పడటానికి చాలా కష్టపడ్డారని మైఖెల్ పుస్తకంలో పేర్కొన్నారు. తన గదిలో టూత్‌బ్రష్‌తో సహా తన వస్తువులను ఎవ్వరూ ముట్టుకోకూడదని వైట్‌హౌస్ సిబ్బందికి కఠిన నిబంధనలు విధించారు. ఎవరైనా విషం పెట్టి తనని చంపాలనుకుంటారని ట్రంప్‌కు చాలా కాలం భయపడుతుండేవారని మైఖెల్ వివరించారు.

ఎన్నికలకు ముందు హెచ్-1బీ వ్యవస్థకు మద్దతు

ఎన్నికల తర్వాత హెచ్-1బీ వీసాకు మద్దతు

హెచ్-1బీ వీసాలతో అమెరికా నిపుణులకు అన్యాయం జరుగుతోందని ఎన్నికలకు ముందు ట్రంప్ జోరుగా ప్రచారం నిర్వహించినప్పటికీ.. ఎన్నికల తర్వాత మాత్రం ఓ సందర్భంగా ఈ వీసాలకు మద్దతుగా నిలిచారని మైఖెల్ తన పుస్తకంలో పేర్కొన్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత 2016, డిసెంబరు 14న సిలికాన్ వ్యాలీలోని టెక్ దిగ్గజాల ప్రతినిధులతో ట్రంప్ భేటీ అయ్యారని, ఆ సందర్భంగా హెచ్-1బీ వీసాలు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారని వివరించారు.

ఎన్నికల విచారణ కమిషన్ రద్దు

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో నియమించిన ఎన్నికల్లో అక్రమాలపై విచారణ కమిషన్‌ను రద్దు చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ కమిషన్‌ను అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్, కన్సాస్ మంత్రి క్రిస్ కొబాక్ నేతృత్వంలో గత ఏడాది మేలో ట్రంప్ నియమించారు.

57,800 సార్లు ఆఫ్ఘన్‌పై దాడి!

ఉగ్రవాదం పోరులో పాకిస్థాన్ తమను మోసం చేసిందని అమెరికా చేసిన ఆరోపణలపై ఆ దేశం తీవ్రంగా స్పందించింది. ఆఫ్ఘానిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసేందుకు అమెరికా తమ వైమానిక స్థావరాలను 57,800 సార్లు ఉపయోగించుకుందని పేర్కొంది. అలాంటప్పుడు తాము అమెరికాను ఎలా మోసం చేసినట్లు అవుతామని పాక్ విదేశాంగశాఖ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ట్విట్టర్‌లో ప్రశ్నించారు.

వారంలో పాక్‌పై కఠిన చర్యలు

ఉగ్రవాదానికి ఊతమిస్తోందని పేర్కొంటూ ఇప్పటికే పాకిస్థాన్‌కు ఆర్థిక సాయం నిలిపేసిన అమెరికా.. తాజాగా ఆ దేశంపై చర్యలకు ఉపక్రమిస్తోంది. వారంలో ఈ చర్యలు ఎలా ఉంటాయో ప్రకటించనుందని తెలిసింది. ఈ ఆంక్షలు చాలా కఠినంగా ఉండొచ్చునని వైట్‌హౌజ్ మీడియా కార్యదర్శి సారా శాండర్స్ వెల్లడించారు. పాక్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవాలని నిర్ణయించిన తర్వాత వాటిని తానే స్వయంగా వెల్లడిస్తానని ఆమె పేర్కొన్నారు. అవసరమైతే ఒకటిరెండు రోజుల్లోనే ఈ చర్యలు వెల్లడవుతాయని చెప్పారు.

పాతబస్తీ ప్రజల పాపమేంది?

- నగరంలో ద్వంద్వపాలన సాగుతోంది: నారాయణ



హైదరాబాద్ సిటీ, జనవరి 4(మనం న్యూస్): మెట్రో ప్రయాణంతో నగర ప్రజలకు ఎన్నో లాభాలు ఉన్నాయని, పాతబస్తీకి కూడా మెట్రో అందుబాటులోకి తీసుకురావాలని సీపీఐ జాతీయ నాయకులు కె.నారాయణ అన్నారు. పాతబస్తీ వాళ్లు ఏంపాపం చేశారు.. వాళ్లకు ఎందుకు మెట్రో సౌకర్యం ఉండకూడదని నారాయణ ప్రశ్నించారు. సీపీఐ ఆధ్వర్యంలో మెట్రో పరిశీలనలో భాగంగా ఆయన తార్నాక నుంచి అమీర్‌పేట్ వరకు మెట్రోరైల్లో గురువారం ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెట్రో ప్రయాణం చాలా బాగుందని తెలిపారు. ట్రాఫిక్‌జాం బాధలు లేకుండా ఎంతో హాయిగా అనిపించిందని తెలిపారు. ప్రతి పనికి మొదట్లో చిన్న చిన్న లోపాలు ఉండటం సహజమేనని నారాయణ అన్నారు. భవిష్యత్‌లో ఇంకా పార్కింగ్, స్టాప్స్ కూడా పెట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మెట్రోరైల్ నిర్మాణంపై భారత కమ్యూనిస్టు పార్టీ గర్వించదగ్గ విషయం ఏమిటంటే మిగతా పక్షాలంతా మెట్రోను మొదట్లో వ్యతిరేకించినా సీపీఐ పార్టీ మాత్రం మెట్రో కావాలని గట్టిగా కొట్లాడిందని తెలిపారు. దాంతో పార్టీకి చాలామంది వ్యతిరేకమయ్యారన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే నగరానికి అసదుద్దీన్ సోదరులు సీఎం, డిప్యూటీ సీఎంలుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ద్వంద్వ పాలన సాగుతోందని నారాయణ మండిపడ్డారు. ఓల్డ్ సిటీలో మెట్రో సాధించేవరకు భారతకమ్యూనిస్టు పార్టీ తరపున ఉద్యమాలు కొనసాగిస్తామని నారాయణ హెచ్చరించారు.

మేడారం జాతరకు జాతీయ హోదా

- లోక్‌సభలో ఎంపీ సీతారాం నాయక్



హైదరాబాద్, జనవరి 4 (మనం ప్రతినిధి): మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని టీఆర్ఎస్ ఎంపీ సీతారాంనాయక్ అన్నారు. గురువారం లోక్‌సభ జీరో అవర్లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా సుమారు 10 కోట్ల మంది ఆదివాసి, గిరిజనుల మనోభావాలను గౌరవించి జాతరకు జాతీయ హోదాను కల్పించాలని కోరారు. 1996లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. సుమారు కోటి మంది ఈ జాతరకు వస్తుంటారని ఆయన పేర్కొన్నారు. గిరిజన వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ చొరవ తీసుకుని మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని ఆయన కోరారు.

24 గంటల విద్యుత్ కాంగ్రెస్ కృషే

- టీపీసీసీ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 4 (మనం ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కృషి వల్లే తెలంగాణలో 24 గంటల విద్యుత్ సాధ్యమైందని కాంగ్రెస్ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఇప్పటికైనా టీఆర్ఎస్ నేతలు సొంత డబ్బా కొట్టుకోవడం ఆపాలని ఆయన సూచించారు. మంత్రి జగదీశ్వర్‌రెడ్డి విలువలు లేకుండా మాట్లాడుతున్నారన్నారు. డ్రైరన్ ప్రొటెక్టర్‌ను ప్రభుత్వం ఉచితంగా రైతులకు అందించాలని పొంగులేటి డిమాండ్ చేశారు. స్వలాభం కోసం అధికార పార్టీ నేతల ఒత్తిడి మేరకే ఐఏఎస్‌ల బదిలీలు జరిగాయన్నారు. నియోజకవర్గాల పునర్విభజన శాస్త్రీయంగా ఉండాలని, లేనిపక్షంలో టీపీసీసీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు.

ముంబైలో అగ్నిప్రమాదం

- నలుగురు మృతి, ఐదుగురికి గాయాలు


ముంబై, జనవరి 4: ముంబైలోని తూర్పు అంధేరీ ప్రాంతంలోని మారోల్‌లోని ఓ నివాస భవన సముదాయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులతో సహా మొత్తం నలుగురు మరణించగా, ఐదుగురు గాయపడ్డారు. బుధవారం అర్థరాత్రి రెండు గంటల సమయంలో మారోల్ ప్రాంతంలోని ఓ నివాస భవనం నాలుగో అంతస్తులో మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో నలుగురు మరణించగా, ఐదుగురు కాలిన గాయాలతో స్థానికంగా ఓ ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు. వీరి పరిస్థితి నిలకడగా ఉంది. అయితే ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియలేదని అధికారులు తెలిపారు.

ఏఎంయూ మాజీ వీసీపై సీబీఐ కేసు

న్యూఢిల్లీ, జనవరి 4 : ఉద్యోగ నియామకాల్లో అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలపై ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ మాజీ ఉపకులపతి నసీద్ అహమద్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. నసీద్ అహమద్ 2002-07 మధ్యలో ఏఎంయూకు వీసీగా పని చేశారు. ప్రస్తుతం వర్సిటీ జాయింట్ ఫైనాన్స్ అధికారిగా పని చేస్తోన్న షకీబ్ అస్లాన్ 2005 సంవత్సరంలో అసిస్టెంట్ ఫైనాన్స్ అధికారిగా చేరారు. అస్లాన్ ఎంపికలో వర్సిటీ నిబంధనలు అతిక్రమించడంతో పా టు అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలపై మాజీ వీసీ నసీద్ అహమద్, అప్పటి డిప్యూటీ ఫైనాన్స్ అధికారి యాస్మిన్ జలాల్ బేగ్(ప్రస్తుతం ఫైనాన్స్ అధికారి)తోపాటు షకీబ్ అస్లాన్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది.

రీక్యాపిటలైజేషన్‌కు మరో 80 వేల కోట్లు

- ఆర్థిక శాఖ ప్రతిపాదనకు పార్లమెంట్ ఓకే



న్యూఢిల్లీ, జనవరి 4: ప్రభుత్వ రంగ బ్యాంకుల మూలధన పునర్వ్యవస్థీకరణ ప్రణాళికలో అదనపు వ్యయానికి పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈమేరకు ఈ ప్రణాళిక కోసం అదనంగా రూ.80 వేల కోట్ల మొత్తాన్ని వెచ్చించనున్నట్లు ఆర్థిక శాఖ ప్రతిపాదించగా.. సభ్యులు ఆమోదం తెలిపారు. మూలధన పునర్వ్యవస్థీకరణ కోసం బాండ్‌ల రూపంలో నిధుల సమీకరణకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. అయితే, ఈ బాండ్‌ల స్టేటస్ నాన్ ఎస్ఎల్ఆర్, నాన్ ట్రేడబుల్‌గా ఉంటుందని అధికార వర్గాల సమాచారం. కాగా, ఈ ప్రణాళికలో భాగంగా బలహీనంగా ఉన్న ఆరు ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్బీలు)కు రూ.7,577 కోట్లు అందించాలన్న ప్రతిపాదనకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపిన విషయం విదితమే! రిజర్వు బ్యాంక్ సూచనల మేరకు సత్వర దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నవాటిలో ఈ బ్యాంకులు ఉండటంతో మూలధన సాయం అందనుంది. ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా షేర్లను జారీ చేసి మూలధనం పొందుతున్న వాటిలో బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐడీబీఐ బ్యాంక్, యూకో బ్యాంక్లు ఉన్నాయి. వాటాదార్ల అనుమతి సహా అన్ని నియంత్రణ సంస్థల అనుమతి లభించిన తర్వాత వచ్చే కొన్ని వారాల్లో బ్యాంకులు ఈ మూలధన సాయాన్ని అందుకుంటాయి.



మందకృష్ణపై కక్ష సాధిస్తున్నారు: కిషన్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 4(మనం న్యూస్): దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానన్న కేసీఆర్.. మాటతప్పడమే కాక, ఇప్పుడదే దళితుడిని వేధిస్తున్నాడని బీజేపీ నేత కిషన్ రెడ్డి విమర్శించారు. ఎమ్మా ర్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధిస్తోందని ఆరోపించారు. ఈమేరకు గురువారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మాట తప్పడంపై మంద కృష్ణ నిలదీయడంవల్లే.. ప్రభుత్వం ఆయనపై ద్వేషం పెంచుకుంటోదన్నారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేయాలని, గిరిజనులకు 4శాతం రిజర్వేషన్లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టులో ఉన్న ముస్లిం రిజర్వేషన్ల వ్యాజ్యాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ధర్నాచౌక్‌లో ధర్నాలు చేయొద్దని, నిజాం కాలేజీలో సమావేశాలు, సభలు నిర్వహించవద్దని తెలంగాణ సర్కారు ఆంక్షలు విధించిందని చెప్పారు. కుల, విద్యార్థి,యువజన, కార్మిక, రైతు, మహిళా సంఘాలతో పాటు, రాజకీయ పార్టీలు కూడా ధర్నాలు చేయడానికి వీలులేదన్నారు. గిట్టుబాటు ధరలు కావాలని ఖమ్మంలోని గిరిజన రైతులు ధర్నా చేస్తే, వాళ్ల చేతికి సంకెళ్లు వేసి, జైలుకు పంపించిన చరిత్ర టీఆర్ఎస్ ప్రభుత్వానిదని కిషన్ రెడ్డి మండిపడ్డారు.

ఏ నియోజకవర్గం ఏ జిల్లానో..

- కేసీఆర్ తుగ్లక్ పాలన ఫలితమిది: రేవంత్



హైదరాబాద్, జనవరి 4(మనం ప్రతినిధి): సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గం ఏ జిల్లాలో ఉందనే విషయం రాష్ట్రంలోని సీనియర్ ఐఏఎస్ అధికారులకు కూడా తెలియకపోవడం కేసీఆర్ తుగ్లక్ పాలనకు నిదర్శనమని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం ఆయన ట్విటర్ ద్వారా స్పందిస్తూ కొత్త జిల్లాల ఏర్పాటులో సీఎం ఎలాంటి ప్రమాణాలను పాటించలేదని, ఫలితంగా ఏ నియోజకవర్గం ఏ జిల్లాలో ఉందనే విషయం కూడా అధికారులకు అర్థంకాని పరిస్థితి నెలకొందన్నారు. గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తూ వైద్యారోగ్య శాఖ విడుదల చేసిన జీవోలో గజ్వేల్ నియోజకవర్గం మెదక్ జిల్లాలో ఉందని, మరోచోట గజ్వేల్ జిల్లాగా పేర్కొన్నారని విమర్శించారు. ఆ జీవో ప్రతులను గజ్వేల్ జిల్లా కలెక్టర్, గజ్వేల్ జిల్లా ఆస్పత్రుల కో ఆర్డినేటర్, ఖజానా అధికారికి పంపుతున్నట్టు తెలిపార న్నారు. ఈ విషయంపై మీడియాలో వార్తలు వచ్చిన వెంటనే అధికారు లు తప్పులు దొర్లిన జీవోను మార్చేసారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఆన్‌లైన్ జీవో రిజిష్టర్‌లో మార్చిన కొత్త జీవో కాపీని అప్‌లోడ్ చేశారని కానీ అందులోనూ గజ్వేల్ స్థానంలో మెదక్ జిల్లా అంటూ పేర్కొన్నారని తెలిపారు. వాస్తవానికి గజ్వేల్ సిద్ధిపేట జిల్లాకు చెందిందన్నారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గమే ఏ జిల్లాలో ఉందో అధికా రులకు తెలియకుంటే సాధారణ ఎమ్మెల్యేలు పనిచేస్తున్న నియోజకవర్గా ల్లో ప్రజలు పడుతున్న కష్టాలు ఎలా తెలుస్తాయని విమర్శించారు.



ప్రభుత్వ ఆస్పత్రిగా ప్రగతిభవన్

- కార్యకర్తల శిక్షణ తరగతుల్లో ఎల్.రమణ

హైదరాబాద్, జనవరి 4(మనం న్యూస్): కొంతమంది నాయకులు పార్టీని వీడిపోతే మనోధైర్యాన్ని కోల్పోవద్దని, పట్టు విడవకుండా శ్రమిస్తే విజయం తప్పకుండా వరిస్తుందని టీడీపీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ఇప్పటినుంచే సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టీడీపీ రాజకీయ నాయకత్వ శిక్షణా తరగతులను ఎన్టీఆర్ భవన్‌లో రమణ గురువారం ప్రారంభించారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యల్లో భాగంగా ఈ తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తరగతులకు హాజరైన మండల అధ్యక్షులు, కార్యదర్శులను ఉద్దేశించి రమణ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రభుత్వ తీరును ఎండగట్టాలన్నారు. 1983కు ముందు రాజకీయ అధికారం కొంతమంది పెత్తందార్ల చేతుల్లో ఉండేదని, నాటి పరిస్థితులే ప్రస్తుతం తెలంగాణలో నెలకొన్నాయన్నారు. 2019 ఎన్నికల్లో మళ్లీ ఆ కొద్దిమంది చేతుల్లోకి అధికారం పోకుండా, ప్రజలకు వాస్తవాలను తెలిపి అసెంబ్లీలో టీడీపీ జెండాను ఎగురవేద్దామని కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు.

వర్గీకరణపై మీ వైఖరి చెప్పండి

- సీఎం కేసీఆర్‌కు నోముల సూటి ప్రశ్న



హైదరాబాద్, జనవరి 4(మనం ప్రతినిధి): ఎస్సీ వర్గీకరణపై సీఎం కేసీఆర్ తన వైఖరిని వెల్లడించాలని మాజీ మంత్రి, టీడీ పీ నేత నోముల నర్సయ్య, కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్ డిమాండ్ చేశారు. గురువారం శాసనసభ మీడియా పాయింట్ వద్ద వారు మాట్లాడారు. వర్గీకరణ కోసం రెండు దశాబ్దాలకు పైగా మంద కృష్ణమాదిగ ప్రజాస్వామ్యయుతంగా పోరాడుతున్నారన్నారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న క్రమంలో వర్గీకరణ విషయాన్ని పార్లమెంటు దృష్టికి తీసుకువచ్చేందుకు దీక్ష చేపట్టిన ఆయన్ను అరెస్టు చేయటం అక్రమమన్నారు. శాంతియుతంగా తమ సమస్యలపై నిరసన వ్యక్తం చేసే పరిస్థితి రాష్ట్రంలో లేదన్నారు. రాష్ట్రంలో నియంత పాలన సాగుతుందని విమర్శించారు. మంద కృష్ణను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ఎక్కువ కాలం ఏ ప్రభుత్వం పాలన సాగించలేదన్నారు. జైల్లోనే మంద కృష్ణ 48 గంటల నిరసన చేపట్టారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లటంలో టీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందని విమర్శించారు. వర్గీకరణ సాధించే బాధ్యత టీఆర్ఎస్ ప్రభుత్వందేనన్నారు. తెలంగాణలో బడుగులు బతకటమే కష్టంగా మారిందని వాపోయారు. మంద కృష్ణ అక్రమ అరెస్టు, ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై శుక్రవారం అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఇంటి పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



అనతి కాలంలోనే ‘మనం’ ప్రభంజనం

- ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్

కరీంనగర్, జనవరి 4 (మనం ప్రతినిధి): అనతి కాలంలోనే ‘మనం’ దినపత్రిక జనంలో ప్రభంజనం సృష్టించిందని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ కొనియాడారు. కరీంనగర్ జిల్లాలో ‘మనం’ క్యాలెండర్‌ను మంత్రి ఈటెల రాజేందర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా మనం దినప త్రిక పత్రికా రంగంలో ఓ విప్లవం సృష్టిస్తోందన్నారు. ఏ రాజకీయ పార్టీకి వత్తాసు పలకకుండా పనిచేస్తోందన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజల మన్ననులు పొందిందన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ‘మనం’ కరీంనగర్ బ్యూరో చీఫ్ సదానందం, అడ్వర్టైజ్‌మెంట్ విభాగం ఇన్‌చార్జి రవీంద్రాచారి, సర్క్యులేషన్ ఇన్‌చార్జి శేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

టమాట రైతు దిగాలు

- ధరల పతనంతో కుదేలు
- కిలో రూ.5 పలుకుతున్న వైనం
- మరింత పడిపోయే అవకాశం
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతితో దెబ్బ

హైదరాబాద్, జనవరి 4 (మనం ప్రతినిధి): టమాట ధరలు పడిపోవడంతో రైతాంగం కుదేలయ్యింది. రెండు నెలల క్రితం కిలో రూ.60 వరకు పలికిన టమాట, ప్రస్తుతం రూ.5కి పడిపోయింది. అధిక దిగుబడికి తోడు వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి కూడా సరుకును డిమాండ్ చేసుకోవడం ధరల పతనానికి ప్రధాన కారణం. పంటకు కనీస ధర లభించక పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దిగుమతితో తంటాలు

వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి టమాటను దిగుమతి చేసుకుంటుండడంతో ఆ ప్రభావం రైతులపై పడుతుంది. తెలంగాణలోని వివిధ జిల్లాలోని పండుతున్న పంటకు తోడు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో పండిన సరుకును తీసుకొని వందల సంఖ్యలో లారీలు నిత్యం మార్కెట్లకు వస్తున్నాయి. డిమాండ్‌కు మించి సరుకు అందుబాటులో ఉండడంతో వ్యాపారులు ధరను తగ్గించేస్తున్నారు. దీంతో రైతులు తమ కష్టానికి ఆశించినంత ధరను పొందలేకపోతున్నారు. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేక నష్టం పోతున్నారు. జనవరి నెలాఖరుకు ధర మరింత తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు.



పెట్టుబడి వస్తే చాలు

టమాట పంట సాగుకు పెట్టిన పెట్టుబడి వస్తే చాలు అనిపిస్తోంది. నాకున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో ఒక ఎకరంలో టమాట సాగు చేశా. తొలి పంటకు మంచి ధర వచ్చింది. ప్రస్తుతం ధర పూర్తిగా పడిపోయింది.

– గోధుమల్ల కిరణ్, రైతు, నల్లగొండ



రూ.60 నుంచి రూ.5కు

గత ఖరీఫ్ సీజన్‌లో కురిసిన వర్షాలకు టమాట పంట తెగుళ్ల బారిన పడింది. భారీగా పంట నష్టం సంభవించింది. డిమాండ్‌కు అనుగుణంగా సరుకు లేకపోవడంతో ధర పెరిగిపోయింది. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.60 వరకు విక్రయించారు. హోల్‌సెల్ మార్కెట్‌లో గత నవంబరులో కిలో టమాట రూ.50 ఉండగా.. ఒక ట్రేను (ఒక్క ట్రేలో 25 నుంచి 28 కిలోలు వరకు ఉంటుంది) రూ.850 వరకు విక్రయించారు. మంచి ధర లభిస్తుండడంతో ఎక్కువ మంది రైతులు టమాటను సాగు చేశారు. రబీ సీజన్‌లో వాతావరణం అనుకూలించి పంట దిగుబడి బాగా పెరిగింది. సరుకు కావాల్సినంత ఉండడంతో డిసెంబరు, జనవరి వచ్చేసరికి ధర పడిపోయింది. కిలో టమాట రూ.50 నుంచి రూ.5కి పడిపోయింది. ట్రే టమాట రూ.850 నుంచి రూ.250కు చేరింది.



తిరుపతిరావు కమిటీని తిరస్కరించాలి: టీపీఏ

హైదరాబాద్, జనవరి 4(మనం ప్రతినిధి): ప్రైవేటు పాఠశాలల ఫీజుల నిర్ణయంపై నియమించిన ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీని తిరస్కరించాలని తెలంగాణ తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడు ఎన్.నారా యణ, ప్రధాన కార్యదర్శి బుర్రా రాముగౌడ్ అన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై టీపీఏ ఆధ్వర్యంలో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి రంజీవ్ ఆర్ఆచార్యకు సచివాలయంలో గురువారం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణ కోసం ప్రత్యేక చట్టం చేయాలన్నారు. తిరుపతిరావు కమిటీ ఇచ్చిన సంవత్సరానికి 10 శాతం ఫీజుల పెంపు యాజమాన్యాలకు వరంగా.. తల్లిదండ్రులకు శాపంగా మారిందన్నారు. కమిటీలో సభ్యులుగా ఉన్న టీపీఏ, హెచ్ఎస్ పీఏ సభ్యుల అభ్యంతరాలను లెక్కచేయకుం డా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు అనుకూలంగా చేసిన సిఫారసును ప్రభుత్వం ఆమోదించొద్దని కోరారు. ప్రైవేటు స్కూల్స్ నిర్వహణకు అయ్యే ఖర్చుల ఆధారంగా ఫీజులను నిర్ణయించాలని, నిబంధనలతో రాష్ట్ర స్థాయిలో స్కూల్ ఫీజు రెగ్యులేషన్ చట్టా న్ని చేయాలని కోరుతున్నా మన్నారు. మెమోరాండం అందజే సినవారిలో సంఘం కోశాధి కారి లక్ష్మీప్రియ తదితరులు ఉన్నారు.

నిర్మాణ కార్మికులకు అత్యుత్తమ సేవలు

- బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ
- 28 కుటుంబాలకు 34 లక్షల చెక్కులు: నాయిని

హెదరాబాద్, జనవరి 4(మనం ప్రతినిధి): నిర్మాణ రంగ కార్మికులకు దేశంలోనే అత్యుత్తమ సేవలను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోందని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. నిర్మాణ పనుల సందర్భంగా ప్రమాదాలకుగురైన కార్మికుల కుటుంబాలకు ఆయన గురువారం నాడు చెక్కులను పంపిణీ చేశారు. సచివాలయంలోని తన కార్యాలయంలో మొత్తం 28 మంది బాధితులకు రూ.34 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల ఆర్థిక అభివృద్ధికోసం టీఆర్ఎస్ ప్రభుత్వం మెరుగైన సేవలందిస్తుందన్నారు. కార్మికుల గృహిణులకు కుట్టు మిషన్ ట్రైనింగ్ ఇప్పించడంతోపాటు శిక్షణ అనంతరం కుట్టు మిషన్ అందిస్తున్నట్టు తెలిపారు. కార్మికుల పిల్లల ఉన్నత విద్యకోసం వివిధ రకాల శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నామని, వారికి వచ్చే మే వరకు స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్టు పేర్కొన్నారు. మే నుంచి కార్మికులకు మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని యోచిస్తున్నామని, దీని ద్వారా కార్మికులకు కావాల్సిన పనిముట్లు, వివిధ సౌకర్యాలు అందించనున్నట్టు తెలిపారు. గతంలో ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ.2 లక్షల అందించగా ఆ సహాయాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రూ.6 లక్షలుగా పెంచామని తెలిపారు. ప్రసూతి సహాయంగా రూ.30 వేలు, ప్రమాదంలో అంగవైకల్యం కలిగితే రూ.6 లక్షలు, కాళ్లు, చేతులు కోల్పోతే రూ.5 లక్షలు, పాక్షికంగా అంగవైకల్యం కలిగితే రూ.4 లక్షలు, సహజ మరణానికి



రూ.60 వేలు, కార్మికుల కుమార్తె వివాహానికి రూ.30 వేలు అందిస్తున్నట్టు తెలిపారు.

34 లక్షల ఆర్థిక సహాయంలో..

కార్మికుల సంఖ్య	సహాయం	చెక్కు రూ.ల్లో
15 మంది	ప్రసూతి సహాయం	రూ. 4,10,000
5	సహజ మరణం	రూ. 3,70,000
4	కార్మిక కుటుంబాలకు ప్రమాదంలో మరణించిన	రూ. 25,10,000
4	కార్మికుల కుటుంబాలకు మహిళలు, కార్మికుల కుమార్తెల వివాహ కానుక	రూ. 1,10,000

దసరా నాటికి పేదలందరికీ ఇళ్లు

- కేటాయింపులో నిరుపేదలకే ప్రాధాన్యం
- రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్



కరీంనగర్, జనవరి 4 (మనం న్యూస్ బ్యూరో) : దసరా నాటికి నిరుపేదల సొంతింటి కల నేరవేరుతుందని రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నిమోజకవర్గంలోని వీణవంక, హుజురాబాద్ మండలాల్లో గురువారం పర్యటించిన ఈటెల పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని పెద్దపామయ్యపల్లి, రాంపూర గ్రామాలలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం రూ.12.10 లక్షల వ్యయంతో నిర్మించిన పెద్దపాపయ్యపల్లి గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు తొలి విడత కేటాయింపుల్లో ఇల్లు లేని నిరుపేదలకు ప్రాధాన్యమిస్తామన్నారు. ఎలాంటి పైరవీలకు తావులేకుండా అర్హులను ఎంపిక చేస్తామన్నారు. తొలి విడతలో 20 ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. హుజురాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి తనను ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని ఈటెల పేర్కొన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా ఇస్తున్న ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



అప్రమత్తంగా ఉండండి

- వరంగల్ పర్యటనలో సిబ్బందికి డీజీపీ సూచన

వరంగల్, జనవరి 4 (మనంన్యూస్ బ్యూరో) : రాష్ట్ర డీజీపీ మహేందర్ రెడ్డి గురువారం వరంగల్‌లో పర్యటించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో వరంగల్‌కు వచ్చిన డీజీపీకి స్థానిక ఐజీ నాగిరెడ్డి, సీపీ సుధీర్‌బాబు ఘన స్వాగతం పలికారు. అనంతరం వరంగల్ నిట్ కళాశాలలోని సమావేశ మందిరంలో వరంగల్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. రాష్ట్రంలో నేరాల శాతం తగ్గిందని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీసుస్టేషన్లలో థర్డ్‌పార్టీ సెంటర్లను ఏర్పాటు చేసి వాటిని డీజీపీ కార్యాలయానికి అనుసంధానీ చేస్తామన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే ప్రతి పౌరుడితో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని సూచన చేశారు. మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నేర నియంత్రకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉద్యోగాల భర్తీతో పాటు పదోన్నతులకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సామాజిక కార్యక్రమాలు నిర్వహణలో కూడా పోలీసులు భాగం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐజీ నాగిరెడ్డి, నగర పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు, ఏసీపీలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రదీప్ ఆబ్‌స్కాండ్?

- కౌన్సెలింగ్‌కు నేడే తుది గడువు



హైదరాబాద్, జనవరి 4: మద్యం మత్తులో కారు నడుపుతూ పట్టుబడ్డ బుల్లితెర యాంకర్ ప్రదీప్ ప్రస్తుతం ఎవరికీ అందుబాటులో లేకుండా పోయారు. ఈ కేసుకు సంబంధించి ట్రాఫిక్ పోలీసులు నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి ఉన్నా ప్రదీప్ ఇప్పటి వరకూ పత్తా లేడు. వాస్తవానికి మొన్నటి మంగళవారమే ప్రదీప్ ఈ కౌన్సెలింగ్‌కు హాజరవుతారని పోలీసులు భావించారు. ప్రదీప్ రాకపోవడంతో.. చట్టప్రకారం ప్రదీప్‌కు ఐదు రోజుల పాటు గడువు ఇచ్చినట్లు సమాచారం. ఈ గడువు కూడా నేటి(శుక్రవారం)తో ముగుస్తుంది. ప్రదీప్ ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండడంతో నోటీసులు అందజేసేందుకు ఇంటికెళ్లగా.. ఇంట్లో లేడని తల్లిదండ్రులు చెబుతున్నారని పోలీసులు తెలిపారు. కాగా, యాంకర్ ప్రదీప్‌పై నెటిజన్లు మండిపడుతున్నారు. ఆరు నెలల కిందట ఒక ఛానల్ తో మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ వద్దంటూ నీతులు చెప్పిన ప్రదీప్ తనదాకా వస్తే శిక్షను తప్పించుకోవడానికి పోలీసులకు దొరక్కుండా తప్పించుకోవడమేంటని విమర్శిస్తున్నారు. సామాన్యులపై ప్రతాపం చూపించే పోలీసులు పూర్తి స్థాయిలో ప్రయత్నించి ప్రదీప్‌కు శిక్ష పడేలా చూస్తే పోలీసులపై గౌరవం ఉంటుందని సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు.



జేఎన్‌టీయూలో ఏఈఈ ఉచిత కోచింగ్

హైదరాబాద్, జనవరి 4(మనం ప్రతినిధి): కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూలో పీఐయూ–సీఏఆర్డీ, ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ఏఈఈ(అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) సివిల్ ఉచిత కోచింగ్‌ను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.గోవర్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కష్టపడి ఉద్యోగం సాధించాలని, తల్లిదండ్రుల కలలను సాకారంచేసే దిశగా అడుగులు వేయాలని సూచించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.సమూలాల్ మాట్లాడుతూ 300 మంది శిక్షణకు దరఖాస్తు చేసుకుంటే.. 80 మందిని మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్‌రావు, ఐసీ హెచ్‌ఓడీ రామ్‌మోహన్‌రావు, కుమార్, బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..

శుక్రవారం, జనవరి 5

కోరేగావ్ సంకేతం

మహారాష్ట్ర దళిత ధిక్కారంతో ఒక్కసారిగా స్తంభించి పోయింది. కోరేగావ్‌కు 5 కిలోమీటర్ల దూరంలోని వధు బుద్రుక్ గ్రామంలో డిసెంబర్ 29న మరాఠా–మెహర్ వైషమ్యంగా ప్రారంభమైన హింసాత్మక సంఘటనలు రాష్ట్ర వ్యాపిత ఉద్యమంగా అవతరించాయి. బుద్రుక్ ఉదంతంతో పుణే చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. మహారాష్ట్రలో ప్రస్తుతం ఒకవైపు దళిత–మరాఠా విభేదాలు నడుస్తుంటే, మరోవైపు బీజేపీ–ఆరెస్సెస్ అనుబంధ సంస్థలు, ప్రధానంగా దళితులపై దాడులు జరుపుతున్నాయి. గో సంరక్షణ, లవ్ జిహాద్ తదితర రూపాల్లో దేశవ్యాప్తంగా దళితులు, బలహీనవర్గాలు, ప్రజాస్వామిక వాదులపై దాడులు పెరుగుతున్నాయి. ఆ దాడులను నిరసిస్తూ జరగుతున్న ఉద్యమాలపై రాజ్యం అణచివేత వైఖరి కారణంగా సమాజంలో అభద్రత, ఆందోళనలు నెలకొన్నాయి.

మరాఠా రాజులు పీష్వాలపై బ్రిటీష్ సైన్యాలు చేసిన చారిత్రాత్మక యుద్ధంలో వీరోచితంగా పోరాడిన మహర్ వీరుల అమరత్వాన్ని స్మరించుకునేందుకు జనవరి 1 ద్విశతాబ్ది ఉత్సవాలను జరుపుకునేందుకు భీమా కోరేగావ్ స్మారక స్థూపం వద్ద 10 లక్షల మందికి పైగా దళితులు సమావేశమయ్యారు. దీనికి ముందు ఆగస్టులో మరాఠాలు ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలని ఉద్యమించారు. అందులో భాగంగా ఔరంగాబాద్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న సమయంలో, కొపార్డిలో ముగ్గురు దళిత యువకులు 15 ఏళ్ళ మరాఠీ అమ్మాయిపై అత్యాచారం, హత్య చేసిన ఉదంతం ఆ వర్గాల మధ్య వైషమ్య పూరిత వాతావరణాన్ని ఏర్పరచింది. ఇదే క్రమంలో భీమా కోరేగావ్‌కు బుద్రుక్ గ్రామంలో అప్పటి మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ నిషేధాన్ని సైతం ధిక్కరించి మరాఠా రాజు శివాజీ పెద్ద కుమారుడు శంభాజీ అంత్యక్రియలను జరిపిన ధీశాలిగా అభివర్ణిస్తూ గోవింద్ గోపాల్ మహర్ సమాధిపై శిలాఫలకాన్ని దళిత సంఘాలు ప్రతిష్ఠించాయి. ఆ ఘటనతో స్థానిక మరాఠీలకు, దళితులకు మధ్య చెలరేగిన వివాదాన్ని సాకుగా తీసుకొని సంఘపరివార్ సంస్థలు మరాఠాలను రెచ్చగొడుతూ దళిత, బలహీన వర్గాలపై దాడులకు పాల్పడిన సంఘటనలు అనేకం వెలుగులోకి వచ్చాయి. ఇంతటి ఉద్రిక్తతల నడుమ కోరేగావ్ ద్విశత వార్షికోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంలో మహారాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. విధ్వంసాల కారణంగా రెండురోజుల పాటు రాష్ట్రం స్తంభించిపోయింది. దళిత ధిక్కారంగా, విజయంగా భావించే భీమా కోరేగావ్ స్మారక సమావేశం హింసాత్మకంగా మారడానికి బీజేపీ–శివసేన ప్రభుత్వ పక్షపాత వైఖరే ప్రధాన కారణం.

భీమా కోరేగావ్ యుద్ధంలో పీష్వా, బ్రిటిష్ ఇరు సైన్యాలలోని మహర్‌లూ యుద్ధం చేసారు. కేవలం పీష్వాకు వ్యతిరేకంగా మాత్రమే మహర్‌లు పోరాడారు అనుకోవడానికి వీలులేదు. అంటే ఇరుపక్షాల్లో ఎవరు గెలిచినా అందులో ప్రధానంగా పోరాడుతున్న సామాజిక సమూహం గెలిచినట్లు కాదు గదా! ముస్లిం పాలకులకు మద్దతుగా హిందువులు, హిందూ పాలకులకు మద్దతుగా ముస్లింలు కొట్లాడిన సంఘటనలు చరిత్రలో అనేకం ఉన్నాయి. మూడవ పానిపట్టు యుద్ధంలో హిందూ బ్రాహ్మణీయ పీష్వాలకు వ్యతిరేకంగా శైవ దిగంబర సన్యాసులైన నాగా సాధువులు అహ్మద్ షా అబ్దాలీ సైన్యంతో కలసి పోరాడిన ఉదంతాన్ని ఏమనాలి? దేశ చరిత్రను హిందుత్వ చరిత్రగా మలచేందుకు ప్రయత్నిస్తున్న మతతత్వవాదులు వీటి గురించి ఏం మాట్లాడగలరు? గత సామాజిక సందర్భాలతో సంబంధం లేకుండా చారిత్రక ఘటనలను, పురాణ పాత్రలను సమకాలీన సామాజిక వైషమ్యాలతో ముడిపెట్టి సంఘ పరివార్ వ్యాఖ్యానించడం చారిత్రక అర్థరాహిత్యమే కానీ వేరొకటి కాదు. అయితే పీష్వా పాలన నాటి దుర్మార్గమైన కుల కట్టుబాట్లు, అణచివేతను, సమకాలీన కుల, మత, జాత్యహంకార అసహన మారణకాండల నేపథ్యంలో కోరేగావ్ విజయం దళిత ధిక్కార సంకేతంగా నిలుస్తుందని భావించిన అంబేడ్కర్ 1927 నుంచి ఒక విజయోత్సవ సంబరంగా జరిపారు. ‘మనుషులు ఎప్పుడైతే తమనూ, పరిస్థితులనూ విప్లవీకరించుకోవడంలోనూ, ఇదివరకెన్నడూ లేని దాన్ని సృష్టించడంలోనూ నిమగ్నమై ఉన్నట్లు కనిపిస్తారో, అటువంటి విప్లవాత్మక సంక్షోభదశల్లో గతానికి సంబంధించిన భూతాలను ఆతృతగా తమకు ఊడిగం చేసేందుకు ఆవాహన చేస్తారు. వాటి నుంచి పేర్లనూ, యుద్ధ నినాదాలనూ, వేషాలనూ అరువు తెచ్చుకుంటారు’ అని ఒక పాశ్చాత్య మేధావి చేసిన వ్యాఖ్యానం భీమా కోరేగావ్ స్మారక సంబురాలలో మనం గుర్తించవచ్చు. దేశవ్యాప్తంగా వివిధ రకాల విద్వేషాలు వ్యవస్థీకృతమవుతున్న తరుణంలో శాస్త్రీయ, హేతబద్ధ పరిష్కారం అందుబాటు కానపుడు, వాటి పరిష్కారం కోసం సమూహాలు తమ అస్తిత్వ మూలాలను ఆబగా అన్వేషించి, తమకు తటస్థపడిన, గతం నుంచి కొనసాగిన (లభించిన, అందిన) పరిస్థితుల్లో కార్యాచరణకు దిగుతారు. బాధిత సామాజిక సమూహాలు తమ మూలాలను వెతుక్కునే క్రమంలో ఇలాంటి స్ఫూర్తిదాయక చారిత్రక ఉదంతాల కోసం ప్రయత్నించడం సహజం. పూలే రచనల్లో హిందూ పురాణాల్లోని రావణుడు, నరకాసురుడు వంటి పాత్రలపై వ్యాఖ్యానాలు దళిత, బహుజన సమూహాలకు ప్రతీకగా ఉండటమూ అలాంటిదే.

ప్రపంచ ఆర్థిక సామాజిక సంక్షోభం నేపథ్యంలో మత, జాతి తదితర అస్తిత్వ దురహంకార భావజాలంతో ఫాసిస్టు/ఫాసిస్టు ధోరణి గల రాజ్యాలు అంతర్జాతీయంగా ఉనికిలోకి వచ్చాయి. భారత్‌లో కులం, మతం రూపంలో ఫాసిజం వివృతమవుతుండడం ప్రజాస్వామిక వాదులకు ఆందోళన కలిగిస్తోంది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రాజకీయ– సామాజిక– ఆర్థిక విధానపరమైన ప్రత్యేకతలు కాకుండా కుల, మత, జాతి తదితర అస్తిత్వాల ప్రాతిపదికన సామాజిక సమూహాలను రెచ్చగొట్టి ఓటు బ్యాంకులను సృష్టించుకోవాలని చూస్తున్న వివిధ అస్తిత్వ ఉద్యమ సంస్థలు, రాజకీయ పార్టీల కార్యకలాపాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మహారాష్ట్ర పరిణామాల నుంచి గుణపాఠం తీసుకోవాలి.

వీచే ప్రతిగాలి



కవిత

వీచే ప్రతిగాలి అడుగడుగునా
నిందించే అధికారం నాకు కదలాడుతుంది...
రెక్కలొచ్చి నువ్వు ఎగిరితే...
ఆ అడుగడుగునా నే నడిచే వేదన
లోచించని నీ హృదయాన్ని వెంబడిస్తుంది
ప్రేమించే ప్రేమ వెనుదిరిగితే...
నాలో శ్వాసించే హృదయం
కడసారిగా నీ రాకకై స్వరం విప్పి,
నీ కన్నుల వెంట ధారలా మెదులుతుంది చెలి!!
నిందించే నాలో..
ప్రేమించే స్వరం నీడలా నిన్ను వెంబడిస్తుంది గానీ
నీకు భరించే అధికారం ఎన్నటికీ కల్పించదు.

- ఉడుత డింపుల్ శ్రీవల్లి
మహాత్మాగాంధీ యూనివర్సిటీ, నల్లగొండ
9440898650



మంచిమాట



‘నీకోసం జీవిస్తే...
నీలోనే జీవిస్తావు.
జనం కోసం
జీవిస్తే..
జన హృదయంలో
నిలిచిపోతావు.’

- బి.ఆర్. అంబేడ్కర్

‘పోడు’ పాడుచేయొద్దు!

అభివృద్ధి పేరుతో, పారిశ్రామికరణ పేరుతో పాలకవర్గాలు సామ్రాజ్య వాద అభివృద్ధి నమూనాలో అంతం చేస్తున్నారు. పారిశ్రామికరణ పేరుతో ఆదివాసీ ప్రాంతాలను స్మశానవాటికగా సంస్కృతిని నిర్వీర్యం చేసి ఏజెన్సీ లో గిరిజనేతరుల దోపిడికి మార్గం సిద్ధం చేస్తున్నారు. ఆదివాసీలనూ నిలువునా నిర్వాసితులు చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెంలో గుండాల మండలంలో సింగరేణి ఓపెన్ కాస్ట్‌లు తీసి ఆదివాసీల జీవన విధానాన్ని విధ్వంసం చేయాలని కేసీఆర్ కుట్రపన్నుతున్నారు. గుండాల నుంచి భూపాలపల్లి వరకు డజన్ల కొద్దీ ఓపెన్‌కాస్టులు ప్రారంభించడానికి టీఆర్ ఎస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. కోల్ కారిడారూ ఏర్పరచడానికి పాల కులు ప్రయత్నిస్తున్నారు. సింగరేణి సంస్థ బొగ్గు గనుల తవ్వకాలపై ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ జిల్లాలోని ఆదివాసీ ప్రాంతాలనూ గోదావరి నదీతీరాన గ్రామాలనూ, పట్టాలను అది కూడా ఏజెన్సీ ప్రాంతమైనా ఐదవ షెడ్యూల్ ఆదివాసీ భూభాగాలను ఓపెన్‌కాస్టుల రూపంలో ధ్వంసం చేయడానికి, ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్న సహజ వనరులు ఖనిజ సంపదనూ దొడ్డిదారిలో దోచుకొని ఆదివాసులను పీల్చిపిప్పిచేసి అమెరి కన్ సామ్రాజ్య వాదులకు ధారాదత్తం చేయాలని కేసీఆర్ కలలు కంటున్నారు. అధిక ఉత్పత్తి, అధిక లాభాల పేరుతో సింగరేణి యాజ మాన్యం చేపడుతున్న ఈ విధ్వాంసానికి పాలకులు అన్నిరకాల అండ దండలు అందిస్తున్నారు. ఆదివాసీలు, ఆదివాసేతరులు తమ పంట భూములనూ, నివాస ప్రాంతాలనూ, బతుకుదెరువు కోల్పోయి జీవించే హక్కును కోల్పోతున్నారు. ఓపెన్‌కాస్టుల కోసం నిర్వాసితులు విలువైన భూమి కోల్పోయి తాము ఎంతో అనుబంధం పెంచుకున్న గ్రామాలు, పశు సంపద కోల్పోయి ఉపాధి లేక అనాధలుగా బతుకుతున్నారు. ఓపెన్‌కాస్టు గనులు కారణంగా ఉత్తర తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో 124 గ్రామాలు కనుమరుగయ్యాయి. రాష్ట్రంలో 31 ఓపెన్‌కాస్టులు, 6 అండర్‌గ్రౌండ్ మైన్స్ ఉన్నాయి. మరో 20 ఓపెన్‌కాస్టులు వస్తాయని సింగరేణి డైరెక్టర్ చెబుతున్నారు. ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు వల్ల సమీప గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి చెరువులు ఇంకిపోయి వ్యవసాయం కుంటుపడటం, ఎగిసి పడే దుమ్ము, ధూళి, ప్రకంపనల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గుండాల నుంచి భూపాలపల్లి వరకు వున్న లక్షలాది ఎకరాల భూమి, వ్యవసాయం పూర్తిగా దెబ్బతిని ఆదివాసీలు సర్వనాశనమవుతారు. వందలాది గ్రామాలు నామరూపాలు లేకుండా సమాధి కానున్నాయి. ఆదివాసీలు జీవన ఆధారాలు ధ్వంస మవుతాయి. వేలాది ఆదివాసీలు, ఆదివాసేతరులు పశు సంపద, సహజ వనరులు విస్థాపితులవుతారు. వాయుకాలుష్యం జలకాలుష్యం పెరిగి అనేక దుష్పరిణామాలతో ప్రజలు ఇక్కట్లనూ ఎదుర్కొంటారు. వాతా వరణ కాలుష్యం పెరిగి ప్రజలు క్షయ, ఉబ్బసం, క్యాన్సర్ ఇంకా అనేక వ్యాధుల బారిన పడి శారీరకంగా అవస్థలు ఎదుర్కొంటారు. ఓపెన్ కాస్టులు తవ్వడం మూలంగా భూమి లోపల నిక్షిప్తమైన సల్ఫర్ వాయు వులు వాతావరణంలో కలిసి క్యాన్సర్ జబ్బులకూ దారితీస్తుంది. ప్రభుత్వాలు మారినా ఓపెన్‌కాస్టు పట్ల విధానంలో మార్పులేదు. ప్రపంచ బ్యాంకు ప్రవేశపెట్టినా సంస్కరణలు అమలు చేస్తున్నారు. ఓపెన్ కాస్టు లను ప్రోత్సహిస్తూ అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను మూసివేస్తూ, కార్మికుల సంఖ్య తగ్గిస్తూ భారీయంత్రాలనుపయోగిస్తున్నారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ ఆర్థిక విధానాలు ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీ ప్రజల్లో పెనుసంక్షోభం సృష్టిస్తున్నాయి. నూతన ఆర్థిక సంస్కరణలు ‘న్యూ కోల్ పాలసీ’ కోల్ కారిడార్‌లో భాగంగా సింగరేణి యాజమాన్యం బొగ్గు వెలికితీయడం ప్రధాన విధానంగా పెట్టుకొని అండర్‌గ్రౌండ్ గను లకు



> ఖమ్మం జిల్లా ఏజెన్సీలో ఉన్న సింగరేణి సంస్థలో ఇల్లందు, మణుగూర్, కోయగూడెం, కొత్త గూడెం, సత్తుపల్లిలో ఉన్న ఓపెన్‌కాస్టుల్లో కొన్ని లక్షలమంది ఆదివాసీలు భూములు కోల్పోయి నిర్వాసితులవుతున్నారు. దీనిపై ఏ కార్మికసంఘం మాట్లాడదు. గుండాల మండలం పూర్తి ఆదివాసీ మండలం కావడంతో సింగరేణి వస్తే గిరిజనేతరుల వలసలు విపరీతంగా వచ్చి గిరిజనేతరుల దోపిడి పెరిగిపోయి ఆదివాసీల అస్తిత్వానికే పెను ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. గిరిజనేతర శక్తులు ఆదివాసీ చట్టాలను అతిక్రమిస్తుండంతో ఆదివాసీలు విస్తాపితులవుతున్నారు.

స్వస్తిపలికి ఓసీలను ఏర్పాటుచేసి గుత్తపెట్టిబడిదారులకూ, బహుళ జాతి సంస్థలకూ బడా కాంట్రాక్టర్లకూ లీజుకిచ్చి అతిచౌకగా బొగ్గు ఉత్పత్తి చేస్తూ, అభివృద్ధి ముసుగులో లక్షలాది ఆదివాసీలను నిర్వాసితులు చేస్తున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండానే ప్రజలు ఆమోదించారని నివేదికలు తయారుచేసుకొని ఓసీలు ప్రారంభిస్తున్నారు. సింగరేణికి వ్యతిరేకంగా ఎక్కడైనా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తే ఓసీలను వ్యతిరేకించే వారిని ముందస్తుగా అరెస్ట్ చేయటం, బెదిరించటం జరుగుతోంది. సింగరేణి కార్మికులకూ మస్టర్లు వేసి రప్పించుకొని, వారితో సభ నిర్వహిస్తున్నారు. ప్రపంచదేశాల్లో కూడా అత్యధిక బొగ్గుతో పారిశ్రామిక అవసరాలు ఉన్నప్పటికీ, అక్కడి ప్రజలు ఓసీలనూ వ్యతిరేకించడంతో ఆయా దేశాలు ఓపెన్‌కాస్టు మైనింగ్ క్రమంగా తగ్గిస్తున్నాయి. పోడు భూములపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీలకు ఇప్పటివరకూ పట్టాలు లేవు. అడవుల రక్షణకు చర్యలు చేపట్టాలి. వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు ఆదివాసీలకు తెలియజేసి ఆదివాసీల పోడు భూములనూ మోటర్లు ఇచ్చి భూములనూ అభివృద్ధి చేయాలి.

ఖమ్మం జిల్లా మణుగూర్ ప్రాంతంలో 20 ఆదివాసీ గ్రామాలను బలవంతంగా ఖాళీచేయించి అక్కడ ఓపెన్‌కాస్టులు తీస్తున్నారు. ఆ 20 గ్రామాల ఆదివాసీలకు పునరావాసం కల్పించట్లేదు. కోయగూడెం, ఇల్లందు, కొత్తగూడెం, సత్తుపల్లి ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ఆదివాసీలు జీవించే హక్కును సింగరేణి కాలరాస్తున్నది. ఏజెన్సీ ప్రాంతం లో ఉన్న ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల వల్ల ఆదివాసీలకు ఎంత మేలు జరిగింది? ఎంత కీడు జరిగింది? ఎంతమందికి ఉపాధి కల్పించారో నేటి పాలకులు చెప్పగలరా? చెప్పలేరు– ఖమ్మం జిల్లా ఏజెన్సీలో ఉన్న సింగరేణి సంస్థలో ఇల్లందు, మణుగూర్, కోయగూడెం, కొత్త గూడెం, సత్తుపల్లిలో ఉన్న ఓపెన్‌కాస్టుల్లో కొన్ని లక్షలమంది ఆదివాసీలు భూములు కోల్పోయి నిర్వాసితులవుతున్నారు. దీనిపై ఏ కార్మికసంఘం మాట్లాడదు. గుండాల మండలం పూర్తి ఆదివాసీ మండలం కావడంతో సింగరేణి వస్తే గిరిజనేతరుల వలసలు విపరీతంగా వచ్చి గిరిజనేతరుల దోపిడి పెరిగిపోయి ఆదివాసీల అస్థిత్వానికే పెను ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. గిరిజనేతర సామ్రాజ్యవాదం ఆదివాసీల చట్టాలు సంస్కృతినే సవాల్ చేసేవిధంగా ఆదివాసీలు మరింత విస్తాపితులవుతారు. గుండాల మండలంలో 80 శాతం ఆదివాసీలకు పోడు భూమి హక్కు పత్రాలు ఇవ్వలేదు. గుండాల మండలంలో 90 శాతం ఆదివాసీలు పూర్తిగా పోడు వ్యవసాయమే జీవనాధారం. ఇప్పుడు ఆ పోడు భూములనూ సింగరేణి రూపంలో ఓపెన్‌కాస్టులు మాయం చేస్తుంటే అమాయక ఆదివాసీలు ఏం చేయాలో, ఏం మాట్లాడాలో తెలియక ఎవరికి చెప్పుకోవాలో తెలి యక మధన పడుతున్నారు. గుండాల మండలంలోకి సింగరేణి వస్తే మాకేంటి లాభమని ఆదివాసీలు ప్రశ్నిస్తున్నారు. పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఈ నాగరిక సమాజంలో ఉన్న ఈ గిరిజనేతర పార్టీలు, గిరిజనేతర కార్మిక సంఘాలు ఆదివాసీలకూ సమాధానం చెప్పాలి. గుండాల మండలం నుంచి భూపాలపల్లి వరకు ఉన్న ఆదివాసీ నేలతల్లిని చెర బట్టి దొడ్డిదారిలో దోచుకోవాడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ఈ ప్రాంత ప్రజలు ఆదివాసీలు జెండాలకు అతీ తంగా ఓపెన్‌కాస్టులనూ వ్యతిరేకిస్తూ, సింగరేణిని వ్యతిరేకిస్తూ పోరాట కమిటీగా ఏర్పడ్డారు. అవకాశవాద రాజకీయాలకు అవకాశం లేకండా ఓపెన్‌కాస్టులనూ వ్యతిరేకిస్తూ అన్ని పార్టీలు, ఆదివాసీ సంఘాలు, ప్రజాసంఘాలు ఓపెన్‌కాస్టులకు వ్యతిరేకంగా పోరుబాటకు సిద్ధమయ్యారు.

◆ వూకె రామకృష్ణ దొర
ఆదివాసీ రచయితల సంఘం అధ్యక్షులు
9866073866

రజనీపై బీజేపీ ముద్ర!

రెండు దశాబ్దాలకు పైగా ఊహాగానాల కథనాల అనంతరం రాజకీయ రంగప్రవేశం జరుపుతున్నట్లు సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రకటించి తమిళనాడులోనే కాకుండా జాతీయ స్థాయిలో సంచలనం కలిగించారు. రజనీకాంత్ ఈ ప్రకటన చేసిన సమయాన్ని వ్యూహాత్మకంగా ఎంచుకున్నట్లు అర్థమవుతోంది. తమిళనాడు తీవ్రమైన రాజకీయ నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్లు స్పష్టమైన తరువాత అదను చూసుకొని ప్రకటన చేయడంతో పాటు చకచకా సన్నాహాలు ప్రారంభించినట్లు కనబడుతున్నది. రెండు దశాబ్దాలకు పైగా తమిళ రాజకీయాలను గట్టి ప్రత్యర్థులుగా డీఎంకే అధినేత కరుణానిధి, అన్నా డీఎంకే అధినేత్రి జయలలిత శాసించారని చెప్పవచ్చు. వారి ముందు నూతన పార్టీలు ఏర్పాటు చేసి రాష్ట్ర రాజకీయాలపై అదుపు సాధించాలని ప్రయత్నం చేసిన వైకో, రామదాస్, విజయకాంత్ వంటి అనేకమంది చతికిలపడ వలసివచ్చింది. జయలలిత ఆకస్మిక మరణానికి గురికావడం, కరుణానిధి అనారోగ్యంతో ఇంటినుంచి కదలలేని పరిస్థితిలో ఉండడంతో ‘నాయకత్వ శూన్యత’ ఏర్పడినట్లు నిర్ధారించుకొని రజనీ రాజకీయ రంగప్రవేశ ప్రకటన చేశారు. ముఖ్యంగా ఆర్కే నగర్ ఉపఎన్నిక ఫలితం ద్వారా ఈ విషయాన్ని నిర్ధారణ చేసుకున్న తర్వాతే రాజకీయ ఏర్పాటు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు కనిపిస్తున్నది.

ఆర్కే నగర్ ఉప ఎన్నిక ద్వారా ప్రజలు రెండు ప్రధాన పార్టీల పట్ల తమ అపనమ్మకాన్ని వెల్లడి చేశారని, దినకరన్ గెలుపు తాత్కాలికమేగానీ మొత్తం రాష్ట్రానికి నాయకత్వం వహించగల సత్తా ఆయనకు లేదని రజనీ నిర్ధారణకు వచ్చారు. ఆయనకు నిర్దుష్టమైన రాజకీయ విధానంగానీ, పరిపాలనకు సంబంధించి స్పష్టమైన అవగాహనగానీ ఉన్నట్లు కనిపించడంలేదు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ సుబ్రమణ్య స్వామి ‘అతనొక నిరక్షరాస్యుడు’ అంటూ అత్యంత అవమానకరంగా ప్రకటన చేయడం తీవ్ర అభ్యంతరకరం. కేవలం ఉన్నత విద్యావంతులు, స్వామి వలే విదేశీ డిగ్రీలు ఉన్నవారు మాత్రమే ఈ దేశానికి మంచి పాలన, రాజకీయాలు అందిస్తారని కోవడం మూర్ఖత్వమే అవుతుంది. వాస్తవానికి ఉన్నత విద్యావంతు లైన ఉన్నతాధికారులే దేశంలో అవినీతి, అక్రమాలకు కొండంత అండగా ఉంటున్నారు. భారత్‌తో పాటు సుమారు 60 ఆసియా, పసిఫిక్ దేశాలు స్వాతంత్ర్యం పొందాయి. అయితే కేవలం భారత్‌లో మాత్రమే ప్రజాస్వామ్య వ్యవస్థ సుస్థిరంగా మనగలుగుతోంది. ఎంతో బలమైన, తిరుగులేని నాయకులను సైతం ప్రజలు బ్యాలట్ ద్వారా గద్దె దించుతున్నారు. అధికార మార్పిడి ఎటువంటి అలజడి లేకుండా ప్రశాంతంగా సాగుతున్నది. ఇందుకు కారణం ఈ దేశంలో నిరుద్యోగులుగా, పేదలుగా భావించి చులకనగా చూస్తున్న సగటు ఓటర్లే అని వేరే చెప్పనవసరం లేదు. కామరాజ్ వంటి పెద్దగా చదువులేని నాయకులే గాకుండా చెప్పుకోదగిన విద్యార్హతలు లేని ఇందిరాగాంధీ వంటి నాయకులు దేశంలో కీలక మార్పులకు కారకులయ్యారు. స్వామి ఆ విధమైన ప్రకటన చేయడం అహంకారమే కాగలదు. అయితే రజనీని బీజేపీ నడిపిస్తోందని జరుగుతున్న ప్రచారం ఆయనకు శాపంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. పైగా ‘ఆధ్యాత్మిక రాజకీయాలు’ అని ఆయన వాడిన పదజాలం పెనుముప్పుగా మారే ప్రమాదం కనిపిస్తున్నది. కరుణానిధి వృద్ధాప్యంలో



పడి, అనారోగ్యంతో చిక్కుకోవడంతో డీఎంకేలో ద్రవిడ సిద్ధాంత పటుత్వం సడలి పోతున్నది. స్టాలిన్ వంటి నాయకులు దేవాలయాలు సందర్శించడం గతంలో ఊహించని అంశం. ‘ఆధ్యాత్మిక రాజకీయం’ అని పేర్కొనడం ద్వారా తమిళనాడులో బీజేపీకి తగు ప్రాతిపదిక ఏర్పరచే ప్రయత్నం రజనీ చేస్తున్నట్లు పడుతున్న ముద్రను తమిళులు ఏమేరకు సహిస్తారో చూడవలసి ఉంది. వాస్తవానికి జయలలిత మృతి తరువాత బీజేపీ కొన్ని తప్పటడుగులు వేయడం, తెరచాటున రాష్ట్ర రాజకీయాలను శాసించాలనుకోవడం ప్రజల ఆగ్రహానికి గురైంది. అందువల్లనే ఆర్కే నగర్‌లో నోటా కన్నా తక్కువ ఓట్లు బీజేపీ అభ్యర్థికి లభించాయి. దక్షిణాదిన పట్టు సంపాదించుకోవాలని పట్టుదలతో ఉన్న బీజేపీ అగ్రనాయకత్వం దక్షిణాది ప్రజల మనోభావాలను గ్రహించే ప్రయత్నం చేయడం లేదు. తొలినుంచి ఉత్తరాది నాయకత్వం ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా దక్షిణాది ప్రజలున్నారు. తమిళనాడులో గతంలో చెలరేగిన హిందీ వ్యతిరేక ఉద్యమంగానీ, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ సంచలన రాజకీయ విజయాలు గానీ, కర్ణాటకలో బీజేపీ ఓటమి చెందడంగానీ బీజేపీ గుర్తించలేదు. ఢిల్లీలోని నాయకులు రిమోట్ కంట్రోల్‌తో ఈ ప్రాంతపు రాజకీయాలను నియంత్రించే ప్రయత్నాలను ఇక్కడి ప్రజానీకం ఎప్పుడూ తట్టుకోలేదని స్పష్టమవుతోంది. జయలలిత మృతిచెందగానే ముందుగా పన్నీరు సెల్వాన్ని బీజేపీ దగ్గరకు తీసుకొంది. ధనబలం లేక ఆయన బలాన్ని సమీకరించుకోలేక పోయారు. దానితో శశికళ ధనబలం ప్రయోగించి కొందరు బీజేపీ నాయకులను ప్రసన్నం చేసుకోగలిగారు. అందుకనే పళనిస్వామిని ముఖ్యమంత్రి చేయగలిగారు. ఆయనకు మద్దతు ఇవ్వడం ద్వారా బీజేపీ బలపడగలదని కొందరు నాయకులు అధిష్టానాన్ని నమ్మించారు. అంతా వట్టిదేనని తేలడంతో ప్రధాని మోదీ ఇన్‌ఛార్జ్ గవర్నర్‌ను మార్చడం, కరుణానిధిని పరామర్శించడం, ఢిల్లీలో తన ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకోమని ఆహ్వానించడం వంటి పనులు చేశారు. అటు అన్నా డీఎంకె, ఇటు డీఎంకేలతో సయోధ్య కుదరదని గ్రహించి ఇప్పుడు రజనీ పార్టీ ఏర్పాటు చేసేటట్లు చేస్తున్నారని కథనాలు వెలువడటం ఒకవిధంగా రజనీకాంత్‌కు శాపంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అటువంటి ప్రమాదాన్ని ముందే గ్రహించిన రజనీకాంత్ వచ్చే ఎన్నికలలో అన్ని సీట్లకు పోటీచేస్తానని ప్రకటించడం ద్వారా మరే పార్టీతో పొత్తుకు తలపడే ప్రసక్తిలేదని స్పష్టంచేసినట్లుగా పరిశీలకులు భావిస్తున్నారు. అయితే లోక్ సభ ఎన్నికల విషయం అప్పుడు చూసుకొంటామని చెప్పడం ద్వారా బీజేపీకి మద్దతు ఇచ్చే అవకాశం లేకపోలేదని సంకేతం ఇచ్చారు. ‘ఆధ్యాత్మిక రాజకీయం’ అంటే న్యాయం, సవ్యమైన రాజకీయాలని ఆయన వివరణ ఇచ్చినప్పటికీ బీజేపీకి తమిళనాడులో చొచ్చుకుపోయే అవకాశం కల్పించే అవకాశం కల్పిస్తున్నట్లు పలువురు భావిస్తున్నారు. రజనీకాంత్ ఆధ్యాత్మిక రాజకీయం రాష్ట్రంలో ప్రభావితం చేస్తున్న 60 ఏళ్ళ ద్రావిడ రాజకీయాల నుంచి విముక్తి చేస్తుందని ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త గురుమూర్తి ఈ సందర్భంగా ప్రకటించడం గమనార్హం. అభిమానులే తన బలమని, వారే అభ్యర్థులుగా ఎన్నికలలో పోటీచేస్తారని, పార్టీ ప్రచారం చేస్తారని అంటూ ప్రత్యేకంగా తన పార్టీకి కార్యకర్తల అవసరం లేదని ఆయన చెప్పడంతో నిర్దుష్టమైన రాజకీయ అవగాహన లేకుండా అడుగులు వేస్తున్నారా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

◆ చలసాని నరేంద్ర
9849569050

ఉద్యోగాల నోటిఫికేషన్ ఎప్పుడు?

మన లేఖలు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి మూడున్నర సంవత్సరాలైనా ఇంతవరకు ప్రభుత్వం గ్రూప్ 1, గ్రూప్–3, గ్రూప్–4, నోటిఫికేషన్ వెలువడించలేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలు లక్షలలో ఖాళీగా ఉన్నాయి. తెలంగాణ ఉద్యమం నీళ్ల, నిధులు, నియామకాల కోసమే జరిగింది. కానీ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇంతవరకు గ్రూప్–1, గ్రూప్–3, గ్రూప్–4, పంచాయతీ సెక్రటరీ, మొదలగు ఉద్యోగాలకు నోటిఫికేషన్ ప్రకటించలేదు. ప్రభుత్వం మళ్ళీ జోనల్ వ్య వస్థను తెరపైకి తెచ్చింది. కొత్త జోనల్ వ్య వస్థ రూపుదిద్దుకునేవరకు ఉద్యో గాలు భర్తీ ఉండదని ప్రకటించింది. ఇప్పటికే నిరుద్యోగులు ఉద్యోగాల శిక్షణ కోసం లక్షలలో ఖర్చులు భరి స్తూ ఆర్థికంగా కొట్టుమిట్టాడు తున్నారు. ఏంతో మంది నిరుద్యోగులు ఉద్యోగాల నోటిఫికేషన్స్ విడుదల చేయకపోవటం వల్ల వారి వయసు సడలింపు అర్హతను కోల్పోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అర్థం చేసుకొని వెంటనే గ్రూప్–1, గ్రూప్–3, గ్రూప్– 4, వీఆర్వో, పంచాయత్ సెక్రటరీ , జూని యర్ లెక్చర్స్, మొదలగు ఉద్యోగాల నోటిఫికెషన్స్ విడుదల చేయాలి.

- మహమ్మద్ ఫాజల్
హైదరాబాద్

అపరిశుభ్రంగా ఆర్టీసీ బస్సులు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పరిధిలో వివిధ డిపోల నుంచి వివిధ రూట్లకు వెళ్లే ఆర్టీసీ బస్సులు తరచూ మొరాయిస్తూ నిర్ణీత సమయాలలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో విఫలం అవుతున్నాయి. వరంగల్, కరీంనగర్ జిల్లాల పరిధిలో వివిధ డిపోల నుంచి బయటకు వచ్చే బస్సులు అపరిశుభ్రతకు నిలయాలుగా నిలుస్తున్నాయి. బస్సులలో చెత్త, పాన్, గుట్కాల మరకలతో ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యేలా అపరిశుభ్రత నెలకొని వుంటుంది. వరంగల్ జిల్లాలోని పరకాల, భూపాలపల్లి డిపోల పరిధిలో గల బస్సులు మరింత అధ్వాన్నంగా నడుస్తున్నాయి. సమయ పాలన పాటించడం లేదు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి.

- కామిడి సతీష్‌రెడ్డి,
పరకాల, వరంగల్

మనం
కుటుంబం

శుక్రవారం, 5 జనవరి 2018

www.manamnews.com

బింజ్ ఈటింగ్ సోషల్ స్టేటస్‌గా ఫీల్ అవుతున్న రోజుల్లో డీటాక్సిఫికేషన్ తప్పనిసరిగా మారింది. బరువు పెరగకుండా నియంత్రించడంలో డీటాక్స్ పోషించే పాత్ర అమోఘం. కానీ అసలు ఇదంతా ఏమిటో అర్థంకాక, శరీరంలో పేరుకుపోతున్న వ్యర్థాలను వదిలించే మార్గం తెలియక నానాతిప్పలు పడుతున్న యువత, కేవలం జిమ్ములకు వెళ్లి కండరాలపై ఒత్తిడి పెంచుతోంది. ఒంట్లోని రక్తాన్ని శుద్ధిచేసే ప్రక్రియనే డీటాక్స్ అంటారు. మనశరీరంలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలు, మనం తీసుకునే ఆహారంలోని వ్యర్థాలన్నీ అలాగే ఒంట్లో నిల్వ ఉండకుండా చేయడం అత్యంత అవసరం. లేదా సైడ్ ఎఫెక్ట్స్‌కు గురై, దాని ప్రభావం శరీరంలోని అన్ని అవయవాలపై పడుతుంది. శారీరక, మానసికంగా యవ్వనంతో తులతూగాలంటే ఎప్పటికప్పుడు మీలోని మలినాన్ని ఫ్లష్ చేయండి.



అతిగా ఒత్తిడికి గురవడంతోపాటు, అతిగా ఆహారం తీసుకోవడంతో మన శరీరంలో వ్యర్థాలు గూడుకట్టుకుపోయి, పలు సమస్యలను సృష్టిస్తాయి. మరి వీటిని ఎలా బయటికి పంపాలో అర్థంకాక మానసిక ఒత్తిడికి గురవుతున్నవారు మనలో చాలామంది ఉన్నారు. డీటాక్సిఫికేషన్ అంటే ఏ ప్రకృతి చికిత్సకో వెళ్లాలని, ఇందుకు కేరళకు వెళ్లి కనీసం 15 రోజుల కోర్సును స్ట్రిక్టుగా ఫాలో అవ్వాలనుకుంటారు. నిజానికి డీటాక్సిఫికేషన్ మన శరీరంలో నిరంతరంగా జరిగే ప్రక్రియగా ఉండాలి, కానీ ఎప్పుడో ఒక్కసారి డీటాక్సిఫై సెషన్ పూర్తి చేసుకుంటే చాలనుకోవడం పొరపాటు. ఎంత తరచుగా మనం డీటాక్సిఫై అవుతుంటే అంత మంచిదన్న విషయాన్ని గుర్తెరిగితే చాలా మంచి ఫలితాలను చూడవచ్చు.



డీటాక్స్ అయ్యారా?

DETAX



నీళ్లే అమృతం

మన శరీరంలోని అనవసరపు వ్యర్థాలను బయటికి పంపడంలో దివ్యౌషధంలా పనిచేసేది స్వచ్ఛమైన నీరే. ముఖ్యంగా శీతాకాలం, వర్షాకాలంలో దాహం పెద్దగా వేయకపోవడంతోపాటు, మనం తీసుకునే నీటి పరిమాణం చాలా తక్కువగా ఉండడంతో ఈ సీజన్‌లో ఎక్కువగా శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతాయి. పైపెచ్చు శీతాకాలం, వానకాలంలో ఎక్సర్‌సైజులు లేక ఇవి మరింత పెరిగిపోతాయి. అందుకే నీటిని పుష్కలంగా తీసుకోవడంతో ఆటోమేటిక్‌గా డీటాక్సిఫికేషన్ ప్రక్రియ నిత్యం జరుగుతుంది. జీర్ణక్రియను క్రమబద్ధం చేస్తూ, వ్యర్థాలను బయటికి నెట్టివేసే నీటితో మన మెటబాలిజం కూడా చురుగ్గా మారుతుంది. పండుగ-పెళ్లి భోజనాలు, బఫె పార్టీలయ్యాక చివర్లో ఓ కప్పు జింజర్ టీ తాగినా, గోరువెచ్చని నీటిని లేదా, గోరువెచ్చని నీటిలో నిమ్మరసం కలుపుకుని తాగినా తక్షణం డీటాక్సిఫికేషన్ ప్రక్రియ మొదలవుతుందని గుర్తుంచుకుంటే సరిపోతుంది.



గ్రీన్స్‌తో గ్రీజ్

ఉరుకుల పరుగుల రొటీన్‌లో ఆకలేస్తే ఎక్కడో ఓ చోట, ఏదో ఒకటి లాగించి, బండి లాగించే క్రమంలో ఆయా ఆహారపదార్థాల్లో ఉండే కల్తీలు, వృథాలన్నీ మనశరీరంలో పేరుకునిపోతాయి. అందుకే గ్రీన్ సలాడ్స్, గ్రీన్ స్మూతీలు తీసుకుంటే అవన్నీ పారద్రోలినట్టవుతుంది. అవకాడో స్మూతీ, ఆకుకూరలు వంటి గ్రీన్ వెజిటబుల్స్ హాఫ్ బాయిల్ చేసిన సలాడ్లు తీసుకుంటే మన జీర్ణక్రియలకు గ్రీజు రాసినంత ప్రయోజనం కలుగుతుంది. మలబద్ధకంతోపాటు, శారీరక బద్ధకాన్ని కూడా వదిలించేలా ఈ డీటాక్సిఫికేషన్ తోడ్పడుతుంది. ముల్లంగి, క్యారెట్, బీట్‌రూట్, బ్రాకోలి, టమోటా, పచ్చి కొబ్బెర, దోసకాయ, ఉల్లిపాయలు వంటి కూరగాయలతోపాటు మొలకలు వంటివాటిని వేయించకుండా, ఉడికించకుండా పచ్చిగానే తినడం టాక్సిన్లను తరిమేయడంలో పూర్తిగా సహకరిస్తుంది. చక్కెర, ఉప్పు, నూనె, చీజ్, పన్నీర్‌లను ముట్టుకోకుండా పచ్చి కూరగాయలు, పళ్ల ముక్కలను ఒక పూట లేద ఒకరోజు తినడంతో మనలో సరికొత్త జోష్ తన్నుకొస్తుంది.



ఉపవాసం

అప్పుడప్పుడు ఉపవాసం చేయడం వల్ల శరీరంలో వ్యర్థాలన్నీ నశిస్తాయి. అందుకే మన పెద్దలు వారాలు, పండుగలు పేర్లతో ఉపవాసం ఉండమని మనపై ఒత్తిడి తెస్తారు. ఒకపూట లేదా ఒకరోజు కడుపు మాడ్చడంకూడా టాక్సిన్లను పారద్రోలడానికి సహకరిస్తుంది. అందుకే మీకు అనుకూలమున్న రోజుల్లో కొన్ని గంటలపాటైనా ఉపవాసం ఉండేందుకు ప్రయత్నిస్తే డీటాక్స్ అవుతారు. ఫిట్నెస్‌ను పెంచే డీటాక్సిఫికేషన్‌పై మీరు సరైన ఫోకస్ పెట్టకపోతే ఆరోగ్యం-అందం రెండింటికీ ముప్పు తలెత్తుతుంది. డీటాక్సిఫై సెషన్‌లో ఉన్నప్పుడు నాన్‌వెజ్‌కు దూరంగా ఉండాలి, అప్పుడే టాక్సిన్లకు మీరు దూరంగా ఉన్నట్టు, ముఖ్యంగా నాన్‌వెజ్ ప్రియులు బయట హోటెళ్లలో తినడంతోనే టాక్సిన్లను మూటగట్టుకుంటారు కనుక బయట నాన్‌వెజ్ తినడాన్ని తగ్గించడం మంచిది.



పార్టీలకు దూరంగా

ఆల్కహాల్ అలవాటున్నవారు, ధూమపానం అలవాటున్నవారు తరచూ డీటాక్స్ కాక తప్పదు. ఆల్కహాల్, ధూమపానం శరీరంలోని జీర్ణక్రియపై చూపే ప్రభావాన్ని తగ్గించాలంటే శరీరంలోని మలినాలనే చెత్తను ఎప్పటికప్పుడు క్లీన్ చేయడం అత్యవసరం. రెగులర్ ఇంటర్వెల్‌లో డీటాక్స్ సెషన్స్ తీసుకోవడం వీరికి చాలా అవసరం.

వాకింగ్

వాకింగ్‌తో సహజంగానే మీ బాడీకి డీటాక్సిఫికేషన్ జరుగుతుంది. లాంగ్ వాక్, బ్రిస్క్ వాక్ చేసే అలవాటు ఉన్నవారికి ప్రత్యేకంగా డీటాక్సిఫై చేసుకునే అవసరం ఉండదు. జీర్ణక్రియలు వేగంగా జరుగుతూ, శరీరంలోని కొవ్వు తగ్గించడంలో వాకింగ్ అద్భుతంగా పనిచేస్తుంది. ట్రైగ్లిజరైడులపై వాకింగ్ ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. అందుకే హెవీగా తిన్నప్పుడు ఆ వెంటనే కొంతసేపు లైట్ వాకింగ్ చేయడాన్ని అలవాటుగా పెట్టుకోవడం చాలామంచిదని వైద్యులు సలహా ఇస్తున్నారు.




యోగా



రిలాక్స్డ్‌గా, రీఫ్రెష్ అవ్వాలంటే యోగాను ఆశ్రయించాల్సిందే. డీటాక్సిఫికేషన్‌లో యోగా పాత్ర చాలా కీలకమైంది. యోగాతో మన శరీరం, మనసుల్లో పేరుకున్న వ్యర్థాలు సులువుగా బయటికి పోతాయి. దీంతో హాయిగా అలసటతీరి, సరికొత్త హుషారు రీచార్జ్ కావడం ఖాయం. బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌కూడా దీనికి తోడ్పడుతుంది.

చుక్కలతో మెలికల ముత్యాల ముగ్గు

చుక్కలు, మెలికలతో కలిసి ముగ్గుల అందం ద్విగుణీకృతమవుతుంది. చూసేందుకు ఆర్ట్‌లా కనిపించినా, చుక్కల ఆధారంగా వేసే మెలికల ముగ్గులు కళాత్మకంగా కనిపిస్తాయి. ఈ ఫొటోలోని ముగ్గు ఇందుకు చక్కని ఉదాహరణ. 8 చుక్కలు 2 వరుసలు పెట్టి, అటు ఒకటి, ఇటు ఒకటి చుక్కలు వదిలి 2 చుక్కల వద్ద నిలపాలి. ఆతరువాత మధ్యలో చుక్క ఉండేలా మెలికలు తిప్పితే, కళ్లు తిప్పుకోలేనంత చక్కని ముగ్గు మీ ఇంటి ముంగిట ప్రత్యక్షమవుతుంది. మంచి రంగుల కాంబినేషన్‌తో దీన్ని నింపితే ఇక అదరోః.



సినిమా టికెట్ల ధరల పెంపునకు ఓకే

థియేటర్ యాజమాన్యాలకు హైకోర్టు అనుమతి

పెంచినరేట్లకు అనుగుణంగా పన్ను ఉండాలని సూచన

హైదరాబాద్, జనవరి 4 (మనం లీగల్ ప్రతినిధి):

సినిమా టిక్కెట్ ధరల పెంచేందుకు థియేటర్ యజమానులకు హైకోర్టు అనుమతి ఇస్తూ మధ్యంత ఆదేశాలు జారీ చేసింది. టిక్కెట్ల రేట్ల పెంపుపై నిర్ణయం తీసుకునేందుకు ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు కమిటీలు ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకునేలోగా థియేటర్ యాజమాన్యాలు రేట్లు పెంచుకోవచ్చునని గురువారం హైకోర్టు న్యాయమూర్తి ఎస్వీ భట్ స్పష్టం చేశారు. అయితే పెంచి రేట్లకు అనుగుణంగా పన్నుల చెల్లింపు కూడా ఉండాలన్నారు. హైకోర్టు షరతుల్ని థియేటర్ యాజమాన్యాలు అమలు చేస్తున్నాయో లేదో జాయింట్ కలెక్టర్లు పరిశీలన చేయాలన్నారు. ప్రభుత్వం టిక్కెట్‌రేట్లపై కమిటీ వేసి నిర్ణయం తీసుకోవాలని గతంలో హైకోర్టు రెండు రాష్ట్రాలకు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కమిటీల ఏర్పాటు/నిర్ణయం జాప్యం కావడంతో రెండు రాష్ట్రాలకు చెందిన థియేటర్ల యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. కమిటీల నిర్ణయం వెలువడే వరకు టిక్కెట్ల రేట్ల పెంపుదలకు అనుమతించాలని కోరడంతో అందుకు న్యాయమూర్తి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వాలు కౌంటర్ దాఖలు చేయాలని న్యాయమూర్తి ఆదేశిస్తూ విచారణను ఫిబ్రవరి 1కి వాయిదా వేశారు.



బాబు ఓడితేనే బీసీలకు మేలు

పాదయాత్రలో వైఎస్ జగన్

చిత్తూరు, జనవరి 4:

చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో వైసీపీ పాగా వేయాలని, పార్టీ విజయయాత్ర ఇక్కడి నుంచే ప్రారంభం కావాలని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ప్రజాసంకల్పయాత్రలో గురువారం 52వ రోజు పాదయాత్రను ఆయన అసిపిరెడ్డిగారిపల్లిలో ప్రారంభించారు. అక్కడి నుంచి కొత్తపల్లి క్రాస్, కరివేండ్లపల్లి క్రాస్, ఊటుపల్లి క్రాస్, మిట్టపల్లి, పెద్దూరు, చెరువుముందరిపల్లి, చెనకవారిపల్లి మీదగా సాయంత్రానికి కురవపల్లి చేరుకుని యాత్ర ముగించారు. ఈ సందర్భంగా జగన్ పెద్దూరులో మాట్లాడుతూ.. చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంలో అత్యధికంగా బీసీలు ఉన్నారని, వారందరికీ చంద్రబాబు ఏమైనా సాయం చేశారా అని ప్రశ్నించారు. కుప్పంలో చంద్రబాబును ఓడిస్తేనే బీసీలకు మేలు జరుగుతుందన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ గెలుపు కుప్పం నుంచే మొదలు కావాలన్నారు.

తాగు.. సాగు..నీరు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

కర్ణాటక సాగునీటి శాఖ మంత్రి పీఎస్‌వైఎస్ పాటిల్ రాష్ట్ర మంత్రి హరీశ్‌రావుకు కలిసి వినతి పత్రం సమర్పించారు. కర్ణాటకలోని తుంగభద్ర ఆయకట్టును కాపాడుకోవటానికి, తాగునీటి అవసరాలకు ఆర్డీఎస్ ద్వారా తెలంగాణ వాటా జలాలను విడుదల చేయాలని పాటిల్ కోరారు. తుంగభద్ర డ్యాంలో తెలంగాణకు 3.5 టీఎంసీల నీటి వాటా ఉందని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఆర్డీఎస్ ఆయకట్టుకు అవసరమయ్యే నీటి వినియోగంపై, కర్ణాటకకు ఎంతమేరకు నీటి వాడకానికి అనుమతించగలమనే అంశాలపై తెలంగాణ, కర్ణాటక మధ్య ప్రధానంగా చర్చసాగింది. ఆలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 7 వేల ఎకరాల ఆరుతడి పంటలకు అవసరమైన సాగునీటి వాడకంపై రెండు రాష్ట్రాల ఇంజనీర్లు అంచనా వేసిన అనంతరం మిగిలిన నీటిని కర్ణాటక వాడుకునే అంశాన్ని పరిశీలిస్తామని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించిన తర్వాత తమ నిర్ణయం చెబుతామని అన్నారు. తుంగభద్ర నీటిని వాడుకున్నదానికి బదులుగా తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడు కోరినా నారాయణపూర్ డ్యాం నుంచి జూరాలకు 2 టీఎంసీల నీటిని విడుదల చేస్తామని కర్ణాటక హామీ ఇచ్చింది. గత సంవత్సరం కూడా మహబూబ్‌నగర్ జిల్లా తాగు నీటి అవసరాల కోసం తాము నారాయణ్‌పూర్ నుంచి ఒక టీఎంసీ నీటిని జూరాలకు తెలంగాణ ప్రభుత్వం కోరిక మేరకు విడుదల చేసిన సంగతిని ఆయన గుర్తు చేశారు. కాగా, ఆలంపూర్ నియోజక వర్గంలో ఉన్న పంటని కాపాడుకుంటూనే కర్ణాటకకు తుంగభద్ర నీటిని వాడుకునేందుకు అనుమతి ఇచ్చే విషయంలో తనకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆలంపూర్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే సంపత్ అన్నారు. రాజోలిబండ డైవర్షన్ పథకం ఆధునీకరణ పనుల పై త్వరలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల సమావేశం నిర్వహించాలని ఇరు రాష్ట్రాల మంత్రులు నిర్ణయించారు.ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని గద్వాల ప్రాంతం రైతాంగానికి 87 వేల ఎకరాలకు సాగునీరందించవలసిన రాజోలి బండ డైవర్షన్ స్కీం నుంచి ప్రస్తుతం 20 వేల ఎకరాలకు కూడా సాగు నీరందడంలేదని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. అయితే ఏపీ సహకారం లేకుండా ఆర్డీఎస్ ఆధునీకరణ పనులు పూర్తికావని మంత్రి పాటిల్ అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై మూడు రాష్ట్రాల ఇరిగేషన్ మంత్రులు, కార్యదర్శులతో త్రైపాక్షిక సమావేశానికి తెలంగాణ చొరవ చూపాలని కర్నాటక చేసిన విజ్ఞప్తికి మంత్రి హరీశ్‌రావు అంగీకరించారు. ఏపీ ఇరిగేషన్ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో బుధవారమే తాను మాట్లాడానని, ఇరు రాష్ట్రాలు ఉమ్మడి ఇండెంట్ ను తుంగభద్ర బోర్డుకు పంపించడానికి అంగీకారంకుదిరిందని చెప్పారు. త్రైపాక్షిక సమావేశానికి కూడా తాను దేవినేనితో మాట్లాడతానని మంత్రి హరీశ్ తెలిపారు. ఈ సమావేశంలో కర్ణాటక విద్యా శాఖ మంత్రి తన్వీర్ షేట్, కార్మిక శాఖ మంత్రి సంతోష్ లాడ్, కర్ణాటక ఎమ్మెల్యేలు శివరాజ్ తంగిడి, అంపుల గౌడ , ప్రతాప్ గౌడ, అంపయ్య నాయక్, కేసీ కొండయ్య, బోస్‌రాజ్, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సీఎస్ జోషి, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాకేశ్ సింగ్, డిప్యూటీ సెక్రెటరీ అనిల్ కుమార్, కర్ణాటక జలవరుల విభాగం ఎం.డి. మల్లిఖార్జున గూంగే తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోయిన ఇసుకాసురులు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి కొన్ని రోజులుగా అక్రమ ఇసుక రవాణా జరుగుతోంది. ఇది తెలిసిన కారేగావ్ వీఆర్ఏ సాయిలు ట్రాక్టర్లను అడ్డుకున్నారు. మమ్మల్నే అడ్డుకుంటావా?అంటూ ఇసుకాసురులు రెచ్చిపోయారు. వెంటనే అతనిపైకి ట్రాక్టర్ ఎక్కించేశారు. ఈ ఘటనలో సాయిలు అక్కడికక్కడు మృతి చెందారు. విషయం తెలిసిన స్థానికులు, సాయిలు బంధువులు సంఘటనా స్థలానికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని అక్కడే ఆందోళకు దిగారు. పమాచారం అందిన వెంటనే స్థానిక ఎమ్మార్వో, పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేశారు. కాగా, ఈ దరాగతానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌న అంయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

12మంది పాక్ రేంజర్లు హతం



(మొదటి పేజీ తరువాయి)

గంటల వ్యవధిలో ఈ ప్రతీకార దాడితో దీటుగా బదులిచ్చారు. ఈ లక్ష్య నిర్దేశిత దాడిలో అంతర్జాతీయ సరిహద్దు ఆవల ఉన్న రెండుమూడు పాక్ భద్రతదళ శిబిరాలు కూడా ధ్వంసమైనట్లు బీఎస్ఎఫ్ జమ్ము విభాగం ఐజీ రామావతార్ తెలిపారు. అలాగే ఆ శిబిరాలకు సంబంధించిన మౌలిక సదుపా యాలు, సౌరవిద్యుత్ ఫలకాలు, ఆయు ధాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని వివరిం చారు. ప్రతీకార దాడిలో భాగంగా బుధ వారం రాత్రే పాకిస్థాన్ మోర్టార్లు ఉన్న ప్రదే శాలను జవాన్లు పసిగట్టి ఒక్కుమ్మడిగా గురి తప్పని దాడి చేశారు. దీంతో అటుపైపు పాక్ ఆయుధాలు మూగబోయాయని బీఎస్ఎఫ్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. అంతే కాకుండా గురువారం ఉదయం జమ్ము జిలా ్లలో సరిహద్దువద్ద చొరబాటుకు యత్నిం చిన దుండగులలో ఒకడిని దళాలు మట్టుబెటి ్టనట్లు పేర్కొన్నారు. ఆర్నియా సెక్టార్ నికో వాల్ సరిహద్దు శిబిరం పరిధి లో తెల్లవారు జామున 5:45 గంటలవేళ ఇద్దరు ముగ్గురు సంచరించడాన్ని జవాన్లు పసిగట్టినట్లు తెలిపారు. ఇది గమనించిన ముష్కరులు కాల్పులకు దిగడంతో ఎదురుకాల్పులు ప్రారంభించగా ఒకడు హతమైనట్లు పేర్కొన్నారు. దీంతో మిగిలిన ఇద్దరూ తప్పించుకున్నారని తెలిపారు.

జన్మదినం రోజున విషాదాంతం

పశ్చిమబెంగాల్‌లోని మూర్షిదాబాద్ వాస్తవ్యుడైన హెడ్-కానిస్టేబుల్ ఆర్.పి.హజ్రా (50) కేవలం 23 ఏళ్ల చిరుప్రాయంలోనే సరిహద్దు భద్రతదళానికి ఎంపికయ్యాడు. అప్పటినుంచీ 27 ఏళ్లుగా దేశ సరిహద్దుల రక్షణలో అంకితభావంతో పహారా కాస్తున్నాడు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ సరిహద్దువద్ద గస్తీ విధుల్లో ఉండగా బుధవారం తెల్లవారుజామున 4:00 గంటల ప్రాంతంలో పాకిస్థాన్ స్నైపర్ దళం హఠాత్తుగా బుల్లెట్ల వర్షం కురిపించడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. సహచరులు తక్షణం ఆస్పత్రికి తరలించినా ఫలితం దక్కలేదు. ఆయన జన్మదినం రోజునే ఈ దారుణం చోటుచేసుకోవడంతో సహచరులం దరూ విషాదంలో మునిగిపోయారు. హజ్రాకు భార్య, కుమార్తె (21), కుమారుడు (18) ఉన్నారు. పాక్ దళాల కవ్వింపు కాల్పులకు ఆయన బలికావడంతో రగిలిపోయిన సహచరులు గురువారం ప్రతీకారం తీర్చుకున్నారు. అంతకుముందు డిసెంబరు 23న సైనికదళంలోని మేజర్‌తోపాటు ముగ్గురు సైని కులు కూడా పాక్ అకారణ కాల్పుల్లో మరణిం చారు. ఈ ఉదంతం తర్వాత రెండు రోజు లకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని శిబిరాలపై బీఎస్ఎఫ్ జవాన్లు విరుచుకుపడి ముగ్గురు పాక్ సైనికులను మట్టుబెట్టారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను టీఎస్పీఎస్సీ కమిటీ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. భేటీలో గత నియమాకాల భర్తీ విషయాల ను, రాబోయే ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చైర్మన్ ఘంటా చక్రపాణి గవర్నర్‌కు వివరించారు. చిత్రంలో కమిటీ సభ్యులు విఠల్, భానోతు చంద్రావతి, మథీనుద్దీన్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీలకు వయసు ధ్రువీకరణ తప్పనిసరి

శబరిమల అయ్యప్ప ఆలయ నిబంధన



తిరువనంతపురం, జనవరి 4: ఇకపై శబరిమల అయ్యప్ప దర్శనానికి వెళ్లే మహిళలు తప్పనిసరిగా వయసు ధ్రువీకరణ సర్టిఫికెట్‌ను వారి వెంట ఉంచుకోవాల్సిందే. అలా తెచ్చుకోని వారిని దర్శనానికి అనుమతించేదిలేదని ట్రావన్‌కోర్ దేవస్వం బోర్డు అధ్యక్షుడు పద్మకుమార్ తెలిపారు. ఆలయ సంప్రదాయాలను కాపాడుకోవడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన వెల్లడించారు. 10 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న స్త్రీలకు ఆలయ ప్రవేశం నిషిద్ధమని, కానీ ఇటీవల కాలంలో 260 మంది మహిళలు ఈ నిబంధనను ఉల్లంఘించి అయ్యప్ప దర్శనానికి ప్రయత్నించారని చెప్పారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు అయ్యప్ప భక్తులు శబరిగిరికి కాలి నడక మొదలుపెట్టే పంపా నదీ ప్రాంతంలో వయసు ధ్రువీకరణ పత్రాల తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని పద్మకుమార్ తెలిపారు. ఆధార్ సహా ఏ ప్రభుత్వ ధ్రువీకరణ తెచ్చుకున్నా మహిళలను అనుమతిస్తామని, తనిఖీలు చేసే సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నిర్వాసితులను ఆదుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)



కేటీఆర్ నిర్వాసితులతో మాట్లాడారు. ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా 3టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఇంటికో ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. నిరక్ష్యరాస్యులు ఉంటే వారికి శిక్షణ ఇప్పించి ఉద్యోగం ఇస్తామన్నారు. నిర్వాసితుల్లో పూర్తిగా నిరుపేదలు ఉంటే ప్రభుత్వం మంజూరు చేసే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో వారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. వచ్చే జూలై నాటికి నీళ్లు తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. మంది మాట లు విని రిజర్వాయర్ పనులను అడ్డుకోవద్దనీ, పనులు సజావుగా సాగేలా సహకరించాలని ప్రజలను కోరారు. మొట్ట ప్రాంతమైనా మండలానికి ఈ రిజర్వాయర్ వర ప్రదాయనీగా నిలుస్తుందన్నారు. పనులు వేగవంతం చేయాలని, నిర్దేశించిన సమయం కంటే ముందే ప్రాజెక్టు పూర్తి కావాలని సిబ్బందిని ఆదేశించారు. పనులు జరుగుతున్నా తీరుపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించిన కేటీఆర్ వారికి పలు సూచనలు ఇచ్చారు. నిర్వాసితుల వివరాలు సేకరించాలని జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్‌ను ఆదేశించారు. కేటీఆర్ వెంట రాష్ట్ర కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, పెద్దపల్లి ఎంపీ బాల్కసుమన్, జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాఘవరెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట మోడల్ పోలీసుస్టేషన్ ప్రారంభం

జిల్లాలోని ఎల్లారెడ్డిపేటలో నూతనంగా నిర్మించిన మోడల్ పోలీసు స్టేషన్‌ను కేటీఆర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు వ్యవస్థ ఉన్నతికి ప్రాధాన్యతనిచ్చిన ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం ఎస్పీ విశ్వజిత్ కంపాటి, ఇతర పోలీసు అధికారులతో ఆయన సమావేశం అయ్యారు. గురువారం ప్రారంభించిన మోడల్ పోలీసు స్టేషన్ రాజన్న జిల్లాలో రెండోది.

సందిగ్ధంలో సహకార 'పోరు'

గడువు సమీపిస్తున్నా.. కదలిక ఏదీ?

ఈపాటికే నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఫిబ్రవరిలో ముగియనున్న పదవీకాలం

కలెక్టర్లా.. పాలక వర్గాల కొనసాగింపా?

మీమాంసలో పాలకవర్గాలు, రైతులు

హైదరాబాద్, జనవరి 4(మనం ప్రతినిధి):

TSCAB
Telangana State Co-operative Apex Bank

రాష్ట్రంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల(డీసీసీబీ) పాలకవర్గాల పదవీ కాలం ఫిబ్రవరిలో ముగియనుంది. నెల, నెలన్నర కాలంలో పాలకవర్గాలు పదవీ విరమణ కానున్నాయి. పదవీ కాలాల ముగింపు దగ్గర పడిన క్రమంలో ఎన్నికలు నిర్వహించటం కొంత ఇబ్బందికరమైన విషయం. రైతుల సభ్యత్వ నమోదు కార్యక్రమం ఇప్పటి వరకు ప్రారంభం కాకపోవటంతో ప్రభుత్వం ఎన్నికలను నిర్వహిస్తుందా లేదా అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల్లో తొమ్మిది కేంద్ర సహకార బ్యాంకులకు పాలకవర్గాలున్నాయి. వీటి గడువు ముగింపు సమీపిస్తుండటంతో పాలకవర్గాల్లో కొంత ఆందోళన నెలకొంది. ప్రభుత్వం ఎన్నికలను నిర్వహిస్తుందా, కలెక్టర్లకు ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగిస్తుందా అనే మీమాంస పాలకవర్గాలతో పాటు రైతుల్లోనూ నెలకొంది.

ఈ పాటికే నోటిఫికేషన్..

రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర సహకార బ్యాంకులతో పాటు డివిజన్, మండల స్థాయిలో సహకార సంఘాల పాలకవర్గాలకు ఎన్నికలను నిర్వహించాల్సింది. సుమారు 10 లక్షల మందికి పైగా రైతులు సహకార బ్యాంకుల్లో సభ్యులుగా ఉన్నారు. ఐదేండ్లకు ఒకసారి జరిగే ఎన్నికలకు ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు ఎలాంటి ఎన్నికల షెడ్యూల్ విడుదల కాలేదు. కనీసం సభ్యత్వాలు, నిర్వహణకు అవసరమైన విషయాలపైనా అధికారులు దృష్టి సారించకపోవటంతో ఎన్నికలపై సందిగ్ధత నెలకొంది.

కొనసాగింపా.. ఇన్‌చార్జిల పాలనా

పాలకవర్గాల పదవీకాలం తొందర్లోనే పూర్తికానున్నా.. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదని అధికారులు చెబుతున్నారు. ఖమ్మం, వరంగల్ డీసీసీబీల్లో భారీగా అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని ఇటీవలి కాలంలో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ప్రభావం ఎన్నికలపై పడే అవకాశం ఉందనే భావన ప్రభుత్వం దృష్టిలో ఉంది. అంతేకాకుండా రైతులకు ఏటా రూ. 8 వేలు పెట్టుబడి ప్రోత్సాహకం ఇవ్వనుంది. ఈ ప్రోత్సాహకాల అనంతరం ఎన్నికలు నిర్వహిస్తే గెలుపు తమ వెంటే ఉంటుందని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమచారం. ఈ క్రమంలో కలెక్టర్లకు ఇన్‌చార్జిల బాధ్యతలను అప్పగించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వరంగల్, ఖమ్మం డీసీసీబీల్లో పాలక వర్గాల అక్రమాలపై రాష్ట్ర వ్యాప్తంగా కలకలం చెలరేగింది. దీంతో కలెక్టర్లకే బాధ్యతలు ఇస్తే బాగుంటుందని ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి సూచించినట్టు తెలిసింది. మరోవైపు ప్రస్తుతం ఉన్న పాలకవర్గాలనే ఎన్నికల వరకు కొనసాగించే అవకాశం ఉందని నేతలు పేర్కోవడం గమనార్హం. కాగా, స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు జరిగే సహకార ఎన్నికలను ఈసారి ఆ ఎన్నికల తర్వాతనే నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పాటికే గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను ఎన్నికల కమిషన్ పర్యవేక్షిస్తుంది. పంచాయతీ ఎన్నికల తర్వాత నిర్వహిస్తేనే బాగుంటుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం.

పునర్విభజన ప్రకారం..

రాష్ట్రంలో పాత జిల్లాల ప్రకారం ప్రస్తుతం తొమ్మిది డీసీసీబీలున్నాయి. జిల్లాల పునర్విభజన జరిగిన క్రమంలో 31 జిల్లాలకు జిల్లాల వారీగా డీసీసీబీలు ఏర్పాటు చేస్తారా.. లేక యథావిధిగా కొనసాగిస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. కొత్త జిల్లాల ప్రాతిపాదికన డీసీసీబీల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని అధికారులు పేర్కొంటున్నారు.

ఆటల్లేని అంగన్‌వాడీలు

(మొదటి పేజీ తరువాయి)

రెండుమూడు బొమ్మలతో కూడిన ఒక చిన్న కిట్‌ను అందించారు. వీటితో పాటు రావాల్సిన మిగిలిన ఆటబొమ్మలు రెండున్నరేండ్ల కాలంలో రాకపోవటంతో విద్యార్థులకు ఆటల చదువు లేకుండా పోయింది. ఐదేండ్లుగా అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో ఆడుకునే ఆటవస్తువు జాడలేదు. జారుడుబండ, వూగుడు బల్ల, తిరిగే కుర్చీలు, ఇతరత్రా ఆటవస్తువులు అంటే మిటో తెలియని పరిస్థితి. పిల్లలను మట్టిలో కాకుండా ఇసుకలో ఆడించాలని నిబంధనలున్నాయి. ఇసుకను కూడా అధికారులు సరఫరా చేయటం లేదని అంగన్‌వాడీ టీచర్లు వాపోతున్నారు. అంతే కాకుండా అంగన్‌వాడీ కేంద్రాల గోడలకు రంగురంగుల బొమ్మలు, చిత్రాలను వేయాల్సి ఉంది. అవి ఎక్కడా కానరావటం లేదు. నిధులు లేకుండా బొమ్మలు ఎలా వేయించాలని అంగన్‌వాడీ టీచర్లు అడుగుతున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల గోడలకు రంగులు వేసేందుకు దండిగా నిధులు మంజూరు చేస్తున్న ప్రభుత్వం అంగన్‌వాడీల పట్లా దృష్టి సారించాలని వారు కోరుతున్నారు. అంగ న్‌వాడీ కేంద్రాలకు ఆటవస్తువులు అందించటంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని టీచర్లు ఆరోపిస్తున్నారు. గతంలో బాస్కెట్‌బాల్ ఆటకోసం కిట్ ఇచ్చారు. ప్రస్తుతం దానిలో వేసి ఆడుకునేందుకు అవసరమైన బంతులు, ఇతరత్రా బొమ్మలు పిల్లలకు అందుబాటులో లేవు. బాలకేంద్రాలకు ప్లేకిట్స్ అందించడంలో అధికారులు అలక్ష్యం చూపుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. చిన్నారులను భావి భారత పౌరులుగా తీర్చి దిద్దాలని సీఎం కేసీఆర్ కంటున్న కలలకు అధికారులే గండి కొడ్తున్నారని విమర్శిస్తునానరు. నిధులు లేవంటూ అధికారులు తప్పించుకుంటున్నారని పిల్లల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బంగారు తెలంగాణలో భాగంగా పిల్లలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని సీఎం చెబుతుంటూ అధికారులు అందుకు విరుద్ధంగా చేస్తున్నారంటున్నారు. మరోవైపు పిల్లలను ఆకట్టుకునే విధంగా బొమ్మలు, ఆటవస్తువులు లేకపోవటంతో అంగన్‌వాడీ కేంద్రాలు కునారిల్లే పరిస్థితి నెలకొందనే భావన టీచర్లతో పాటు తల్లిదండ్రుల్లో నెలకొంది.

వెంటనే ఆటబొమ్మలు అందించాలి..


బంగారు తెలంగాణ నిర్మాణంలో భావి భారత పౌరులే కీలకం. ఆ దిశగా ఎదుగుతున్న చిన్నారులు బాల్యం ఆటపాటల్లేకుండా గడిస్తే వారికి తెలివితేటలెలా వస్తాయయి? అని ప్రశ్నిస్తున్న తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్య కోసం అవసరమైన బొమ్మలను, ఆటవస్తువులు, స్టడీ కిట్స్ అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. ఈ దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్‌ను, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కోరుతున్నారు.



హైదరాబాద్ సమీపంలోని నార్సింగిలో అక్షయపాత్ర ఫౌండేషన్ సహకారంతో 'మిల్లెట్ ఇన్ మిడ్ డే మీల్స్' కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

ఆర్మీ తర్వాత ఆరెస్సెస్సే


- దేశాన్ని కాపాడుతున్న సంఘ్
- ఎమర్జెన్సీ విముక్తి ఘనత కూడా
- సుప్రీం రిటైర్డ్ జడ్జి థామస్



న్యూఢిల్లీ, జనవరి 4: ఆర్మీ తర్వాత భారత్‌ను కాపాడుతున్న శక్తి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అని సుప్రీం కోర్టు మాజీ జడ్జి జస్టిస్ కేటీ థామస్ వ్యాఖ్యానించారు. ''దేశానికి ఎమర్జెన్సీ నుంచి స్వేచ్ఛ కల్పించిన ఘనత ఆరెస్సెస్‌కే దక్కుతుంది. భారత్‌లో ప్రజలు భద్రంగా ఉన్నారంటే అందుకు కారణం రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఆర్మీతోపాటు అదృష్టవశాత్తు ఇక్కడ ఆరెసెస్స్ కూడా ఉండడమే'' అని ఆయన అన్నారు. కేరళలోని కొట్టాయంలో జరుగుతున్న సంఘ్ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో థామస్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారని బీజేపీ నేత సంబిత్ పత్రా ట్వీట్ చేశారు. కాగా, 80 ఏళ్ల థామస్ 1996లో సుప్రీం న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2007లో ఆయనకు పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు. రాజీవ్ గాంధీ హత్య కేసులో నిందితులకు మరణ శిక్ష విధించిన ధర్మాసనంలో ఆయన కూడా ఉన్నారు.

కపటం కట్టిపెట్టాలి

'జాదవ్' పేరిట పాక్ వీడియోపై భారత్ ఫైర్.. ప్రచారపు ఎత్తుగడలకు విశ్వసనీయత ఉండదు



- పదేపదే ప్రదర్శిస్తే పాత విద్య కొత్తదవుతుందా?
- తిప్పికొట్టిన విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి

న్యూఢిల్లీ/ఇస్లామాబాద్, జనవరి 4: పాకిస్థాన్ పాలకులు కపట నాటకాలు కట్టిపెట్టాలని భారత్ స్పష్టం చేసింది. ఈ మేరకు పాక్ జైల్లో మగ్గుతున్న కులభూషణ్ జాదవ్ 'అంగీకార ప్రకటన' పేరిట పాక్ విదేశాంగ శాఖ వీడియో విడుదల చేయడంపై మండిపడింది. సదరు వీడియోలో 'భారత నిఘా సంస్థ తరపున తాను పని చేయడంలేదంటూ ఇండియా ప్రభుత్వం ఎందుకు అబద్ధమాడుతున్నద'ని జాదవ్ ప్రశ్నించడం కనిపిస్తోంది. అయితే, నిర్బంధంలో ఉన్న వ్యక్తిని తీవ్ర ఒత్తిడికి గురిచేసి ఇటువంటి ప్రకటనలు చేయించడం ప్రచారం కోసమేనని భారత్ తిప్పికొట్టింది. ఈ బూటకపు ఎత్తుగడలకు అంతర్జాతీయంగా విశ్వసనీయత ఉండదని గ్రహించాల్సిందిగా గడ్డిపెట్టింది. ''ఇందులో ఆశ్చర్యమేమీ లేదు. బలవంతంగా ప్రకటనలు చేయించి, వీడియోలను ప్రచారంలో పెట్టే పాతవిద్యనే పాక్ మళ్లీమళ్లీ ప్రదర్శిస్తోంది. తాజాగా విడుదల చేసిన వీడియో ఇలాంటివాటి పరంపరలో నాలుగోది కావడం ఇందుకు నిదర్శనం. కానీ, ఇలాంటి ప్రచార కసరత్తులు పనికిరావన్న వాస్తవాన్ని ఇకనైనా ఆ దేశం గ్రహిస్తే మంచిది'' అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీష్‌కుమార్ స్పష్టం చేశారు. పాకిస్థాన్ ప్రభుత్వం తనను ఎంతో ఆదరంతో చూస్తున్నదని జాదవ్ సదరు వీడియోలో ప్రకటించడం నమ్మశక్యంగా లేదన్నారు. మరణశిక్షకు గురై జైల్లో మగ్గుతూ నీరసించిపోయిన వ్యక్తితో అలాంటి ప్రకటన చేయించడం పాకిస్థాన్‌కు పెద్ద కష్టమేమీ కాదని గుర్తుచేశారు. ఇక డిసెంబరు 25న కుటుంబసభ్యులతో భేటీ తర్వాత వారు వెళ్లిపోతుండగా తన తల్లిపై భారత దౌత్యవేత్త ఒకరు కోపంగా కేకలు పెట్టారని జాదవ్ పేర్కొన్నారు. అప్పుడు ఆమె కళ్లలో భయం స్పష్టంగా కనిపించిందన్నారు. అయితే, ఎదురెదురుగా కూర్చుంటేనే స్పష్టంగా కనిపించని, వినిపించని పరిస్థితి ఉండగా వారు వెనుదిరిగిన తర్వాత తల్లిపై దౌత్యవేత్త కేకలు వేయడం జాదవ్‌కు ఎలా కనిపించిందన్నది జవాబులేని ప్రశ్నగా ఉంది. ఆయనను అద్దాల గదిలో కూర్చోబెట్టి, మాతృభాషలో కూడా మాట్లాడుకోనీయకుండా చేసిన పాక్- ఇన్ని రోజుల తర్వాత విడుదల చేసిన ఈ వీడియో విశ్వసనీయతపై అనేక అనుమానాలు రేగుతున్నాయి. ఇన్నిరకాలుగా... ఇన్నేసి సార్లు 'జాదవ్ చెప్పాడ'ంటూ పాకిస్థాన్ విడుదల చేస్తున్న వీడియోలనుబట్టి నిరాధార నిందలతో కులభూషణ్‌కు మరణశిక్ష విధించినట్లు స్పష్టమవుతోందని రవీష్‌కుమార్ అన్నారు. సమావేశం సందర్భంగా పాక్ వ్యవహరించిన తీరుపై భారత్ అభ్యంతరాలకు జవాబివ్వలేని దుస్థితిలో పడినందునే ఇటువంటి చౌకబారు ఎత్తుగడలతో కొత్త కథలు అల్లుతున్నదని దుయ్యబట్టారు.

న్యాయమూర్తుల వేతన సవరణకు లోక్‌సభ ఓకే

- శాసనాధికారం పార్లమెంటుకే.. ఎంపీలు



న్యూఢిల్లీ, జనవరి 4: న్యాయమూర్తుల జీతాల పెంపునకు సంబంధించిన సవరణ బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలిపింది. ఈమేర కు దేశంలోని 24 హైకోర్టులు, సుప్రీం కోర్టు న్యాయ మూర్తుల జీతాలను దాదాపుగా రెండు రెట్లు పెంచాలంటూ సవరణ బిల్లు గురువారంనాడు లోక్‌సభ ముందుకు వచ్చింది. ఈ బిల్లులో పేర్కొన్న సవరణల ప్రకారం.. ప్రస్తుతం రూ.1 లక్షగా ఉన్న భారత ప్రధాన న్యాయమూర్తి జీతం రూ.2.80 లక్షలకు చేరుతుంది. అదేవిధంగా ప్రస్తుతం 90 వేలు అందుకుంటున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు రూ.2.50 లక్షలు అందుకుంటారు. ఈ బిల్లుపై చర్చ జరిగిన తర్వాత లోక్ సభ దీనికి ఆమోదం తెలిపింది. కాగా, హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా సభ్యులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. శాసనాల రూపకల్పన విషయంలో న్యాయ వ్యవస్థ జోక్యం కూడదంటూ ఎంపీలు ముక్తకంఠంతో పేర్కొన్నారు. శాసనాధికారాన్ని పార్లమెంటుకే వదిలివేయాలని తెలిపారు. శాసనాల రూపకల్పనలో రోజురోజుకు పెరిగుతున్న న్యాయ వ్యవస్థ జోక్యాన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. కార్యనిర్వాహక వ్యవస్థ విధుల్లో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవడంపై పలువురు ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. 'శాసన అధికారాన్ని పార్లమెంటుకే వదిలేయాలి.. ఈ విషయంలో న్యాయవ్యవస్థ తలదూరిస్తే వివాదాలు పొడసూపుతాయి. న్యాయవ్యవస్థను నిలువరించకపోతే మరో పది, పదిహేనేళ్లలో న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థల మధ్య అగాధం ఏర్పడుతుంది' అని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ పేర్కొన్నారు. సభ్యుల వాదనకు లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ ఎం.తంబిదురై కూడా మద్ధతు పలికారు. ఈ విషయంలో పార్లమెంటే అత్యున్నతమని ఆయన స్పష్టం చేశారు. ప్రజల తరపున, ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రతినిధులకే శాసనాధికారంపై ఎక్కువ అధికారం ఉంటుందని వివరించారు.

తలొగ్గక తప్పదా!



'తలాక్' బిల్లుపై తొలగని ప్రతిష్టంభన.. సెలెక్ట్ కమిటీకి పంపి తీరాలి: విపక్షాలు

- రాజ్యసభలో నెగ్గలేకపోయిన ప్రభుత్వం
- ఆధిక్యం లేక హైరానా.. సభ వాయిదా



న్యూఢిల్లీ, జనవరి 4: చరిత్రాత్మక 'ముస్లిం మహిళల వైవాహిక హక్కుల రక్షణ బిల్లు-2017'పై ప్రతిష్టంభన గురువారం కూడా తొలగిపోలేదు. లోక్‌సభలో ఆధిక్యంవల్ల ఆమోదంలో సఫలమైన సర్కారు... రాజ్యసభలో వరుసగా రెండోరోజు కూడా ఈ పీటముడిని విప్పలేక నిస్సహాయ స్థితిలో పడింది. ఒకవైపు సభలో ఆధిక్యం చాలక నానా హైరానా పడుతుండగా మరోవైపు చర్చకు ప్రతిపక్షాలు ససేమిరా అన్నాయి. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపడంపై తీర్మానం మీద ఓటింగ్‌కు మూకుమ్మడిగా పట్టుబట్టాయి. దీంతో ఏ నిర్ణయమూ లేకుండానే రాజ్యసభ శుక్రవారానికి వాయిదాపడింది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాల డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గక తప్పని పరిస్థితి ఏర్పడింది. బిల్లులో చాలా లోపాలున్నందున సమగ్ర పరిశీలన కోసం సభా సంఘానికి పంపాల్సిందేనని విపక్ష ఎంపీలు భీష్మించడంతో ప్రభుత్వం అయోమయంలో పడింది. చివరకు మిత్రపక్షం టీడీపీతోపాటు 'స్నేహ'పక్షాలైన అన్నాడీఎంకే, బీజేడీ కూడా ప్రస్తుత రూపంలో బిల్లును వ్యతిరేకిస్తున్నాయి. దీంతోపాటు పార్లమెంటు శీతాకాల సమావేశాలు శుక్రవారం ముగుస్తుండటంతో బీజేపీ సర్కారు పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది.

మళ్లీ పార్లమెంటు భేటీదాకా ఆగాల్సిందే?

తలాక్ బిల్లును సభా సంఘం పరిశీలనకు పంపాలంటే ముందుగా సదరు సెలెక్ట్ కమిటీని ఏర్పాటు చేయాలి... అది బిల్లును లోతుగా అధ్యయనం చేసి, మార్పుచేర్పులు సూచించాలి... ప్రభుత్వం వాటిని పరిగణనలోకి తీసుకుని బిల్లును సవరించాక మళ్లీ పార్లమెంటు సమావేశాల్లోగానీ రాజ్యసభ ఆమోదం పొందే అవకాశం లేదు. అయితే, రాబోయేది బడ్జెట్ సమావేశాలు కావడంతో దీర్ఘకాలిక పెండింగ్ బిల్లులు సభ ముందుకొచ్చే అవకాశాలు తక్కువ. కాబట్టి జూన్ లేదా జూలైలో సమావేశాలదాకా ఆగాల్సి ఉంటుందని విశ్లేషకులు అంటున్నారు. ఈ స్తబ్దతను తొలగించే దిశగా రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు, సభానేత అరుణ్‌జైట్లీ బుధవారం 30 నిమిషాలకుపైగా చర్చించారు. ఇక బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపుతూ సర్కారు శుక్రవారం సభలో ఓ తీర్మానం ప్రతిపాదించాల్సి ఉంది. కాంగ్రెస్ చర్చకు సిద్ధంగా లేదని, లోక్‌సభ ఓ రకంగా, రాజ్యసభలో మరోవిధంగా వ్యవహరిస్తూ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నదని రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. అయితే, ఈ అంశంపై బీజేపీ రాజకీయాలు చేస్తున్నదని కాంగ్రెస్ దుయ్యబట్టింది. ముస్లిం మహిళలకు నిజంగా మేలు చేయదలిస్తే బిల్లును మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేస్తోంది. ఈ మేరకు ''పార్లమెంటు రబ్బరు స్టాంపు కారాదు'' అని ఆనంద్ శర్మ వ్యాఖ్యానించడం గమనార్హం. ముమ్మారు తలాక్‌తో భార్యకు విడాకులిచ్చే ముస్లిం పురుషులకు మూడేళ్ల జైలుశిక్షను ఈ బిల్లు నిర్దేశిస్తుండటాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. భర్త జైలుకెళ్తే కుటుంబపోషణ మాటేమిటని ప్రశ్నిస్తున్నాయి.

రాజ్యసభలో అధికార-విపక్షాల వాగ్యుద్ధం

రాజ్యసభలో అంతకుముందు మంత్రి స్మృతి ఇరానీ, తృణమూల్ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ మధ్య కాసేపు వాగ్యుద్ధం చోటుచేసుకుంది. 'మహిళా సాధికారత కోసం తాము పట్టుబడుతుండగా, అధికారపక్షం దూరమవుతోంద'ని ఒబ్రెయిన్ వ్యాఖ్యానించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ- 'అలాంటిదేమీ లేదు... మీరు నిజంగా మహిళా సాధికారతనే కోరుతుంటే చర్చకు ఉపక్రమించండి' అన్నారు. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని కాంగ్రెస్ ఎంపీ ఆనంద్ శర్మ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని గుర్తించేందుకు ప్రభుత్వం తిరస్కరించింది. దీంతో సర్కారు ఉద్దేశపూర్వకంగానే బిల్లును పక్కకు నెడుతున్నదని ఒబ్రెయిన్ అన్నారు. అందుకే సభా కార్యకలాపాల జాబితాలో దాన్ని చివరకు నెట్టారని విమర్శించారు. మంత్రి స్మృతి ఇరానీ చివాలున లేచి... విపక్షాలు ఏకాభిప్రాయ సాధనకు గండికొట్టే విచ్ఛిన్న చర్యలు మానుకోవాలన్నారు. మరోవైపు ఆనంద్‌శర్మ తీర్మానం చెల్లుబాటును అరుణ్‌జైట్లీ ప్రశ్నించారు. అంతటితో ఊరుకోక, సెలెక్ట్ కమిటీ బిల్లును బాగుచేయాల్సి ఉంటుందని, అందులో 'కుట్రదారులు' సభ్యులైతే అది కుదరదని వ్యాఖ్యానించారు. ఈ మాటలతో విపక్షం మండిపడుతూ నిరసనకు దిగడంతో అధ్యక్ష స్థానంలో ఉన్న డిప్యూటీ చైర్మన్ కురియన్ జోక్యం చేసుకున్నారు. జైట్లీ అభ్యంతరాన్ని తోసిపుచ్చుతూ- ''చైర్మన్ వెంకయ్యనాయుడు దీన్ని అనుమతించారు. ఒకసారి తీర్మానం ప్రవేశపెట్టాక అది సభకు సొంతమవుతుందని, దాన్ని ఉపసంహరించుకోవాలని ఆదేశించడం లేదా సవరించమనడం తనకు సాధ్యంకాదని స్పష్టం చేశారు'' అని అన్నారు.

ప్రజల కష్టాలు వాళ్లకేం తెలుసు?

రజనీ, కమల్‌లపై విజయకాంత్ భార్య విమర్శ



నెల్లికుప్పం, జనవరి 4: తమిళ అగ్ర నటులు రజనీకాంత్, కమల్‌హాసన్‌లపై మరో ప్రముఖ నటుడు, డీఎండీకే పార్టీ అధినేత విజయ్‌కాంత్ భార్య ప్రేమలత పరోక్ష విమర్శలు గుప్పించారు. ''కొత్త రాజకీయ పార్టీలు ప్రారంభిస్తామని ఈ మధ్య కొందరు బయల్దేరారు. తమిళనాడులో ఏం జరుగుతున్నదో తెలియనంతగా ఇప్పటిదాకా వారు నిద్రపోయారా?'' అని నిలదీశారు. గురువారం కడలూర్ జిల్లాలో చెరకు రైతులకు మద్దతుగా డీఎండీకే నిర్వహించిన ఆందోళనకు ఆమె నాయకత్వం వహించారు. అయితే, ప్రదర్శనకు అనుమతి లేదంటూ పోలీసులు ఆమెతోపాటు పలువురు కార్యకర్తలను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కాగా, డీఎండీకేతో సదరు కొత్త పార్టీలకు పోలికే ఉండదని, విజయకాంత్‌కు ప్రజల హృదయాల్లోగల స్థానం ఎన్నటికీ చెరిగిపోనిదని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తన భర్త 2005లో పార్టీని ప్రారంభించినప్పటి నుంచీ రైతులు, సామాన్యుల కోసం పోరాడుతున్నారని పేర్కొన్నారు. ''ఇప్పుడు కొందరు వ్యక్తులు పార్టీలు పెడతామంటూ ముందుకొస్తున్నారు. పార్టీ ప్రారంభించే హక్కు ఎవరికైనా ఉంటుంది. కానీ, వారు విజయకాంత్‌లాగా రైతు సమస్యలపై పోరాటం చేయగలరా?'' అని ప్రశ్నించారు. అలాగే కమల్‌హాసన్ పార్టీ ఏర్పాటు ప్రకటన, యాప్ ప్రారంభించడంపైనా పరోక్ష విమర్శలు చేశారు.

దినకరన్‌ది డబ్బు గెలుపు!



ఆర్కేనగర్ ఉప ఎన్నిక.. ప్రజాస్వామ్యంపై మరక

- కమల్ హాసన్ సంచలన వ్యాఖ్యలు

చెన్నై, జనవరి 4: ఆర్కే నగర్ ఉప ఎన్నికలో టీటీవీ దినకరన్ గెలుపు డబ్బుతో కొనుగోలు చేసిందని సినీ నటుడు కమల్ హాసన్ ఆరోపించారు. దీనిని కుంభకోణం అని కూడా పిలవలేమన్నారు. ఇది పట్టపగలు జరిగిన నేరమని అన్నారు. దివంగత సీఎం జయలలిత మరణంతో వచ్చిన ఈ ఉప ఎన్నిక తమిళనాడు రాజకీయాలతో పాటు భారత ప్రజాస్వామ్యంపైనా మరకలా మిగిలిపోతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. తమిళ మేగజైన్ ఆనంద వికటన్‌లో ఈ మేరకు కథనం రాశారు. ఇందులో ఏప్రిల్‌లోనే జరగాల్సిన ఉప ఎన్నికను భారీగా డబ్బు పంపిణీ జరగడంతో ఎలక్షన్ కమిషన్ డిసెంబరు 21కి వాయిదా వేసిన విషయాన్ని కమల్ గుర్తు చేశారు. అధికార పార్టీ అన్నాడీఎంకే, స్వతంత్ర అభ్యర్థి (దినకరన్) ఓట్లకు నిర్ణీత ధరలు ప్రకటించి మరీ కొనుగోలు చేసినట్లు కమల్ ఆరోపించారు. కాగా, కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలను దినకరన్ తీవ్రంగా ఖండించారు. ఇది ఆర్కే ప్రజలను అవమానించడమేనని అన్నారు. కమల్ వయసు, అనుభవానికి ఇది ఎంత మాత్రం తగదని హితవు పలికారు. తన గెలుపును జీర్ణించుకోలేకే ఇటువంటి ఆరోపణలు చేశారన్నారు. ఆర్కే నగర్ ఉప ఎన్నికలో ధన బలమే కీలకపాత్ర పోషించి ఉంటే.. అన్నాడీఎంకే విజయం సాధించేదని దినకరన్ చెప్పారు. ఎవరు అంగీకరించినా లేకున్నా.. ప్రజలు తనను గెలిపించారని అన్నారు.

రజనీది ఆధ్యాత్మిక రాజకీయం



- ద్రవిడ గడ్డపై స్థానం లేదు: స్టాలిన్

చెన్నై, జనవరి 4: సూపర్‌స్టార్ రజనీకాంత్ ఆధ్యాత్మిక రాజకీయాల ద్వారా మార్పు తెస్తామని చెబుతున్నారని, ద్రవిడ ఉద్యమాలకు పురిటి గడ్డ అయిన తమిళనాడులో ఇటువంటి పార్టీలకు చోటు లేదని డీఎంకే కార్యనిర్వహక అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అన్నారు. బుధవారం డీఎంకే అధ్యక్షుడు కరుణానిధిని రజనీకాంత్ కలిసి పరామర్శించి, ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. కరుణ, ఆయన భార్య దయాళ్ అమ్మల్ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశం అనంతరం స్టాలిన్ మీడియాతో మాట్లాడారు. ద్రవిడ ఉద్యమాన్ని తుడిచిపెట్టేందుకు ప్రజల పిలుపుతోనే రజనీకాంత్ ఆధ్యాత్మిక పార్టీ పెట్టారని కొందరు చెబుతున్నారన్నారు. రామస్వామి పెరియార్, కరుణానిధి వంటి వారు పురుడు పోసిన ద్రవిడ ఉద్యమం ముందు ఈ తరహా ప్రయత్నాలేవీ గతంలోనూ నిలబడలేదని స్టాలిన్ గుర్తు చేశారు. రజనీ డీఎంకే మద్దతు కోరితే అందుకు సిద్ధమేనా అని పాత్రికేయులు ప్రశ్నించగా.. అటువంటి నిర్ణయాలు ఎన్నికల సమయంలో తీసుకుంటామని చెప్పారు. కాగా, డిసెంబరు 31న రాజకీయ పార్టీ ప్రకటించిన రజనీ కరుణానిధిని కలవడం తమిళ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

దాణా కేసు తీర్పు మళ్లీ వాయిదా

- వరుసగా రెండోరోజూ అదే స్థితి
- లాలూ మనుషుల నుంచి బెదిరింపు
- జడ్జి శివ్‌పాల్ సింగ్ సంచలన ఆరోపణ



న్యూఢిల్లీ, జనవరి 4: దాణా కుంభకోణం కేసులో శిక్ష ఖరారు ప్రక్రియ వరుసగా రెండోరోజూ వాయిదా పడింది. ఈ కేసులో బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్‌తో పాటు మరో 15 మందిని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం దోషులుగా తేల్చింది. ఈ మేరకు గత నెల 23న రాంచీలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. దీనికి సంబంధించి జనవరి 3న శిక్ష ఖరారు చేస్తామని చెప్పింది. అయితే బుధవారం న్యాయవాది విందేశ్వర ప్రసాద్ మృతి చెందడంతో కోర్టు తీర్పు గురువారానికి వాయిదా వేశారు. గురువారం నాడు మళ్లీ శుక్రవారానికి వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ శివ్‌పాల్ సింగ్ సంచలన ఆరోపణలు చేశారు. లాలూ మనుషుల నుంచి తనకు బెదిరింపు ఫోన్‌కాల్స్ వస్తున్నాయని పేర్కొన్నారు. ఓ జాతీయ ఛానల్ కథనం ప్రకారం రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ శ్రేయోభిలాషులు తనను ప్రభావితంచేసే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో లాలూ ప్రసాద్ యాదవ్‌పై జస్టిస్ శివ్‌పాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ''మీ శ్రేయోభిలాషులు నాకు ఫోన్లు చేస్తున్నారు. సానుకూలంగా తీర్పు చెప్పాలంటున్నారు. ఆందోళన చెందకండి, నేను చట్ట ప్రకారం మాత్రమే నడుచుకుంటాను '' అని తెలిపారు. దీనిపై లాలూ స్పందిస్తూ ''మీరు స్థిమితమైన మనసుతో తీర్పు చెప్పండి'' అని జడ్జిని కోరారు. కాగా, బిహార్‌లో 21 ఏళ్ల క్రితం పశు దాణా కుంభకోణం వెలుగులోకి వచ్చింది. 1991-94 మధ్య దేవ్‌గఢ్ ఖజానా నుంచి రూ.89.27లక్షల మొత్తాన్ని తప్పుడు వివరాలతో కాజేయడానికి సంబంధించిన కేసులో సీబీఐ విచారణ జరిపి 38 మందిపై అభియోగపత్రాలు నమోదు చేసింది.

'భీమా-కోరేగావ్' హింస ఉదంతంలో మేవానీ.. ఖాలిద్‌లపై కేసు

రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని ఎఫ్ఐఆర్



పుణె, జనవరి 4: 'భీమా-కోరేగావ్' సంస్మరణ దినోత్సవం సందర్భంగా చెలరేగిన హింసకు బాధ్యులను చేస్తూ గుజరాత్ ఎమ్మెల్యే, దళిత నేత జిగ్నిష్ మేవాని, జేఎన్‌యూ విద్యార్థి నేత ఉమర్ ఖాలిద్‌పై మహారాష్ట్ర పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. డిసెంబరు, 31న జరిగిన కార్యక్రమంలో వీరిద్దరూ తమ రెచ్చగొట్టే ప్రసంగాల ద్వారా మరాఠాలు, దళితుల వ ధ్య విద్వేషపూరిత వాతావరణాన్ని రెచ్చగొట్టారని ఎఫ్ఐఆర్‌లో పోలీసులు పేర్కొన్నారు. 'భీమా-కోరేగావ్' 200వ సంస్మరణ దినోత్సవం సందర్భంగా వారిద్దరూ విద్వేషపూర్తి ప్రసంగాలు చేశారని, దాని వల్లే హింస ప్రజ్వరిల్లిందని పేర్కొంటూ పుణెకు చెందిన అక్షయ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. కాగా, భీమా-కోరేగావ్ హింస, తాజా పరిస్థితుల నేపథ్యంలో ముంబైలో తలపెట్టిన అఖిల భారత జాతీయ విద్యార్థుల సదస్సుకుపోలీసులు అనుమతి నిరాకరించారు. గుజరాత్ దళిత ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవాని, జేఎన్‌టీయూ విద్యార్థి ఉమర్ ఖలీద్ హాజరవుతుండటంతో ఈ సదస్సుకు చివరినిమిషంలో అనుమతి నిరాకరించినట్టు తెలుస్తోంది. ఈ సదస్సు కోసం వచ్చిన విద్యార్థులను బలవంతంగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తలపెట్టిన ఛాత్ర భారతి సభ్యులు జుహూ పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. మరోవైపు, సదస్సు తలపెట్టిన విల్లేపార్లేలోని దాస్ హాల్ ఆడిటోరియంను పోలీసులు పూర్తిగా తమ అదుపులోకి తీసుకున్నారు.

'మహా' బంద్‌లో విధ్వంసం..16 కేసులు నమోదు

ముంబై, జనవరి 4: 'భీమా-కోరేగావ్' అల్లర్లకు సంబంధించి మహారాష్ట్ర పోలీసులు మొత్తం 16 కేసులు నమోదు చేశారు. అల్లర్లకు సంబంధించి వివిధ దళిత సంఘాలకు సంబంధించి 300 మందిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, అల్లర్లలో 200 మహా ఆర్టీసీ బస్సులకు నష్టం వాటిల్లిందని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఒక్క ముంబైలోనే 16 కేసులు నమోదు చేశామన్నారు. కాగా, అల్లరి మూకల దాడిలో 30 మంది పోలీసులకు గాయాలయ్యాయని తెలిపారు. పోవాయ్, గోవందిలోనే 11 మంది పోలీసులకు తీవ్రంగా గాయాలయ్యాయని చెప్పారు.



మోదీకి నెతన్యాహు కానుక

- సంచార ఉప్పునీటి శుద్ధి వాహనం
- 14న ఇజ్రాయెల్ ప్రధాని బహూకరణ

జెరూసలెం, జనవరి 4: భారత ప్రధాని నరేంద్రమోదీకి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఒక ప్రత్యేక బహుమతి ఇవ్వనున్నారు. త్వరలో ఆయన భారత్ రానున్న నేపథ్యంలో సంచార నిర్లవణీకర వాహనం 'ది గాల్' (మొబైల్ వాటర్ డీశాలి నైజేషన్-ప్యూరిఫికేషన్ జీప్)ను కానుకగా ఇవ్వబోతున్నారు. ఈ నెల 14న ఆయన భారత పర్యటనకు రానున్నట్లు అధికార వర్గాల సమాచారం. గత ఏడాది జూలైలో మోదీ ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లినప్పుడు వారిద్దరూ కలిసి ఈ జీపులో సముద్రపు తీరంలో షికారు చేశారు. ఆ సందర్భంగా సముద్రపు నీటిని ఈ వాహనంలోని పరికరంతో అక్కడికక్కడే మంచినీరుగా మార్చి మోదీ దాహం తీర్చారు. దీని పనితీరుపై మోదీ ఆసక్తి కనబరిచారు. ఇప్పుడు అలాంటి వాహనాన్నే బహూకరిస్తారని సమాచారం.

మనం మూవీ
manammovie
8
హైదరాబాద్ | శుక్రవారం, 5 జనవరి 2018



• బాలకృష్ణ

జై సింహా సెన్సార్ పూర్తి

నందమూరి బాలకృష్ణ హీరోగా రూపొందుతున్న చిత్రం 'జై సింహా'. కె.ఎస్.రవికుమార్ దర్శకుడు. సి.కల్యాణ్ నిర్మాత. ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకొని 'యుఏ' సర్టిఫికేట్ పొందింది. సంక్రాంతి సందర్భంగా సినిమా జనవరి 12న విడుదలవుతుంది. సి.కల్యాణ్ మాట్లాడుతూ ''బాలకృష్ణగారి 102వ సినిమాను నా బ్యానర్‌లో చేయడం ఆనందంగా ఉంది. ఎమోషన్స్, యాక్షన్, డ్రామా, డైలాగ్స్ అన్నీ పక్కాగా కుదిరాయి. నయనతార, నటాషా దోషి, హరిప్రియలు హీరోయిన్స్‌గా నటించారు. బాలకృష్ణగారు సహా అందరి సహకారంతో సినిమాను అనుకున్న సమయంలో పూర్తి చేశాం. ముఖ్యంగా బాలయ్య, నయనతార సక్సెస్‌పుల్ జోడి అని మరో సారి ప్రూవ్ అవుతుంది. ఈ సినిమా ప్రేక్షకులను, అభిమానులను అలరించేలా ఉంటుంది. సినిమా సెన్సార్ పూర్తయింది. జనవరి 12న విడుదల అవుతుంది.'' అని అన్నారు.

11 సంవత్సరాల తర్వాతే..



• శంకర్

1993లో విడుదలైన 'జెంటిల్‌మేన్' సినిమాతో కోలీవుడ్‌లో తన సత్తాను చాటిన డైరెక్టర్ శంకర్. ఆ తర్వాత వరుస ఘన విజయాలతో వెనక్కి తిరిగి చూసుకునే అవసరమే రాలేదు ఈ బ్లాక్ బస్టర్ డైరెక్టర్‌కి. ఇదిలా ఉంటే...తాజాగా ఒక మీడియాకిచ్చిన ఇంటర్వ్యూలో తమిళ్ సూపర్ స్టార్‌పై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారీ దర్శకుడు. ''ఇండస్ట్రీకి వచ్చిన 11 సంవత్సరాల తర్వాత సూపర్ స్టార్ రజనీకాంత్‌ని కలిసి ఆయనతో 'శివాజి' సినిమాను చేశాను. ఆ తర్వాత 'ఎందిరన్' సినిమాను తెరకెక్కించాను. ఆయనతో రూపొందించిన మూడో చిత్రం '2.0' ప్రస్తుతం నిర్మాణాంతర పనులను జరుపుకుంటోంది. సూపర్ స్టార్‌ని కలుసుకోవడం అంత సులభమేమీ కాదు, అంతా కలలా ఉంది. ఇంకా ముందే కలిసుంటే ('జెంటిల్‌మేన్' సమయంలోనే) ఇంకో మూడు సినిమాలు చేసే అదృష్టం నాకు దక్కేది'' అని తెలిపారు శంకర్. '2.0'.. తమిళ్ న్యూఇయర్ సందర్భంగా ఏప్రిల్ 14న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.

29 గంటల్లో కోటి వ్యూస్...



• లగడపాటి శ్రీధర్

అల్లు అర్జున్, అను ఇమాన్యుయేల్ నటిస్తున్న సినిమా 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. వక్కంతం వంశీ దర్శకుడు. లగడపాటి శిరీషా శ్రీధర్ , బన్నీ వాసు, కె.నాగబాబు నిర్మాతాలు. ఈ సినిమా 70 శాతం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఇటీవల విడుదలైన ఫస్ట్ ఇంపాక్ట్ కి మంచి స్పందన వస్తోంది. ఈ సందర్భంగా లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ ''మా సినిమా ఫస్ట్ ఇంపాక్ట్ ను 29 గంటల్లో కోటి మంది చూశారు. అభిమానుల్లో ఈ సినిమా ఆశలు రేపింది. సినిమా అందుకు రెట్టింపుగా వస్తోంది. కొత్త కథ, అందుకు తగ్గ బాడీ లాంగ్వేజ్‌ను ఈ సినిమా బన్నీ చేసుకున్నారు. ఉత్తమ శ్రేణి సాంకేతికనిపుణులు పనిచేస్తున్నారు. 2018 బన్నీ ఇయర్‌గా నిలుస్తుంది. ఇంటర్వెల్ అయ్యే సరికి హిట్ టాక్ తెచ్చుకునే సినిమాను తీయాలని నేను చాలా కలలు కనేవాడిని. అయితే ఫస్ట్ ఇంపాక్ట్‌కే ఇలాంటి టాక్ రావడం చాలా ఆనందంగా ఉంది. అత్యధిక మంది చూసిన వాటిలో మూడో వీడియోగా మా ఫస్ట్ ఇంపాక్ట్ ఉండటం ఆనందంగా ఉంది. అమీర్‌ఖాన్ తర్వాత అల్లు అర్జున్ అలాంటి ఇమేజ్‌ని తెచ్చుకుంటారనిపిస్తోంది. ఏప్రిల్ 27న సినిమాను విడుదలచేస్తాం. పాట్రియాటిక్, రొమాంటిక్, ఫ్యామిలీ, సొసైటీ యాంగిల్స్ ఉంటాయి. స్ట్రాంగ్ ఎమోషన్ కూడా ఉంటుంది. అన్నీ భాషల్లోనూ డబ్ చేద్దామని అనిపిస్తోంది. కానీ ఆయా భాషల్లో బన్నీ స్పెషల్‌గా సినిమాలు చేయాలనుకుంటున్నారు కాబట్టి, ఆయనతో మాట్లాడుదామని ఆగాను. ఈ నెల వచ్చే నెల్లో కలిపి దాదాపు 35-40 రోజులు చిత్రీకరిస్తే సినిమా పూర్తవుతుంది. మార్చి కే ఫస్ట్ కాపీ వచ్చేస్తుంది. మాస్టర్ కిచాతో పాటు పీటర్ హెయిన్స్, రవివర్మ, రామ్-లక్ష్మణ్ యాక్సన్ ఎపిసోడ్స్‌ని డిజైన్ చేశారు. అవన్నీ చాలా బాగా వచ్చాయి'' అని తెలిపారు.

నయన 'కర్తవ్యం'



• నయనతార

నయనతార ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కర్తవ్యం'. గోపి నైనర్ దర్శకుడు. తమిళ చిత్రం 'ఆరమ్'ను 'కర్తవ్యం' పేరుతో ట్రైడెంట్ ఆర్ట్స్ పతాకంపై ఆర్.రవీంద్రన్, శరత్ మరార్ తెలుగులో విడుదల చేస్తున్నారు. పొలిటికల్ డ్రామాగా రూపొందిన ఈ చిత్రంలో నయనతార జిల్లా కలెక్టర్‌గా కనపడతారు. ఈ సినిమా సెన్సార్ పూర్తయ్యింది. ఈ సందర్భంగా నిర్మాత ఆర్.రవీంద్రన్ మాట్లాడుతూ ''తమిళంలో సినిమా చాలా పెద్ద విజయాన్ని సాధించింది. సెన్సార్ పూర్తయిన ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు.

మార్చిలో కొత్త చిత్రం



• నాని

రీసెంట్‌గా విడుదలైన 'ఎంసీఏ' చిత్రంతో మరో సక్సెస్‌ను తన ఖాతాలో వేసుకున్నారు హీరో నాని. ప్రస్తుతం 'కృష్ణార్జున యుద్ధం' సినిమా చిత్రీకరణలో బిజీగా ఉన్నారు..ఈ సినిమా ఏప్రిల్ 12న విడుదల కానుంది. మార్చి లోపు నాని 'కృష్ణార్జున యుద్ధం' షూటింగ్‌ను పూర్తి చేసేస్తాడట. కాబట్టి మార్చిలో కొత్త సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారట. ఈ సినిమాకు కిషోర్ తిరుమల దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై సినిమా రూపొందుతుంది.

రానా సినిమాలో మెగా హీరో...



• వరుణ్ తేజ్

విలక్షణమైన కాన్సెప్ట్స్, క్యారెక్టర్స్ ఉన్న సినిమాలు చేయడానికి ఆసక్తి చూపే హీరోల్లో రానా దగ్గుబాటి ముందున్నారు. ఈ యువ నటుడు ఇప్పుడు తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. 1971లో విడుదలైన రాజేష్ ఖన్నా చిత్రం 'హథీ మేరే సాథి' సినిమాకు ఇది రీమేక్. ఈ సినిమాకు సంబంధించిన లుక్ కూడా రీసెంట్‌గా విడుదలైంది. తాజాగా ఈసినిమాలో ఓ కీలక పాత్రలో మెగా కాంపౌండ్ హీరో వరుణ్ తేజ్ నటిస్తున్నారని తెలిసింది. వరుణ్ తేజ్ ఎలాంటి పాత్రలో కనపడతారనే విషయం త్వరలోనే తెలియనుంది. ప్రభు సాల్మన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో ఎక్కువ భాగాన్ని థాయ్‌లాండ్‌లో చిత్రీకరించనున్నారు.

ఫిబ్రవరి 9న ఇంటెలిజెంట్



• సాయిధరమ్ తేజ్

సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై. లిమిటెడ్ పతాకంపై సి.కల్యాణ్ నిర్మిస్తున్న చిత్రం 'ఇంటెలిజెంట్'. వి.వి.వినాయక్ దర్శకుడు. ఈ సినిమా ఫిబ్రవరి 9న విడుదలవుతుంది. 'ఈ చిత్రానికి సంబంధించిన మస్కట్ షెడ్యూల్ పూర్తయింది. ప్రస్తుతం క్లైమాక్స్ చిత్రీకరణ జరుగుతోంది. ఇంకా రెండు పాటలు బ్యాలెన్స్ ఉన్నాయి. జనవరి 17న షూటింగ్ పూర్తవుతుంది. ఫిబ్రవరి 9న ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం. చిరంజీవిగారికి 'ఖైదీ' ఓ మెమరబుల్ మూవీగా నిలిచింది. అలాగే 'ఇంటెలిజెంట్' సాయిధరమ్‌కి ఓ ల్యాండ్ మార్క్ మూవీ అవుతుంద'ని నిర్మాత సి.కల్యాణ్ తెలిపారు.

షాకులే షాకులు...



• రకుల్ ప్రీత్ సింగ్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్స్‌లో ఒకరిగా పేరు తెచ్చుకున్న ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్. ఈ అమ్మడు ప్రస్తుతం కార్తి సరసన ఓ తమిళ సినిమా చేస్తుంది. అయితే ఈ అమ్మడుకి ఈ మధ్య వరుస షాకులు తగులుతున్నాయి. విషయమేమంటే..తమిళంలో విజయ్, ఎ.ఆర్.మురుగదాస్ సినిమాలో హీరోయిన్‌గా రకుల్ పేరు ప్రముఖంగా వినపడింది. కానీ తీరా ఈ సినిమాలో కీర్తి సురేష్ హీరోయిన్‌గా ఓకే అయ్యింది. అలాగే సూర్య, సెల్వ రాఘవన్ సినిమాలో కూడా రకుల్ ప్రీత్ హీరోయిన్ అని వార్తలు వచ్చాయి. కానీ చివరకు సాయిపల్లవి హీరోయిన్‌గా ఖరారయ్యింది. దీంతో రకుల్‌కు ఓ చిన్నపాటి టెన్షన్ క్రియేట్ అయ్యిందంటున్నాయి ఇండస్ట్రీ వర్గాలు.

ఫిబ్రవరిలో 'తారామణి'



• ఆండ్రియా

డి.వి సినీ క్రియేషన్, యశ్వంత్ మూవీస్ పతాకాలపై నిర్మితమవుతున్న చిత్రం 'తారామణి'. ఆండ్రియా, అంజలి, వసంత్‌కుమార్ ప్రధాన తారాగణం. ఈ చిత్రం ప్రస్తుతం సెన్సార్ పూర్తి చేసుకొని 'ఎ' సర్టిఫికెట్ పొందింది. ఫిబ్రవరి నెలాఖరున ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్మాత డి వెంకటేష్ మాట్లాడుతూ ''నేటి యువత ప్రవర్తనకు అద్దం పట్టేలా తమిళంలో సినిమా మంచి ఆదరణను పొందింది. మంచి మెసేజ్ ఉన్న 'తారామణి' తమిళం లో కంటే తెలుగులో ఇంకా పెద్ద విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను. సినిమా సెన్సార్ పూర్తయ్యింది. ఫిబ్రవరి నెలాఖరులో తారామణి చిత్రాన్ని విడుదల చేయనున్నాం'' అన్నారుఈ చిత్రానికి మ్యూజిక్: యువన్ శంకర్ రాజా, డిఒపి: తేని ఈశ్వర్, కథ- దర్శకత్వం: రామ్.

మ్యూజిక్ చేయడానికి సిద్ధం - ఆర్.పి



ఆర్.పి.పట్నాయక్ తన సంగీత సారథ్యంలో 'నీతో ఏదో చెప్పాలని ఉంది' అనే మెలోడీ సాంగ్‌ను సిద్ధం చేశారు. ఈ సాంగ్ ఆదిత్య మ్యూజిక్ ద్వారా నేడు మార్కెట్లోకి విడుదలవుతుంది. ఈ సాంగ్‌ను ఆస్ట్రేలియాలో చిత్రీకరించారు. 'బాహుబలి' సినిమాలో 'మమతల తల్లి..' పాట పాడిన సత్య యామిని ఈ పాటను పాడాటమే కాకుండా అనుదీప్‌తో కలిసి ఈ పాటలో నటించారు. ఈసందర్భంగా జరిగిన పాత్రికేయుల సమావేశంలో మ్యూజిక్ డైరెక్టర్ కోటి మాట్లాడుతూ - ''ప్రస్తుతం ఉన్న సింగర్స్ ఎవరో మ్యూజిక్ కంపోజ్ చేసిన పాటలను ఆలపిస్తున్నారు. కానీ ఇండిపెండెంట్ మ్యూజిక్ అంటే..స్వంతంగా ట్యూన్‌ను కంపోజ్ చేసుకుని పాడటమే కదా..కానీ చాలా మంది అలా చేయడం లేదు. ఇకపై అలా చేస్తే బావుంటుందని నా అభిప్రాయం'' అన్నారు. ఆర్.పి పట్నాయక్ మాట్లాడుతూ - ''ఈ పాటను విడుదల చేయడానికి ఆదిత్య మ్యూజిక్ వారు ముందుకు రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ ఏడాది నుండి మ్యూజిక్ చేయడానికి నేను సిద్ధంగా ఉంటానని తెలియజేస్తున్నాను. నేను డైరెక్టర్‌గా చేశాను కాబట్టి వేరే దర్శకుడి పనిలో వేలు పెడతానని కొందరి భావన. కానీ నేను చెప్పేదేంటంటే..ఓ సినిమాకు దర్శకుడే పెద్ద. తన క్రియేటివ్ వర్క్‌లో నేను జోక్యం చేసుకోకుండా ఓ మ్యూజిక్ డైరెక్టర్‌గా నా పనిని మాత్రమే చేయడానికి ప్రాధాన్యతనిస్తాను'' అన్నారు. ఈ కార్యక్రమంలో రఘు కుంచె, విజయలక్ష్మి, వేణు, రవివర్మ, జెమిని సురేష్, యామినీ, అనుదీప్, మనీషా, ఆదిత్య మ్యూజిక్ మాధవ్, సత్యదేవ్ తదితరులు పాల్గొన్నారు.



'మనం' ప్రజల పక్షాన నిలవాలి

- సమస్యల పరిష్కారానికి వారధి కావాలి: జగన్
- పాదయాత్రలో పత్రిక క్యాలెండర్ల ఆవిష్కరణ

తిరుపతి, జనవరి 4 (మనం న్యూస్ బ్యూరో): మనం దిన పత్రిక ప్రజా సమస్యలను ప్రతిబింబిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని వైఎస్ఆర్‌సీపీ



అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఆకాంక్షించారు. ఏ రాజకీయపార్టీ కొమ్ముకాయ కుండా నిష్పక్షపాతంగా ప్రజా సమస్యలు పరిష్కారానికి వారధిగా నిలవాలని అన్నారు. చిత్తూరు జిల్లాలో ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా పాదయాత్ర చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనం దినపత్రిక క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో ప్రజలు పడుతున్న కష్టాలను పాలకులకు వివరించేలా కథనాలు ప్రచురిచాలని సూచించారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మనం రీజినల్ మేనేజర్ చెంగల్రాయుడు (గాంధీ), బ్యూరో ఇన్‌చార్జ్ కోలా లక్ష్మీపతి, ఏడీవీటీ ఇన్‌చార్జ్ కృష్ణారెడ్డి, స్టాఫ్ రిపోర్టర్లు కె.శ్రీనివాస్, గంటా సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మనం' క్యాలెండర్ ఆకర్షణీయం: టీటీడీ ఈవో అనిల్ సింఘాల్

మనం దిన పత్రిక క్యాలెండర్ ఆకర్షణీయంగా రూపొందించారని



టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ప్రశంసించారు. ఏ పత్రిక రూపొందించని విధంగా పన్నెండు పేజీలతో రంగురంగులతో ఆకర్షణీయంగా ఉందని అన్నారు. గురువారం టీటీడీ పరిపాలనా భవనంలో ఆయన తన చాంబర్‌లో మనం దినపత్రిక క్యాలెండర్లను ఆవిష్కరించారు.

విశాఖ కేంద్రంగా రైల్వేజోన్

- లోక్‌సభలో టీడీపీ ఎంపీ అవంతి శ్రీనివాస్ డిమాండ్



అమరావతి, జనవరి 4 (మనం ప్రతినిధి): విశాఖపట్నం కేంద్రంగా వెంటనే రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని అనకాపల్లి ఎంపీ అవంతి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం లోక్‌సభ జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. దేశంలో రైల్వేజోన్ లేని పెద్ద రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఒక్కటేనని అన్నారు. ఏపీలో మూడు డివిజన్లు సికింద్రాబాద్‌లో ఉండగా, వాల్తేర్ డివిజన్ భువనేశ్వర్ రైల్వే జోన్‌లో ఉన్న విషయాన్ని ఆయన లోక్‌సభలో వివరించారు. ఏపీలో ఉన్న నాలుగు డివిజన్లతో విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

3 రోజుల్లో 3 లక్షల వినతులు

- జన్మభూమి అర్జీలకు త్వరలోనే పరిష్కారం: పరకాల



అమరావతి, జనవరి 4 (మనం ప్రతినిధి): జన్మభూమి కార్యక్రమంలో మూడు రోజుల్లో ప్రజల నుంచి మూడు లక్షల వినతులు అందాయని రాష్ట్ర ప్రభుత్వ మీడియా సలహాదారు పరకాల ప్రభాకర్ వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చే ఈ అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. గురువారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజుల్లో దాదాపు 15 లక్షల మంది జన్మభూమి కార్యక్రమంలో పాల్గొన్నారని ఆయన చెప్పారు. మొత్తం 3 లక్షల వినతులు అందగా.. వాటిలో అత్యధికంగా గృహ నిర్మాణం, రేషన్ కార్డులు, పింఛన్లకు సంబంధించినవే ఉన్నాయని తెలిపారు. సాధ్యమైనంత త్వరలో వీటిని పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని పరకాల స్పష్టం చేశారు.

17న కేబినెట్ సమావేశం

- 18,19 తేదీల్లో కలెక్టర్ల సదస్సు

అమరావతి, జనవరి 4 (మనం ప్రతినిధి): రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఈ నెల 17వ తేదీ జరగనుంది. సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో సాయంత్రం మూడు గంటలకు కేబినెట్ భేటీ జరుగుతుందని సీఎస్ దినేష్‌కుమార్ వెల్లడించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, సచివాలయ నియమ నిబంధనలను అనుసరించి సంబంధిత ప్రతిపాదనలు పంపాలని ఆయన సూచించారు. కాగా, ఈ నెల 18,19 తేదీల్లో కలెక్టర్ల సదస్సు జరగనుంది. సచివాలయంలోని ఐదో బ్లాక్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ల సమావేశం జరుగుతుందని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(రెవెన్యూ) మన్మోహన్ సింగ్ తెలిపారు.

'ఎమ్మార్' కేసులో ఎల్వీ సుబ్రహ్మణ్యానికి విముక్తి


- హైకోర్టు తీర్పుతో ఊరట



హైదరాబాద్, జనవరి 4(మనం లీగల్ ప్రతినిధి): ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసులో సీనియర్ ఐఎఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యంకు విముక్తి లభించింది. ఆయనపై సీబీఐ పెట్టిన కేసును హైకోర్టు కొట్టివేసింది. ప్రస్తుతం ఏపీ క్రీడలు, యువజన సర్వీసుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఆయన పని చేస్తున్నారు. గతంలో మౌలిక సదుపాయల కల్పనా సంస్థ ఎండీ ఉండగా ఎమ్మార్ సంస్థకు భూముల కేటాయింపుల్లో ఆయనపై పాత్రపై సీబీఐ కేసు పెట్టింది. అయితే ఈ కేసులో ఆధారాలు లేవని హైకోర్టు న్యాయమూర్తి శివశంకర్రావు గురువారం తీర్పు చెప్పారు. భూ కేటాయింపుల్లో ఎండీగా ఆయన పాత్ర లేదని, ప్రభుత్వమే భూకేటాయింపులు జరిపిందని 170 పేజీల తీర్పులో హైకోర్టు పేర్కొంది. చాముండేశ్వరినాథ్‌కు విల్లా కేటాయింపునకు ఎల్వీ సిఫార్సు చేశారన్న అభియోగానికి సంబంధించి కూడా ఆధారాలు లేవని పేర్కొంది. ఐఎఎస్ అధికారుల ప్రాసిక్యూషన్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని, రాష్ట్రం ఎలా అనుమతి ఇస్తుందని న్యాయమూర్తి ప్రశ్నించారు.

రాజకీయ వేదికలు కాదు

అభివృద్ధికే జన్మభూమి గ్రామసభలు



- ప్రజా చైతన్యంతోనే అద్భుత ఫలితాలు
- 2.5 లక్షల కార్డులు, 4 లక్షల కొత్త పింఛన్లు
- 7న అన్ని ప్రాంతాల్లో 5కె రన్: చంద్రబాబు
- అధికారులతో ముఖ్యమంత్రి టెలీకాన్ఫరెన్స్

అమరావతి, జనవరి 4 (మనం ప్రతినిధి): జన్మభూమి గ్రామసభలు రాజకీయ వేదికలు కాదని, అభివృద్ధి వేదికలు మాత్రమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రకరకాల వ్యక్తులు వేర్వేరు అజెండాలతో గ్రామసభలకు వస్తున్నారని.. ఎవరు ఏ ఉద్దేశాలతో వచ్చినా బాధ్యతతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ప్రజా చైతన్యంతోనే అద్భుతమైన ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. గురువారం తన నివాసం నుంచి మూడో రోజు 'జన్మభూమి- మా ఊరు' నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రెండున్నర లక్షల రేషన్ కార్డులను గ్రామసభల్లో పంపిణీ చేస్తున్నామని ప్రకటించారు. ప్రతి నియోజకవర్గానికి రెండు వేల చొప్పున 4 లక్షల పింఛన్లను కొత్తగా అందజేస్తున్నామని, పేదరికం, పెద్ద నియోజకవర్గాలను బట్టి మరో 50వేలు అదనంగా ఇస్తున్నామన్నారు. కొత్తగా ఇచ్చే వాటితో కలిపి రాష్ట్రంలో పింఛన్ లబ్ధిదారుల సంఖ్య 50.50 లక్షలకు చేరుతుందన్నారు. ప్రజల సంతృప్త స్థాయికి వచ్చేదాకా పింఛన్లు, రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని సీఎం ప్రకటించారు. ఇళ్ల స్థలాల కొరత దృష్ట్యా ఆయా ప్రాంతాల్లో వన్ ప్లస్ 3 గృహ సముదాయాలకు మొగ్గ చూపాలని సూచించారు. సమస్యల పరిష్కారం ఎంత ముఖ్యమో, ప్రజల్లో సంతృప్తి తీసుకురావడం అంతే ముఖ్యమని, అధికారులు అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలన్నారు. రాజకీయ యంత్రాంగం, అధికార యంత్రాంగం రెండూ కలిసి పనిచేస్తేనే ప్రజల్లో సంతృప్తి తీసుకురాగలమని ఆయన చెప్పారు. పశువైద్య శిబిరాల నిర్వహణపై ప్రజల్లో సంతృప్తి 50 శాతం లోపే ఉందని, ఆ శాఖాధికారులు, సిబ్బంది మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. గ్రామాభివృద్ధికి ప్రజలను సమాయత్తం చేసి వారిలో సానుకూలతను పెంచాలని అధికారులకు చంద్రబాబు మార్గదర్శనం చేశారు. గ్రామసభల వద్ద ఫొటో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామంలో నిర్మించిన సిమెంట్ రోడ్లు, తవ్విన పంటకుంటలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల ఫొటోలు ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించాలని కోరారు. కర్నూలు జిల్లాలో కేవలం 6 మీటర్ల లోపే భూగర్భ జలాలు ఉన్నాయని, గోదావరి జిల్లాల కన్నా ఎగువన గ్రౌండ్ వాటర్ ఉండటం ఊహాతీత అంశమని, ఇది నీరు-ప్రగతి సాధించిన విజయంగా చంద్రబాబు పేర్కొన్నారు. ఈ నెల 7న అన్ని పట్టణాలు, మేజర్ పంచాయతీల్లో 5కె రన్ నిర్వహించాలని నిర్వహించాలని సీఎం సూచించారు. జన్మభూమి కార్యక్రమంలో యువతను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని కోరారు. గ్రామసభలకు హాజరయ్యే సిబ్బందికి వర్కింగ్ లంచ్ ఏర్పాటు చేయాలని , ప్రజలకు పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు అయ్యన్నపాత్రుడు, జవహర్, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, అధికారులు రాజశేఖర్, జవహర్‌రెడ్డి, సంజయ్‌గుప్తా, సునీత, అహ్మద్‌బాబు, సెర్ప్ సీఈఓ కృష్ణ మోహన్, వివిధ జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దుర్గగుడి పరిణామాలపై సీఎం ఆగ్రహం


విజయవాడ, జనవరి 4 (మనం ప్రతినిధి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పవిత్రమైన దేవాలయంలో పాలకమండలి, ఈవో మధ్య విభేదాలు, అంతర్గత గొడవలపై అసహనం వ్యక్తం చేశారు. దుర్గగుడిలో అర్ధరాత్రి పూజలు జరిగాయని ఆలయ కమిటీ ఒప్పుకోవటం, ఈ అంశంలో నివేదిక రాకుండానే ఈవోపై ఆరోపణలు గుప్పించడంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ పద్ధతి లేకుండా వ్యవహరిస్తోందని, ఇలా అయితే కమిటీని రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నను చంద్రబాబు ఇంటికి పిలుపించుకుని ఈ అంశంపై మాట్లాడారు. దుర్గగుడిలో వివాదాలకు తెరదించేలా చూడాలన్నారు. అలాగే తాంత్రిక పూజలు జరిగాయా లేదా అనేది పాలకమండలితో మాట్లాడాలని సూచించారు.

పాలక మండలితో బుద్దా సమావేశం

సీఎం చంద్రబాబు సూచనలతో బుద్దా వెంకన్న గురువారం పాలక మండలి సభ్యులో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఎవరు వ్యవహరించినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. అమ్మవారి సన్నిధానంలో పూజలు జరిగాయా లేదా అనేది విచారణలో తేలుతుందన్నారు. పోలీసులు, దేవాదాయ శాఖ ఈ అంశంపై విచారణ చేస్తున్నారన్నారు. విచారణలో పూజలు జరిగాయని తేలితే బాధ్యులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వైసీపీ నేతలు కావాలనే దీనిపై రాజకీయం చేస్తున్నారని ఆయన విమర్శించారు.

ఈసారి పులివెందుల టీడీపీదే

ప్రజలు జగన్‌కు బుద్ధి చెబుతారు: మంత్రి దేవినేని ఉమా



విజయవాడ, జనవరి 4 (మనం న్యూస్ బ్యూరో): 2019 ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలో టీడీపీ గెలుపు తథ్యమని మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. గురువారం విజయవాడలోని ఇరిగేషన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాబోయే కాలంలో ప్రజలు జగన్‌కు బుద్ధి చెబుతారని, ఈసారి ఎన్నికల్లో పులివెందులలోనూ టీడీపీ జెండా ఎగరడం ఖాయమని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రాజెక్టులను అడ్డుకోవడానికి జగన్ పత్రిక, చానల్ అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయని అన్నారు. ప్రతిపక్షనేత ఎన్ని అవాంతరాలు సృష్టించినా మూడున్నరేళ్లలో గండికోట ప్రాజెక్టు పూర్తి చేసి పులివెందుల వరకు నీళ్లు అందించామని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా రాయలసీమలో ప్రాజెక్టుల ద్వారా నీటిని అందిస్తుంటే ఓర్వలేక జగన్ మాట్లాడుతున్నారన్నారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 5 టీఎంసీల నీళ్లు కన్పిస్తుంటే అజ్ఞానంతో మాట్లాడటం సిగ్గుచేటన్నారు. నాలుగు దశాబ్దాల పాటు పులివెందులలో సర్పంచ్ నుంచి ముఖ్యమంత్రి, నేటి ప్రతిపక్షనేత వరకు అనేక పదవులు అనుభవించి కనీసం అక్కడిలకు నీళ్లు కూడా ఇవ్వలేకపోయిన వైఎస్ కుటుంబం చంద్రబాబుకు అడ్డుతగలడం దారుణమన్నారు. అలాంటిది ముఖ్యమంత్రి చంద్రబాబు తాను ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గాని కన్నా ముందుగా పులివెందుల నియోజకవర్గ రైతాంగానికి నీళ్లు అందిస్తే.. గేట్లు ఎత్తే లస్కర్లు అని మాట్లాడడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి శుక్రవారం కోర్టులకు వెళ్తూ కనీస పశ్చాత్తాపం లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు.

'గండికోట'పై వైసీపీ అసత్య ప్రచారం

- ప్రజలకు ఆ పార్టీ క్షమాపణ చెప్పాలి: సోమిరెడ్డి



అమరావతి, జనవరి 4 (మనం ప్రతినిధి): గండికోట ప్రాజెక్టు నిర్మాణం విషయంలో వైసీపీ అసత్యాలు ప్రచారం చేస్తోందని, దీనిపై ప్రజలకు ఆ పార్టీ నేతలు క్షమాపణ చెప్పాలని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతుంటే జీర్ణించుకోలేక వైసీపీ నేతలు బురదజల్లుతున్నారని ఆయన ఆరోపించారు. జన్మభూమి కార్యక్రమాన్ని వైసీపీ సభలా మార్చేందుకు ఆ పార్టీ నేతలు ప్రయత్నం చేశారని సోమిరెడ్డి మండిపడ్డారు. పులివెందుల సభలో ఎంపీ అవినాష్‌రెడ్డి చర్యలను రాష్ట్ర రైతాంగం తీవ్రంగా నిరసిస్తోందన్నారు. గండికోట ప్రాజెక్టు, పులివెందుల బ్రాంచ్ కెనాల్, చిత్రావతి (లింగాల కెనాల్) ఈ మూడు ప్రాజెక్టులకు వైఎస్ పాలనాకాలంలో రూ.1100 కోట్లు ఖర్చు చేయగా తాము అధికారంలోకి వచ్చాక రూ.2053 కోట్లు వెచ్చించామని మంత్రి వివరించారు.


వ్యర్థాల నుంచి సంపద

- ప్రతి ఇంటికీ ఆర్ఎఫ్ఐడీ
- గ్రామాల్లో నిత్యం చెత్త సేకరణ
- బహిరంగ విసర్జన రహిత గ్రామాలు పెరగాలి
- 'జన్మభూమి'లో మంత్రి లోకేశ్



గుంటూరు, జనవరి 4 (మనం ప్రతినిధి): సమస్యల పరిష్కారం కోసం అధికారుల చూట్టూ తిరగాల్సిన అవసరం లేదని.. ప్రభుత్వం, అధికారులే ప్రజల వద్దకు కష్టాలు తీరుస్తారని ఐటీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి తీర్చేందుకు జన్మభూమి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గుంటూరు జిల్లా కొల్లిపర మండలం అత్తోట గ్రామంలో గురువారం జరిగిన 'జన్మభూమి – మా ఊరు' కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, నక్కా ఆనందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, స్థానిక ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని విధంగా రియల్ టైం గవర్నెన్స్ ఏపీ ప్రభుత్వం తీసుకువచ్చిందని మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా అన్నారు. గ్రామాల్లో చెత్త నుంచి సంపద సృష్టించేందుకు డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసి... వ్యర్థాలను సేకరిస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంటికి ఆర్ఎఫ్ఐడీ కార్డును అమర్చడం ద్వారా నిరంతరం చెత్తను సేకరించేలా పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ చెత్తను సేకరించి విద్యుదుత్పత్తి చేయవచ్చని ఆయన చెప్పారు. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత తాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ఉన్నప్పుడే అనారోగ్యం బారిన పడకుండా కాపాడుకోవచ్చని చెప్పారు. ఇప్పటికే 5931 పంచాయతీలను, 6 జిల్లాలను బహిరంగ మల మూత్ర విసర్జన రహిత ప్రాంతాలుగా ప్రకటించామని వెల్లడించారు. ఈ సంఖ్య మరింత పెరగాలని అన్నారు. రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్ ఉన్నా ఒక్క అత్తోట గ్రామంలోనే 1824 మందికి రైతు రుణమాఫీ చేశామని, 494 మందికి పెన్షన్లు ఇస్తున్నామని చెప్పారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు 105 టీఎంసీలు నీరిచ్చి పంటలను కాపాడిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందన్నారు. అత్తోట గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీ, పంచాయతీ భవన నిర్మాణం 6 నెలలో పూర్తి చేస్తామని మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు.


నదిలో 'తేలియాడే ఇల్లు'!



- త్వరలో హౌస్‌బోట్ విహారం
- తొలిగా కృష్ణానదిలో శ్రీకారం
- ప్రకాశం బ్యారేజీ వద్ద 15 పడవలు
- పర్యాటకుల ఆకర్షణలో కొత్త శకం
- కేరళకు దీటుగా ఏర్పాట్లు
- టూరిజం కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా


అమరావతి, జనవరి 4 (మనం ప్రతినిధి): నది మధ్యలో ఇల్లు! అది నీటి తేలియాడుతూ ఉంటే.. ఆ చుట్టుపక్కల ఆహ్లాదకర వాతావరణంలో విహారం. ప్రకృతి అందాల మధ్య షికారు. ఈ ఊహించుకుంటేనే ఎంతో హాయిగా ఉంది కదూ!! ఈ తరహా అనుభూతి త్వరలో ఏపీ ప్రజలకు అందుబాటులోకి రాబోతోంది. కేరళలో మాత్రమే ప్రత్యేకంగా కనిపించే హౌస్‌బోట్లు ఇక మన నదుల్లోనూ ప్రవేశించనున్నాయి. రాష్ట్ర పర్యాటకానికి కొత్త శోభ తేనున్నారు. తొలిగా కృష్ణా నదిలో హౌస్‌బోట్ విహారానికి శ్రీకారం చుట్టాలని రాష్ట్ర పర్యాటక శాఖ నిర్ణయించింది. ఆ దిశగా ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. కేరళకు ఏ మాత్రం తీసిపోని రీతిలో ఏపీటీడీసీ కార్యచరణ సిద్ధం చేస్తోంది. పర్యాటకులను రాష్ట్రాన్ని ఆకర్షించడంతో పాటు, స్థానికంగా ఉన్న దళితులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో హౌస్‌బోట్ ప్రాజెక్టును రూపొందిస్తోంది. గురువారం సచివాలయంలో ఏపీ పర్యాటక శాఖ అధికారులతో, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హౌస్‌బోట్‌కు సంబంధించిన ప్రాజెక్టుపై ఆయన వివరించారు. తొలిదశలో ప్రకాశం బ్యారేజీ వద్ద 15 పడవలను ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ప్రతి పడవ నిర్మాణానికి సుమారు రూ.కోటి వ్యయం అవుతుంది. అందులో 15 శాతం పర్యాటక శాఖ సబ్సిడీ ఇస్తుంది. ఎస్సీ కార్పొరేషన్ కొంత మొత్తాన్ని సబ్సిడీ రూపంలో భరించేందుకు సూత్రప్రాయంగా అంగీకరించింది. ప్రైవేటు వ్యక్తులు కూడా హౌస్‌బోట్‌లు ఏర్పాటు చేసుకోవచ్చని, వారికి కూడా ఏపీటీడీసీ 15శాతం సబ్సిడీ ఇస్తుందని ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు. ఈ మొత్తం వ్యవహారాన్ని ఏపీటీడీసీ పర్యవేక్షించనుందన్నారు. హౌస్‌బోట్లు అందుబాటులోకి వచ్చాక ఆన్‌లైన్ టికెటింగ్, మార్కెటింగ్ పర్యాటక శాఖ బాధ్యత తీసుకుంటుందని ఆయన తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో అనుభవానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, అదే క్రమంలో ఆదాయ భాగస్వామ్యం ఆవశ్యకత కూడా ఉంటుందని స్పష్టం చేశారు. పడవ సామర్థ్యం సౌకర్యాల ప్రాతిపదికన రూ.60 లక్షల నుంచి కోటి ఇరవై లక్షల వరకు వ్యయం అవుతుందని, ఏ బోటునైనా కొనుగోలు చేసి నిర్వహణకు ముందుకు రావచ్చని చెప్పారు. సబ్సిడీ మాత్రం కోటి రూపాయిల ప్రాజెక్టుకు లోబడే ఉంటుందని మీనా పేర్కొన్నారు. ఈ పడవలు అందుబాటులోకి వస్తే వివిధ రాష్ట్రాల నుంచి పర్యాటకుల సంఖ్య భారీగా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సెన్సెక్స్ జనవరి 4 2018



పెరిగినవి	%	తగ్గినవి	%
టాటా స్టీల్	3.74	టాటా మోటార్స్	-0.81
డాక్టర్ రెడ్డీస్	3.14	పవర్ గ్రిడ్	-0.67
ఐసీఐసీఐ బ్యాంక్	3.08	యాక్సిస్ బ్యాంకు	-0.40
లార్సెన్	2.92	ఇన్ఫోసిస్	-0.37
ఓఎన్‌జీసీ	2.71	మారుతీ సుజుకి	-0.37

నిఫ్టీ జనవరి 4 2018



పెరిగినవి	%	తగ్గినవి	%
టాటా స్టీల్	3.44	టాటా పవర్	-1.19
లార్సెన్	3.17	టాటా మోటార్స్	-0.91
ఓఎన్‌జీసీ	3.13	ఐషర్	-0.85
డాక్టర్ రెడ్డీస్	3.07	బి.పి.సి.ఎల్	-0.69
ఏసియన్ పెయింట్స్	2.64	పవర్ గ్రిడ్	-0.64

టాప్ గైనర్స్ 4 జనవరి

33,969.64 బి.ఎస్.ఇ సెన్సెక్స్ ▲176.26

పాయింట్లు		%
760.75	టాటా స్టీల్	3.74%
2409.50	డాక్టర్ రెడ్డీస్	3.14%
1315.40	లార్సెన్	3.08%
199.35	ఓఎన్‌జీసీ	2.92%
1172.05	ఏసియన్ పెయింట్స్	2.71%
581.00	సన్ ఫార్మా	2.06%
277.80	కోల్ ఇండియా	2.02%
308.05	ఎస్‌బీఐ	1.72%
1649.20	ఇండస్‌ఇండ్	1.16%
522.30	భారతీ ఎయిర్‌టెల్	0.74%

బులియన్ | గత 7 రోజులు



రూపాయి వర్సెస్ డాలర్



ఆశావాదంతో అధిరోహణ

ముంబయి: స్టాక్ మార్కెట్లు భారతదేశంలోనే కాక ప్రపంచ వ్యాప్తంగా కూడా పెరుగుదలను చవి చూశాయి. సెన్సెక్స్ 176 పాయింట్లు పుంజుకుని 33,970 స్థాయిలో ముగిసింది. నిఫ్టీ కూడా 10,500 శిఖరాన్ని తిరిగి కైవసం చేసుకుంది. ఇటీవలి కాలంలో దెబ్బతిన్న లోహాలు, యంత్రాలు, యంత్ర పరికరాలు, వినియోగ వస్తువుల కంపెనీల షేర్లను ఇన్వెస్టర్లు విరివిగా కొనుగోలు చేశారు. బి.ఎస్.ఇ. సెన్సెక్స్ గురువారం ఉదయం 33,912.49 పాయింట్ల వద్ద బలమైన స్థితిలో ప్రారంభమైంది. అది 176.26 పాయింట్లు పుంజుకుని 33,969.64 పాయింట్ల వద్ద ముగియడానికి ముందు 33,802.13 పాయింట్ల నుంచి 33,995.40 పాయింట్ల మధ్య తచ్చాడింది. కడపటి మూడు సెషన్లలో ఇది 263.45 పాయింట్లను కోల్పోయింది.

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచి నిఫ్టీ 61.60 పాయింట్లు పుంజుకుని 10,504.80 పాయింట్ల వద్ద ముగిసింది. అది ఒక దశలో 10,441.45 నుంచి 10,513 పాయింట్ల మధ్య తచ్చాడింది.



విదేశీ నిధుల ప్రవాహం నిలకడగా సాగడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు దేశీయ స్టాక్ మార్కెట్ల ఆరోహణను బలపరిచాయి. నికెయి సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ నవంబరులో ఉన్న 48.5 నుంచి ఒక నెలలో 50.9కి పెరగడం కూడా దేశీయ సెంటిమెంట్‌ను పెంపొందించింది. అదేమాదిరిగా, నికెయి ఇండియా కాంపోజిట్ పి.ఎం.ఐ. ఔట్‌పుట్ ఇండెక్స్ నవంబరులో ఉన్న 50.3 నుంచి డిసెంబరులో 53కి పెరిగింది.

బి.ఎస్.ఇ.లోని రంగాలవారీ సూచీలలో క్యాపిటల్ గూడ్స్ సూచి 2.02 శాతం పెరుగుదలతో మేటిగా నిలిచింది. లోహాలు 1.96 శాతం, వినియోగ వస్తువులు 1.69 శాతం, పి.ఎస్.యు. 1.37 శాతం పెరిగాయి. రియల్టీ 0.3 శాతం, ఆటో 0.28 శాతం, ఐ.టి 0.13 శాతం తగ్గాయి.

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ లిమిటెడ్, ఇన్ఫోసిస్ లిమిటెడ్‌తో సహా కంపెనీలు ప్రకటించనున్న డిసెంబరు త్రైమాసిక ఫలితాల కోసం ఇన్వెస్టర్లు ఎదురు చూస్తున్నారు. 2016 చివరలో పెద్ద నోట్ల రద్దు, గత ఏడాది ప్రవేశపెట్టిన జాతీయ వస్తువులు, సేవల పన్ను తర్వాత, ఆర్థిక వ్యవస్థ కోలుకుంటున్న సూచనలు కనిపిస్తున్నాయి.


తాత్కాలిక డాటా ప్రకారం, బుధవారంనాడు విదేశీ మదుపు సంస్థలు రూ. 96.31 కోట్ల విలువైన ఈక్విటీలు కొనుగోలు చేయగా, దేశీయ మదుపు సంస్థలు రూ. 269.20 కోట్ల విలువైన షేర్లను విక్రయించాయి.

ప్రపంచ మార్కెట్లలోనూ ఉత్సాహం

ఆసియాలో ఇతర స్టాక్ మార్కెట్లు గురువారం గత 10 ఏళ్ళలో చూడనంత అత్యధిక స్థాయిలను తాకాయి. అమెరికా, జర్మనీల నుంచి వచ్చిన పటిష్టమైన ఆర్థిక డాటా ఇన్వెస్టర్లలో ఆశావాదాన్ని బలపరచింది. ఇరాన్‌లో ఆందోళనలు చమురు సరఫరాలకు అంతరాయం కలిగించవచ్చనే ఆందోళనల మధ్య ముడి చమురు ధరలు గత రెండున్నరేళ్ళలో చూడనంత గరిష్ఠ స్థాయిలను తాకాయి. జపాన్ మినహా, ఆసియా-పసిఫిక్ ప్రాంత షేర్ల ధరల హెచ్చు తగ్గులను చూపే మోర్గాన్ స్టాన్లీ క్యాపిటల్ ఇండెక్స్ 2007నాటి శిఖర స్థాయిని సమీపించి 0.1 శాతం పెరుగుదలను కనబరచింది. ఆస్ట్రేలియాలో షేర్ల ధరలు కూడా ఒక దశాబ్ద కాలంలో ఎరుగనంత గరిష్ఠ స్థాయిలను చేరాయి. జపాన్‌కు చెందిన నికెయి 2 శాతం పెరిగింది. మరింత విస్తృతమైన టాపిక్స్ 1991 తర్వాత ఎన్నడూ లేనంత గరిష్ఠ స్థాయిని చూసింది. ఎస్ అండ్ పి 500 ఇండెక్స్ బుధవారంనాడు మొదటిసారిగా 2,700 ఎగువ స్థాయిని చూసింది. డౌజోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 98.67 పాయింట్లు పెరుగగా, ఎస్ అండ్ పి 500 17.25 పాయింట్లు పెరిగింది. నాస్‌డాక్ కాంపోజిట్ 58.63 పాయింట్ల పెరుగుదలను నమోదు చేసింది.

సంతృప్తికరంగా సర్వీసుల పి.ఎం.ఐ

న్యూఢిల్లీ: డిసెంబరులో సేవల రంగంలో కార్యకలాపాలు స్వల్పంగా పెరిగినట్లు సూచిస్తూ, నికెయి సర్వీసెస్ వ్యాపార కార్యకలాప సూచి నవంబరులోని 48.5 నుంచి 50.9కి పెరిగింది. నికెయి ఇండియా కాంపోజిట్ పి.ఎం.ఐ. ఉత్పాదక సూచి నవంబరులోని 50.3 నుంచి డిసెంబరులో 53కు పెరిగింది. ఒక నెలలో ఉన్న స్థితిని తెలిపే ఈ సూచి 50 కంటే ఎక్కువ ఉంటే ఉత్పత్తి వ్యాకోచించినట్లు, 50 కన్నా తక్కువ ఉంటే సంకోచించినట్లు భావించాలి. కొత్త ఆర్డర్లు డిసెంబరులో స్థిరీకరణ పొందాయని, ఉపాధి సృష్టి సెప్టెంబరు తర్వాత వేగవంతంగా ఉందని సర్వే వెల్లడించింది.



కొనసాగనున్న ఎన్.పి.ఏ ప్రొవిజనింగ్ ప్రభావం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులలోకి రూ. 2.11 లక్షల కోట్ల మేరకు మూలధనాన్ని చొప్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం వల్ల ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకుల మూలధన రేఖా సూచన చిత్రాల మధ్య వ్యత్యాసం తగ్గిపోతుందని మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ గురువారం ప్రకటించింది. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్.పి.ఏలు) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పతాక స్థాయికి చేరవచ్చని కూడా అంచనా వేసింది. ఈ ఎన్.పి.ఎలపై కేటాయింపుల స్థాయిలు పెరగడం, 2018-2019 ఆర్థిక సంవత్సరంలో కూడా ప్రతికూల ప్రభావం చూపడం కొనసాగవచ్చని మూడీస్ భారతీయ అనుబంధ సంస్థ ఐ.సి.ఆర్.ఏ పేర్కొంది. ''ఫైనాన్షియల్‌గా బలహీన సంస్థలుగా ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకులకు ప్రభుత్వం ప్రకటించిన రూ. 2.11 లక్షల కోట్ల పునర్ మూలధనీకరణ పథకంతో భారతీయ ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకుల మూలధన రూపురేఖల మధ్య వ్యత్యాసం తగ్గిపోతుందని భావిస్తున్నాం'' అని మూడీస్ ఒక ప్రకటనలో తెలిపింది. వచ్చే రెండేళ్ళ కాలంలో పి.ఎస్.యు బ్యాంకులకు రూ. 2.11 లక్షల కోట్ల మూలధనాన్ని సమకూర్చే ప్రణాళికను ప్రభుత్వం గత ఏడాది అక్టోబరులో ప్రకటించింది. దానిలో రూ. 1.35 లక్షల కోట్లను రీక్యాపిటలైజేషన్ బాండ్ల జారీ ద్వారా సేకరిస్తారు. మిగిలిన రూ. 58,000 కోట్లు ప్రభుత్వ వాటా 'డైల్యూషన్' వస్తాయి. సంస్థ ఆస్తుల విలువను పెంచకుండా, మరిన్ని షేర్లను జారీ చేయడం ద్వారా, షేర్‌హోల్డింగ్ విలువను తగ్గించడాన్ని 'డైల్యూషన్' అంటారు. ''మూలధనాన్ని చొప్పించడం వల్ల ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రొవిజనింగ్ కవరేజి నిష్పత్తులను కూడా పెంచుకోగలుగుతాయి. నిర్వహణాపరమైన లాభాలలో చాలా భాగాన్ని అవి రుణ-నష్ట ప్రొవిజనింగ్ వైపు మళ్ళించగలుగుతాయి. మూలధన స్థితులపై ప్రభావం గురించి ఆందోళన చెందకుండానే అవి ఆ పని చేయగలుగుతాయి'' అని మూడీస్ ఉపాధ్యక్షురాలు, సీనియర్ విశ్లేషకురాలు అల్కా అన్బరసు చెప్పారు.



'క్రెడిట్ బలహీనత'

బలహీనంగా ఉన్న క్యాపిటలైజేషన్ పార్శ్వచిత్రం, ప్రైవేటు రంగ బ్యాంకులతో పోల్చుకున్నప్పుడు, పి.ఎస్.యు. బ్యాంకులకు ''కీలక క్రెడిట్ బలహీనత'' అవుతాయని మూడీస్ పేర్కొంది. రేటెడ్ ప్రైవేటు రంగ బ్యాంకుల టైర్ వన్ మూలధన నిష్పత్తి శాతం 2017 సెప్టెంబర్ నాటికి 12.2 కాగా, రేటెడ్ ప్రభుత్వ రంగ బ్యాంకులది 8.7 శాతంగా ఉంది. ''అయితే, ప్రభుత్వ రీక్యాపిటలైజేషన్ ప్యాకేజి దృష్ట్యా ఈ వ్యత్యాసం తగ్గవచ్చు'' అని మూడీస్ పేర్కొంది. నిరర్థక రుణాల (ఎన్.పి.ఎల్) పరిష్కారం, బ్యాసెల్ త్రీ అమలు అనే కీలక విధాన ప్రయత్నాలకు ప్యాకేజి వెసులుబాటు కల్పించగలదని మూడీస్ భావిస్తోంది. ప్రభుత్వం మరింత మౌలికమైన సంస్కరణలలో కొన్నింటి కోసం పట్టుబట్టడానికి అనువైన స్థితిని ఇది పటిష్టపరుస్తుంది. కార్పొరేట్ పాలన, పరిశ్రమ ఏకీకరణ వంటివాటిపై దృష్టి పెట్టగలుగుతుందని అమెరికా కేంద్రంగా ఉన్న ఆ సంస్థ తెలిపింది. స్థూల ఎన్.పి.ఏలు 2018 ఆర్థిక సంవత్సరం చివరినాటికి పతాక స్థాయికి చేరుకోవచ్చని, బలహీన ఆస్తులను దృష్టిలో పెట్టుకుని పక్కన పెడుతున్న మొత్తాల స్థాయిలు పెరగడం వల్ల కలిగే ప్రతికూల ప్రభావం 2019 ఆర్థిక సంవత్సరం వరకు కొనసాగవచ్చని ఐ.సి.ఆర్.ఏ పేర్కొంది.

'నిఫ్టీ 11,500 తాకుతుంది'

సెన్సెక్స్ 37,000 స్థాయికి చేరవచ్చని కూడా డైచి బ్యాంక్ అంచనా

న్యూఢిల్లీ: సమృద్ధిగా ఉన్న ఆదాయాలలో వృద్ధి వల్ల, యాభై కంపెనీల షేర్ల ధరల్లో హెచ్చు తగ్గులను ప్రతిబింబించే 'నిఫ్టీ' ఈ ఏడాది డిసెంబరు నాటికి 11,500 పాయింట్లకు, (30 కంపెనీల షేర్ల ధరల్లో హెచ్చు తగ్గులను ప్రతిబింబించే) 'సెన్సెక్స్' దాదాపు 37,000 పాయింట్ల స్థాయికి చేరవచ్చని డైచి బ్యాంక్ ఒక పరిశోధనా పత్రంలో వెల్లడించింది. భారత్‌లో 2018లో స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులపై సానుకూల దృక్పథంతో ఉండడానికి కంపెనీల ఆదాయాలలో వృద్ధి రెండు సంఖ్యలలో ఉండగలదనే అంచనాయే మూలమని పేర్కొంది.



తీవ్ర హెచ్చు తగ్గులు తక్కువ

ప్రపంచంలోని చాలా భాగం స్టాక్ మార్కెట్లతో కలిపి, భారతీయ ఈక్విటీ మార్కెట్లు కూడా 2017లో బాగా లబ్ధి పొందాయి. మార్కెట్లలో తీవ్ర హెచ్చు తగ్గులు తక్కువగా ఉండడాన్ని కూడా 2017కు సంబంధించి ఒక రికార్డుగా చెబుతున్నారు. తీవ్ర హెచ్చు తగ్గులు తక్కువగా ఉన్న ధోరణి 2018లో కొనసాగకపోవచ్చని ఇండియా ఈక్విటీ వ్యూహంపై డైచి బ్యాంక్ పరిశోధనా నివేదిక వెల్లడించింది. ముందున్న రిస్కులను ఇన్వెస్టర్లు గుర్తించి తీరాలని పేర్కొంది. ముడి చమురు ధరలు ఇప్పటికే పెరిగాయని, అవి ఇంకా పెరుగుతూపోతే, భారతీయ స్టాక్ మార్కెట్లకు కీలక రిస్కుగా పరిణమించగలవని నివేదిక తెలిపింది. ''పెరుగుతున్న ముడి చమురు ధరలు గత కొద్ది ఏళ్ళలో భారత్ సాధించిన స్థూల ఆర్థిక స్థిరత్వానికి భంగం కలిగించవచ్చు. ఒకవేళ చమురు ధరలు పీపాకు 70 డాలర్లకు మించి పెరిగితే, ప్రభుత్వానికి కోశ సంబంధ లోటును పెంచుకోవడం తప్ప గత్యంతరం ఉండదు. సాధారణ ఎన్నికలకు ముందు ఏడాదిలో ప్రభుత్వం ప్రభుత్వ పథకాలపై వ్యయాలకు కోత పెట్టుకోలేనూవచ్చు, దేశంలో చమురు ధరలను పెంచలేకపోనూవచ్చు'' అని ఆ నివేదిక పేర్కొంది. ఆర్థిక వ్యవస్థ రికవరీకి చోదక శక్తులుగా ఉండగల అంశాలు కొన్నింటిలో పెద్ద నోట్ల రద్దు, జి.ఎస్.టి. ప్రభావం సడలడాన్ని ఒకటిగా పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోలు శక్తి పెరిగిందని చెప్పింది. ఎన్నికలకు ముందు ఏడాదిలో ప్రభుత్వ విధానాలు ఆర్థిక వృద్ధిని పెంపొందించేవిగానే ఉండవచ్చని అభిప్రాయపడింది. ''ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.6 శాతంగా ఉన్న జి.డి.పి. వృద్ధి 2019 ఆర్థిక సంవత్సరం లో 7.5 శాతంగా, 2020 ఆర్థిక సంవత్సరంలో 7.8 శాతంగా ఉండగలదని మా ఆర్థిక వేత్తల అంచనా'' అని నివేదిక తెలిపింది. ఎఫ్.వై 19లో నిఫ్టీ 22 శాతం, ఎఫ్.వై 20లో 17 శాతం పుంజుకోగలదని మేం భావిస్తున్నాం'' అని వెల్లడించింది.

ఆదాయాల్లో రెండంకెలలో వృద్ధి

కంపెనీలు 2018-19లో ఆదాయాల్లో మునుపటిలా రెండంకెలలో వృద్ధిని చూడగలవని, 2018లో మార్కెట్లకు అదే ప్రధాన చోదక శక్తి అవుతుందని అంచనా వేసింది. ''అంతర్జాతీయ దేశీయ ప్రభావిత అంశాల సమ్మేళనాన్ని మేం వీక్షిస్తున్నాం. ఆర్థిక వ్యవస్థ రికవరీ, కార్పొరేట్ ఆదాయాల్లో వృద్ధి రెండింటిపైన మేం ఆశావాదంతో ఉండడానికి అదే కారణం'' అని డైచి బ్యాంక్ నివేదిక వివరించింది.


ఎగుమతులు పెంచే ఎగ్జిబిషన్

న్యూఢిల్లీ: భారతదేశం నుంచి ప్లాస్టిక్స్, రసాయనాలు, అటవీ ఉత్పత్తుల ఎగుమతులకు బ్రహ్మాండమైన అవకాశం ఉంది. వీటితో ప్రపంచ మార్కెట్‌కు 2000 బిలియన్ల అమెరికన్ డాలర్లకు పైగా విలువైన ఎగుమతులు చేయవచ్చని సీనియర్ అధికారి ఒకరు గురువారం చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ ఉత్పత్తులలో భారతదేశ ఎగుమతుల వాటా రెండు శాతం కన్నా తక్కువగా ఉంది. వచ్చే మార్చిలో ఈ ఉత్పత్తులతో ముంబయిలో మూడు రోజుల ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు వాణిజ్య శాఖ సంయుక్త కార్యదర్శి శ్యామల్ మిశ్రా ప్రకటించారు. అటువంటి కార్యక్రమాలు ఈ వస్తువుల ఎగుమతులు పెంపొందడానికి దోహదపడతాయని మిశ్రా చెప్పారు. గత ఏడాది, అటువంటి ఎగుమతుల సగటు 36 బిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంతవరకు ఈ రంగాల నుంచి ఎగుమతులు సుమారు 12 శాతం వృద్ధిని రికార్డు చేశాయి. ''ఎగుమతులు పెంచుకునేందుకు ఈ రంగాలకు బోలెడంత సామర్థ్యమూ ఉంది. అవకాశమూ ఉంది. కొత్త మార్కెట్లు, కొనుగోలుదార్లను కనుగొనేందుకు పరిశ్రమకు ఈ ఎగ్జిబిషన్ సహాయపడవచ్చు'' అని ఆయన ఇక్కడ మీడియా ప్రతినిధులకు చెప్పారు. క్యాప్‌ఇండియా 2018 పేరుతో నాలుగు ఎగుమతుల ప్రోత్సాహక మండళ్ళు ఈ ఎగ్జిబిషన్‌ను సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్నాయి. సుమారు 700 ఎగ్జిబిటర్లు, 30 దేశాలకు చెందిన 400 మంది విదేశీ కొనుగోలుదార్లు, 10,000 మంది సందర్శకులు ఈ కార్యక్రమంలో పాల్గొనగలరని భావిస్తున్నారు. రసాయనాలు, ప్లాస్టిక్స్, నిర్మాణం, గనుల తవ్వకం పరిశ్రమలకు ఈ ఎగ్జిబిషన్ అతిపెద్ద సోర్సింగ్, నెట్‌వర్కింగ్ కార్యక్రమాల్లో ఒకటి కానుంది. ఈ ప్రదర్శనకు ప్రభుత్వ భాగస్వామిగా గుజరాత్ వ్యవహరిస్తోంది.

తగ్గిన బాక్సైట్ ఉత్పాదన

న్యూఢిల్లీ: అల్యూమినియం ఖనిజం బాక్సైట్ ఉత్పాదన తీవ్రంగా (దాదాపు 73 శాతం మేర) తగ్గింది. బాక్సైట్ ఉత్పాదన 2015-16లో 27,146 టన్నుల మేరకు ఉన్నది 2016-17లో 7,269 టన్నులకు పడిపోయిందని గురువారంనాడు పార్లమెంట్‌కు తెలియజేశారు. చత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, గుజరాత్‌లలో వివిధ సంస్థలు బాక్సైట్ అన్వేషణ సాగిస్తున్నట్లు గనుల శాఖ సహాయ మంత్రి హరిభాయ్ పార్థీభాయ్ చౌధరి లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ప్రధానంగా బాక్సైట్ ఖనిజం నుంచి తీసే అల్యూమినియంను మోటారువాహనాలు, విమానాలు తదితర వస్తూత్పత్తి రంగాలలో విస్తృతంగా ఉపయోగిస్తారు. ఒడిశా, గుజరాత్, జార్ఖండ్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, తమిళ నాడు, మధ్య ప్రదేశ్‌లు ప్రధాన బాక్సైట్ ఉత్పాదక రాష్ట్రాలు.

జియోలైట్ దిగుమతిపై దర్యాప్తు



న్యూఢిల్లీ: డిటర్జెంట్లలో ఉపయోగించే ఒక చైనీస్ రసాయనం దిగుమతిపై యాంటి-డంపింగ్ దర్యాప్తును ఇండియా చేపట్టింది. కొన్ని దేశీయ కంపెనీల ఫిర్యాదు మేరకు అది ఈ పనికి ఉపక్రమించింది. చైనా నుంచి 'జియోలైట్ 4-ఏ (డిటర్జెంట్ గ్రేడ్)' దిగుమతిపై దర్యాప్తు చేపట్టాలని గుజరాత్ క్రెడో మినరల్ ఇండస్ట్రీస్, కెమికల్స్ ఇండియా అనే రెండు సంస్థలు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ యాంటి-డంపింగ్ అండ్ ఎలైడ్ డ్యూటీస్ (డి.జి.ఏ.డి)ని కోరాయి. ఆ రసాయనాన్ని దేశంలోకి కుమ్మరించినట్లు తగినన్ని ప్రాథమిక సాక్ష్యాధారాలున్నాయని డి.జి.ఏ.డి ఒక నోటిఫికేషన్‌లో తెలిపింది. యాంటి-డంపింగ్ సుంకాన్ని విధిస్తే, ఆ ఉత్పత్తి చౌక దిగుమతుల నుంచి ఈ రంగంలోని దేశీయ సంస్థలను కాపాడడానికి సహాయపడినట్లు అవుతుంది. ''కుమ్మరించినట్లు వచ్చిన ఆరోపణలపైన, పర్యవసానంగా దేశీయ పరిశ్రమకు వాటిల్లిన నష్టంపైన సంస్థ దర్యాప్తు చేపడుతోంది'' అని ఆ నోటిఫికేషన్ వెల్లడించింది. కొన్ని సంస్థలు ఆరోపించినట్లుగా ఆ పదార్థం నిజంగానే పెద్ద మొత్తంలో దేశంలోకి వచ్చిపడిందా, ఆ దిగుమతులు దేశీయ సంస్థలపై ఏ మేరకు ప్రభావం చూపాయి వంటి అంశాలను దర్యాప్తులో నిర్ధారిస్తారు. విధించదలచుకుంటే, యాంటి-డంపింగ్ సుంకాన్ని ఎంత మొత్తం విధించాలో అది సిఫార్సు చేస్తుంది. దిగుమతుల వల్ల దేశీయ పరిశ్రమలకు వాటిల్లే నష్టాన్ని తగ్గించడానికి అది సరిపోతుందో లేదో చూస్తుంది. అది 2016 ఏప్రిల్-2017 జూన్ (15 నెలల) కాలాన్ని దర్యాప్తునకు ఎంచుకుంది. చౌక రకం దిగుమతులు విపరీతమై, దేశీయ పరిశ్రమలు నష్టపోతున్నాయని భావించినప్పుడు వివిధ దేశాలు కుమ్మరింత నిరోధక దర్యాప్తు చేపడుతున్నాయి. డబ్ల్యు.టి.ఓ బహుముఖ వ్యవస్థ కింద సుంకాలు విధిస్తున్నాయి. నిష్పాక్షికమైన వర్తక విధానాలు అమలయ్యేట్లు చూసేందుకు, విదేశీ ఉత్పత్తి సంస్థలు, ఎగుమతిదార్లకు దేశీయ ఉత్పత్తి సంస్థలకు మధ్య సమాన పోటీ అవకాశాలు కల్పించేందుకు ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు. చైనాతో సహా, వివిధ దేశాల నుంచి చౌక రకం దిగుమతులు ఎదుర్కొనేందుకు వివిధ ఉత్పత్తులపై భారత్ ఇప్పటికే యాంటి-డంపింగ్ సుంకాన్ని విధించింది. చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్న దాదాపు 98 వస్తువులపై (గత ఏడాది డిసెంబరు 27 నాటికి) దేశం ఈ రకమైన సుంకాన్ని విధించింది.

ట్రాక్టర్ల అమ్మకాలకు అపార అవకాశం



న్యూఢిల్లీ: సోనాలికా బ్రాండ్ ట్రాక్టర్లను తయారు చేసే ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ అమ్మకాల్లో 10.7 శాతం పెరుగుదలను కనబరుస్తూ డిసెంబరులో 4,516 యూనిట్లను విక్రయించింది. అది 2016 డిసెంబరులో 4,080 యూనిట్లను మాత్రమే విక్రయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-డిసెంబరు మధ్యకాలంలో 63,205 యూనిట్ల అమ్మకాలు సాధించినట్లు సోనాలికా ఐ.టి.ఎల్. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామన్ మిత్తల్ చెప్పారు. గత ఏడాది వర్షాలు బాగా పడడంతో ట్రాక్టర్ పరిశ్రమ ఆనందోత్సాహాలు చూడగలిగిందని ఆయన చెప్పారు. ''దేశం రెండు ప్రధాన (పెద్ద నోట్ల రద్దు, జి.ఎస్.టి.) విధానపరమైన మార్పులను వీక్షించింది. పెద్ద నోట్ల రద్దు తర్వాత, 2016 నవంబరులో పరిశ్రమ అమ్మకాల్లో 13.5 శాతం క్షీణతను చూసింది. నగదు చెలామణీ పరిస్థితి మెరుగుపడడం, ఇతర అంశాలు కూడా సానుకూలపడడంతో, రైతులు మళ్ళీ ట్రాక్టర్లను కొనడం ప్రారంభించారు'' అని ఆయన చెప్పారు. ప్రతి 1000 హెక్టార్లకు ట్రాక్టరు సౌలభ్యం చాలా తక్కువగా 20 శాతం మాత్రమే ఉన్నందున భారతదేశంలో ట్రాక్టర్ల పరిశ్రమకు అపారమైన అవకాశం ఉందని ఆయన అన్నారు. ''భారతదేశంలో 6,70,000 గ్రామాలున్నాయి. పరిశ్రమ వారీగా అమ్మకాలు చూసినప్పుడు ఒక ఏడాది కాలంలో, ఒక గ్రామానికి ఒక యూనిట్‌ను మించి అమ్మకాలు ఎన్నడూ పెరగలేదు. కనుక, వృద్ధికి ఎంతో అవకాశం ఉన్నట్లు లెక్క'' అని రామన్ మిత్తల్ చెప్పారు.

పెరిగిన ఉక్కు ఉత్పాదక వ్యయం

న్యూఢిల్లీ: ప్రభుత్వ యాజమాన్యంలోని ఎన్.ఎం.డి.సి. ఇనుప ఖనిజ ధరలను పెంచడంతో, పెరిగిన ఉత్పాదక వ్యయ భారాన్ని వినియోగదార్లకు బదలాయించడం తప్ప ఉక్కు కంపెనీలకు మరో మార్గం లేదని జె.ఎస్.డబ్ల్యు. స్టీల్ చైర్మన్ సజ్జన్ జిందాల్ అన్నారు. ''ప్రభుత్వ యాజమాన్యంలోని ఎన్.ఎం.డి.సి. ఒడిశాలోని ప్రైవేటు గనుల తవ్వకం సంస్థలు ఇనుప ఖనిజ ధరను ఇటీవల పెంచడంతో , పెరిగిన ఉత్పత్తి వ్యయ భారాన్ని ఉక్కు కంపెనీలు బదలీ చేయవలసి వస్తోంది'' అని జిందాల్ ట్వీట్ చేశారు. హయ్యర్ గ్రేడ్ ఇనుప ఖనిజం ధర టన్ను రూ. 3,100గా, నాసిరకం ఖనిజం టన్ను ధర రూ. 2,760గా ఉన్నాయి. బొగ్గు, రిఫ్రాక్టరీ, ఎలక్ట్రోడ్లు వంటి ఇతర ముడి పదార్థాల ధరలు కూడా పెరగడంతో ఉత్పత్తి వ్యయం పెరిగింది. ఆ భారాన్ని వినియోగదార్లకు బదలీ చేయడం తప్ప మరో మార్గం లేదని జిందాల్ అన్నారు.



అన్ని పనులు చేసిపెట్టే మర మనుషులు!

మర మనుషులు (రోబో) అసలైన మనుషుల ఆశలకు ఓ ప్రతిరూపంలా మారుతున్నాయి. మన జీవితాన్ని మరింత సౌకర్యవంతం చేస్తునాయి. ఈ రోబోలు ఎన్నో విషయాల్లో మానవాళికి సహకరించేందుకు తోడ్పడేలా ఉంటున్నాయి. రోబోలు ఇంట్లో ఏ పని కావాలంటే ఆ పని చేసి పెడతాయి. చిన్నారులతో ఆడుకుంటాయి. పెట్స్‌ను చూసుకుంటాయి. యజమానులు ఏం ఆదేశిస్తే అది చేసిపెడతాయి. రోబో సినిమా చూసే ఉంటారు. రజనీకాంత్ సృష్టించిన చిట్టి తిరిగి అతడినే శాసించే స్థాయికి చేరుకోవడంతో అప్పుడు రజనీనే స్వయంగా దాన్ని ముక్కలు ముక్కలు చేసేస్తాడు. ఇలా రోబోల పనితీరు గురించి చెప్పిన సినిమాలు చాలానే ఉన్నాయి. మరి ఇలాంటి రోబోల గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలు తెలుసుకుందాం...

రోబో సృష్టి

మొదటిసారిగా రోబోను గ్రీక్ మ్యాథమ్యాటీషియన్ ఆర్చిటాస్ క్రీస్తు కంటే ముందు (బీసీ) 350 కాలంలో రూపొందించినట్టు చెబుతారు. ఎగిరే చెక్క పరికరం ఇది. గాల్లో 300 మీటర్ల మేర ఇది ప్రయాణించేది. ఆర్చిటాస్ తాను రూపొందించిన రోబోకు స్టీమ్ ఇంజన్‌ను అమర్చి ఉండవచ్చని నమ్ముతారు. అయితే, ఇది ఎక్కువ కాలం పాటు అందుబాటులో లేకపోవడంతో దీని నిర్మాణం గురించి పెద్దగా తెలియలేదు. ఆ తర్వాత 200 (బీసీ) కాలంలో సెసిబస్ అనే మరో గ్రీకు వ్యక్తి ఆటోమేటడ్ వాటర్ క్లాక్‌ను, కదిలించే చేతులతో రూపొందించాడు. హ్యూమనాయిడ్ రోబోను మొదటి సారిగా 1928లో లండన్‌లోని మోడల్ ఇంజనీర్స్ సొసైటీ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు.

భలే రోబోలు



రోబోలు ఎలా పనిచేస్తాయి...?

రోబోల పనితీరు మనిషి భౌతిక లక్షణాలను అనుకరించేలా రూపొందిస్తారు. ఉక్కు బాడీ, సెన్సార్లు, విద్యుత్తు, కంప్యూటర్ ప్రోగ్రామ్ తదితర ఫీచర్లతో ఇవి ఉంటాయి. అన్ని రోబోలూ మనిషి ఆకారాన్ని పోలి ఉండవు. మానవ రూపాన్ని పోలి ఉన్న వాటిని హ్యూమనాయిడ్ రోబోలని పిలుస్తారు. కొన్ని నిర్దేశిత చర్యలను రోబోలు వాటంతట అవే చేసేలా కంప్యూటర్ ప్రోగ్రామ్‌ను రూపొందిస్తారు. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఈ ప్రొగ్రామ్‌ను మార్చడం ద్వారా రోబో పనితీరును శాసించవచ్చు. రోబోలను బయటి నుంచి నియంత్రించేలా లేదా అంతర్గతంగానే నియంత్రించేలా చేస్తారు.

రోబోలు కదిలేందుకు వీలుగా చక్రాలు లేదా కాళ్లు లేదా ఇతర పరికరాలను ఏర్పాటు చేస్తారు. మన శరీరంలో జాయింట్ల మాదిరిగా ఎన్నో భాగాలను కలపడం ద్వారా రోబో నిర్మాణం పూర్తవుతుంది. రోబోను కదిలించేందుకు వీలుగా ఎలక్ట్రానిక్ మోటార్లు, సోలెనాయిడ్లను వాడతారు. కొన్నింటిలో హైడ్రాలిక్ లేదా న్యూమాటిక్ వ్యవస్థలను ఉపయోగిస్తారు. ఇవి బ్యాటరీ సాయంతో పనిచేస్తాయి. రోబోల్లో సెన్సార్ వ్యవస్థ, కెమెరాల అమరిక ఉంటుంది. రోబోలను ముట్టుకుంటే కందిపోయే, అచ్చమైన మనిషి శరీరం అనిపించే రీతిలో సిలికాన్ బాడీతో రూపొందించడం కూడా జరిగింది.

ఆధునిక రోబోలు

ప్రస్తుతం చూస్తున్న అడ్వాన్స్‌డ్ రోబోలకు ఆద్యుడు ఇంగ్లండ్‌కు చెందిన విలియమ్ గ్రే వాల్టర్. 1948లో ఆయన తొలి ఎలక్ట్రానిక్ అటానమస్ రోబోను తయారు చేశారు. ఆ తర్వాత నుంచి రోబోల విషయంలో విస్తృతమైన పరిశోధనలు జరిగాయి.

మొబైల్ రోబోలు

మొబైల్ రోబోలన్నవి ఒక లొకేషన్‌కే పరిమితం కాకుండా పనిచేసేవి. ఇందుకు ఉదాహరణ ఆటోమేటెడ్ గైడెడ్ వెహికల్. స్వయం చోదక వాహనం అన్నమాట. మిలటరీలోనూ మొబైల్ రోబోల వాడకం ఉంది.



ఇండస్ట్రియల్ రోబోలు

ఆటోమేటిక్‌గా నియంత్రణ కలిగినవి. బహుళ విధాలుగా పనిచేసేవి. ఒకే ప్రదేశంలో స్థిరంగా లేదా మొబైల్ రూపంలోనూ పనిచేస్తాయి. ఒకటి లేదా ఎన్ని చేతులు అయినా ఉండవచ్చు. ఏక కాలంలో పలు రకాల పనులు చేసే విధంగా వీటిని రూపొందిస్తారు. పరిశ్రమల్లో వీటి వాడకం ఎక్కువగా ఉంది. వస్తు తయారీ, తయారైన వస్తువులను ఒక చోట నుంచి మరో చోటకు తరలించడం తదితర పనుల కోసం వీటిని వాడుతుంటారు.

ఆటోమొబైల్ పరిశ్రమలోనూ రోబోల వినియోగం ఎక్కువగా ఉంది. వెల్డింగ్, పెయింటింగ్ తదితర పనులకు వీటిని ఉపయోగిస్తున్నారు. ప్రతీ పది మంది కార్మికులకు ఓ రోబో చొప్పున వినియోగం ఉంది. అలాగే వస్తువుల ప్యాకింగ్‌లో, ఎలక్ట్రానిక్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల తయారీలో, వేర్‌హౌస్‌లు, కంటెయినర్ పోర్టులలోనూ రోబోల వాడకం ఉంది. గనుల తవ్వకాల్లో, ప్రపంచ వ్యాప్తంగా ల్యాబొరేటరీల్లో పరిశోధనలకు కూడా వీటిని ఉపయోగిస్తున్నారు. పండ్ల తోటల్లో పండ్లు తెంపేందుకు, కాయలు కోసే పనులకు ఉపయోగిస్తున్నారు.

ఎడ్యుకేషనల్ రోబో

విద్యా సంస్థల్లో రోబోలను ఉపయోగించుకోవడం 1980ల నుంచే మొదలైంది. లెక్కలు, ఫిజిక్స్, ప్రొగ్రామింగ్, ఎలక్ట్రానిక్స్ గురించి విద్యార్థులు నేర్చుకునేందుకు రోబోలు సాయపడతాయి. పాఠశాలలు, కాలేజీ విద్యార్థుల మధ్య రోబోల తయారీపై పోటీలు పెట్టడం కూడా చూస్తూనే ఉన్నాం.



మిలటరీ రోబోలు

కొన్ని దేశాలు తమ సైన్యంలో రోబోల సేవలను వినియోగిస్తున్నాయి. కొన్ని రకాల స్వతంత్ర చర్యలను అవి చేపట్టే విధంగా వాటిని రూపొందిస్తున్నారు. అయితే, వీటిని శత్రుదేశాల సైనికులు తమ స్వాధీనంలోకి తీసుకుని తిరిగి అవి ఏ దేశానికి చెందినవో ఆ దేశ సైనికులపైనే పోరాటానికి వినియోగిస్తే ఎలా? అన్న ఆందోళన ఉంది. మిసైల్స్, బాంబుల జారీ పనులను వీటికి అప్పజెబితే ఇక స్వయం వినాశనం కొనితెచ్చుకున్నట్టేనన్న భయాలు కూడా ఉన్నాయి.



అంతరిక్షంలోకి...

అంతరిక్షంలోకి రోబోలను పంపడం 1960ల నుంచే అమల్లో ఉంది. టెలీరోబోలు అనేవి వాటంతట అవి ఆపరేట్ చేయలేవు. సమీపంలో ఓ వ్యక్తి ఉండి నియంత్రించేవి. ప్రమాదకరమైన విధుల నిర్వహణలో భాగంగా ప్రాణాలు రక్షించుకునేందుకు మనుషులకు బదులు టెలీ రోబోలను ఆ పనులకు ఉపయోగిస్తుంటారు.

ఇళ్లల్లో పనులకోసం

ఇంట్లో నేల తుడవడం దగ్గర నుంచి వస్తువులను అందించడం తదితర పనులు చేసిపెట్టే రోబోల గురించి తెలిసే ఉంటుంది. నేడు ఎక్కువ మంది ఉథయం లేచింది మొదలు, రాత్రి నిద్రించే వరకు ఎన్నోపనుల్లో మునిగి తేలుతున్నారు. మహిళలు సైతం ఉద్యోగాలు చేయడానికే ఆసక్తిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఫ్లోర్ క్లీనింగ్ చేసే రోబోలను చాలా దేశాల్లో ఉపయోగిస్తున్నారు. మన దేశంలో మిలా గ్రో, ఫిలిప్స్, యూరేకా ఫోర్బ్స్, ఎక్స్‌లెంట్ రెడీమెయిడ్, ఓ డస్టర్ ఇలా చాలా రకాల ఫ్లోర్ క్లీనర్లు లభిస్తున్నాయి. హాస్పిటల్స్‌లో సర్జరీ సమయాల్లో, ఫార్మసీల్లో సాయపడేందుకు వీలుగా రోబోలు ఉపయోగిస్తున్నారు. అలాగే, రోగులకు సాయంగా ఉండేవి కూడా ఉన్నాయి.

పరిశోధనలు

మనుషులకు మరింతగా సాయపడేలా రోబోలను తయారు చేయడంపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ముఖ్యంగా వృద్ధాప్యం మీద పడిన వారికి సహాయకారిగా ఉండే రోబోలను డిజైన్ చేయడంపై శాస్త్రవేత్తలు దృష్టి పెట్టారు. అమెరికాలో 65 ఏళ్లు పైబడిన వారి సంఖ్య 13 శాతం కాగా, జపాన్‌లో 20 శాతం మంది ఉన్నారు. అందుకే ఈ దేశాల్లో వృద్ధుల రోజువారీ పనులకు తోడ్పడే వాటిని రూపొందించే పనులు జరుగుతున్నాయి.

రోబోల చిరునామా...?

ఈ ప్రపంచంలో ఉన్న రోబోల్లో సగం ఆసియాలోనివే. యూరోప్‌లో 32 శాతం, నార్త్ అమెరికాలో 16 శాతం, ఆస్ట్రేలియాలో ఒక శాతం, ఆఫ్రికాలో ఒక శాతం ఉన్నాయి. 2019 నాటికి రోబో బ్రెయిన్ ఆవిష్కరణ సాధ్యమేనని ఓ శాస్త్రవేత్తల టీమ్ ప్రకటించింది. 2050 నాటికి మేధోపరంగా రోబోలు విజయం సాధిస్తాయన్న అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఇందులో కీలక పాత్ర పోషించనుంది. కంప్యూటర్లు, రోబోలు స్వతంత్రను సాధించగలవా? అన్న అంశంపై కూడా శాస్త్రవేత్తల్లో చర్చ నడుస్తోంది. ఒకవేళ ఇలాంటివి సాధ్యమైతే వచ్చే ముప్పుపై కూడా ఎన్నో సందేహాలు ఉన్నాయి.





ఎక్సో జీటీ

క్యాలిఫోర్నియాలోని రిచ్ మండ్ కేంద్రంగా పనిచేసే ఎక్సో బయోనిక్స్ కంపెనీ ఎక్సో జీటీ పేరుతో ఓ రోబోను తయారు చేసింది. పక్షవాతం, వెన్నెముకకు గాయం కారణంగా సొంతంగా నడవలేని పరిస్థితుల్లో ఉంటే... అటువంటి వారి కోసం ఈ రోబో సూట్ ఉపకారిగా ఉంటుంది. టైటానియం, అల్యూమినియం , బ్యాటరీతో పనిచేసే మోటర్లను ఇందులో అమర్చారు. దీని సాయంతో రోగులు నడవడం సాధ్యపడుతుంది.

డెకా రోబో

రోబోటిక్ టెక్నాలజీకి బయోనిక్ అవయవాలు మరింత వన్నె తెచ్చాయనే చెప్పుకోవచ్చు. అవయవాలు లేకుండా జన్మించిన వారు, ప్రమాదాల్లో కోల్పోయిన వారికి డెకా రోబో చేయి మంచి ఉపకారి అని చెప్పుకోవచ్చు. అమెరికా డిఫెన్స్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ప్రాజెక్ట్స్ ఏజెన్సీ దీన్ని రూపొందించింది. ఇటువంటి వారు డెకా రోబో చేయి సాయంతో వస్తువులను పట్టుకోవడం సాధ్యమవుతుంది.

ఎల్ జీ రోలింగ్ బాట్

ఇది ఇంట్లో ఉంటే చాలు... యజమాని ఎక్కడున్నా నిశ్చింతగా ఉండవచ్చు. వైఫై ఆధారిత సెక్యూరిటీ రోబోగా పనిచేస్తుంది. ఇంట్లో ఆ మూల నుంచి ఈ మూల వరకు కలియతిరుగుతుంది. ఎప్పుడైనా పని మీద బయటకు వెళితే... ఇంట్లో కాపలాగా ఎవరినీ ఉంచనవసరం లేదు. దీని ద్వారా ఇంటి దగ్గర ఏం జరుగుతుందో తెలుసుకోవచ్చు.

వంట మాస్టర్ రోబో

ఈ రోబోను తెచ్చుకుంటే నోరూరించే వంటకాలను చేసి పెడుతుంది. కానీ, ఇది ఇంకా మార్కెట్‌లోకి రాలేదు. మోలే రోబోటిక్స్ దీని రూపకర్త. రెండు రోబో చేతులను కిచెన్‌లో అమర్చుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత వెరైటీ వంటలను ఓసారి చేసి దీనికి చూపిస్తే చాలు... ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఏ వెరైటీ అంటే ఆ వెరైటీని నిమిషాల్లో సిద్ధం చేసి పెడుతుంది. దీన ధర 50వేల పౌండ్లు ఉండవచ్చని (రూపాయిల్లో రూ.41 లక్షలు) అంచనా.



ఆసుస్ జెన్ బో

ఆసుస్ కంపెనీ రూపొందించిన ఈ జెన్ బో రోబో అయితే ఇంట్లో పనులకు చక్కగా సాయపడుతుంది. ఈ రోబోలో ఎన్నో కెమెరాలు, సెన్సర్లను అమర్చడం వల్ల దానంతట అదే ఇల్లంతా కలియతిరుగుతుంది. దీని టచ్ స్క్రీన్ భావాలను కూడా వ్యక్తీకరిస్తుంది. స్పీకర్లు, మైక్రోఫోన్లు మన మాటలకు స్పందించేందుకు వీలు కల్పిస్తాయి. ఇంట్లో పెద్దవాళ్లు ఉంటే వాళ్లను కనిపెట్టుకుంటుంది. వారికి ఏదైనా అయితే వెంటనే సంరక్షకులను అప్రమత్తం చేస్తుంది. పాటలు పాడడం, డాన్స్ చేయడం ద్వారా చిన్నారులను ఊర్రూతలూగిస్తుంది. దీని ధర 600 డాలర్లు (మన రూపాయిల్లో సుమారు 40వేలు). అంటే ఓ ఖరీదైన స్మార్ట్ ఫోన్ ధర అంత.

సాఫ్ట్ బ్యాంకు పెప్పర్

ఇది హ్యూమనాయిడ్ రోబో. చక్రాల సాయంతో నడుస్తుంది. కెమెరా, సెన్సార్లు తలలో అమర్చి ఉంటాయి. ఛాతీ భాగంలో టచ్ స్క్రీన్ ఉటుంది. మాట్లాడుతుంది. మన భావాలను అర్థం చేసుకుని అందుకు తగ్గట్టుగా మనతో ప్రవర్తిస్తుంది. మూడీగా ఉంటే గుర్తించి వినోదాన్ని అందిస్తుంది. దీని ధర 1,98,000 యెన్‌లు (మన రూపాయిల్లో రూ.1.12 కోట్లు). ప్రస్తుతం ఇది జపాన్‌కే పరిమితం. ప్రస్తుతం ఇంటి పనుల్లో సాయంగా పనికివస్తున్న ఈ చిట్టిని సాఫ్ట్ బ్యాంకు త్వరలో దుకాణాల్లోనూ సహాయకుడిగా ఉండేందుకు అనువుగా మెరుగులు దిద్దుతోంది. ఇది ప్రపంచంలోనే తొలి ఫ్యామిలీ రోబో. పరిమాణంలో చాలా చిన్నది. దీని ధర 750 డాలర్లు (రూపాయిల్లో 51,000). ఇది మాట్లాడుతుంది. స్క్రీన్ సాయంతో భావాలను వ్యక్తీకరిస్తుంది. దీనిలో ఉన్న కెమెరాలు, మైక్రోఫోన్ల సాయంతో చిన్నారులను ఆడిస్తుంది. పెద్ద వయసు వారిపై ఓ కన్నేసి ఉంచి వారిని సమయానుకూలంగా హెచ్చరిస్తుంటుంది. చేయవల్సిన పనులను గుర్తు చేస్తుంది. ఒంటరి వారికి ఓ తోడులా పనిచేస్తుంది.

అమేజాన్ ఎకో

ఇది రోబో కంటే తక్కువ. గాడ్జెట్ కంటే ఎక్కువ వంటిది. ఇది అమెరికా మార్కెట్‌లోకి ఇప్పటికే అడుగు పెట్టేసింది. సంగీతాన్ని వినిపిస్తుంది. ఇంట్లో లైట్లు, వాషింగ్ మెషిన్లు ఇలా



ఎన్నింటినో ఆపరేట్ చేయగలదు. ఇంటిని స్మార్ట్‌గా మార్చేస్తుంది. వాతావరణం గురించి తెలియజేస్తుంది. ఫ్రెంచ్ ఓపెన్ స్కోరు ఎంతో కూడా చెప్పేయగలదు. వెంట కారులో తీసుకెళితే ట్రాఫిక్ సమాచారం కూడా చెబుతుందట. రోబోలాంటి ఈ గాడ్జెట్‌ను అమేజాన్ నిరంతరం అభివృద్ధి పరచడంపై దృష్టి సారించింది.

డైసన్ 360 ఐ



ఇది బ్రిటన్ ప్రజలకు చేరువలో ఉన్న రోబో. పేరు డైసన్ 360ఐ. దీని ధర 1,50,000 యెన్‌లు (రూపాయల్లో రూ.85.5లక్షలు). దీనిలో ఉన్న కెమెరాలు, లేజర్ల సాయంతో ఇంట్లో ఫ్లోర్‌ను స్కాన్ చేస్తుంది. ఆ తర్వాత నేలపై ఒక్క మచ్చ కూడా లేకుండా శుభ్రంగా క్లీన్ చేసేస్తుంది. మేఫీల్ రోబోటిక్స్ అనే సంస్థ దీన్ని రూపకర్త. ఇదో ఇంటెలిజెంట్ రోబో. అరమీటరు ఎత్తు, ఆరు కిలోల బరువు ఉండే ఇది ఓ చక్కని సహాయకారిగా పనిచేస్తుంది. లేజర్ ఆధారిత సెన్సార్, కెమెరాలతో ఉంటుంది. ఓసారి ఇంటిని ఆసాంతం మ్యాప్ చేసేసుకుంటే ఇక ఆ తర్వాత ఎక్కడ ఏది ఉందో తేలిగ్గా గుర్తుంచుకుంటుంది. దానంతట అదే చార్జింగ్ స్లాట్ పైన కూర్చుని రీచార్జ్ అవుతుంది. ఇంట్లో చిన్నారులతో కలసి డ్యాన్స్ చేస్తుంది. మాటలను అర్థం చేసుకుని అందుకు తగినట్టు స్పందిస్తుంది. మాట్లాడలేకపోయినా తల ఆడిస్తూ సైగలు, శబ్దాల ద్వారా భావాలను తెలియజేస్తుంది.

మిలో రోబో

అమెరికాకు చెందిన హ్యూమనాయిడ్ తయారీ కంపెనీ రోబోకైండ్ మిల్ రోబోను రూపొందించింది. ఆటిజంతో బాధపడుతూ ఏ పనులూ చేసుకోలేని చిన్నారుల సాయం కోసం ఈ రోబోను రూపొందించారు. పిల్లలకు మెలకువలను నేర్పడంలో పెద్దలకు సాయపడుతుంది. రోబో కళ్ల వెనుక కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల చిన్నారుల ప్రవర్తనకు అనుగుణంగా స్పందిస్తుంది.





సెంచూరియన్ క్యూరేటర్‌తో పిచ్ తయారీ

ఇండియా, సౌతాఫ్రికా మధ్య తొలి టెస్టు మ్యాచ్‌కు సెంచూరియన్ క్యూరేటర్ బ్రియాన్ బ్లాయ్ సహాయాన్ని సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు కోరింది. పిచ్‌ను తయారు చేయడంలో కేప్‌టౌన్‌లోని న్యూలాండ్ స్టేడియం క్యూరేటర్ ఇవాన్ ఫ్లింట్‌కు సహాయం చేయమని పంపింది. తొలి టెస్టు ఆరంభం నుంచే టీమిండియా బ్యాటింగ్ లైనప్ వెన్ను విరవాలని ఫాఫ్ డు ప్లెసిస్ సేన ఉత్సాహ పడుతోంది. సౌతాఫ్రికాలోని జీవం గల పిచ్‌లలో కేప్‌టౌన్ కూడా ఒకటి. అయితే ఫాస్ట్, బౌన్సీ పిచ్‌ను తయారు చేయడంలో ఫ్లింట్ ఒక్కడే ఇబ్బంది పడుతున్నందున బ్లాయ్‌ను పంపించారు. ఈ సందర్భంగా క్రికెట్ సౌతాఫ్రికా అధికారి ఒకరు మాట్లాడుతూ.. 'గత రెండేళ్లుగా టీమిండియా ఫాస్ట్, బౌన్సీ పిచ్‌లపై ఆడేందుకు ఇబ్బంది పడుతోంది. ఈ బలహీనతను ఆసరాగా చేసుకుని ఫాస్ట్, బౌన్సీ పిచ్‌ను తొలి టెస్టు మ్యాచ్‌కు సిద్ధం చేస్తున్నాం. మా క్రికెటర్లు ఫాస్ట్ పిచ్‌ను మాత్రమే కాకుండా బౌన్సీ వికెట్‌ను కోరుకుంటున్నారు. ఇది సౌతాఫ్రికాను బలోపేతం, టీమిండియాను బలహీనం చేస్తుంది' అని వివరించారు.

కొత్త సంవత్సరం... పాత సవాళ్లు

నేటి నుంచి ఇండియా, సౌతాఫ్రికా తొలి టెస్టు

మూడు మ్యాచ్‌ల సిరీస్

మధ్యాహ్నం 2 గంటల నుంచి సోనీ టెన్-1లో ప్రత్యక్ష ప్రసారం

(క్రీడా విభాగం)

కొత్త సంవత్సరాలు వస్తుంటాయి.. పాతబడి పోతుంటాయి. కానీ టీమిండియాకు 2018 ప్రత్యేకమైంది. విదేశాల్లో పేలవ ప్రదర్శన మరకను చెరిపేసుకునేందుకు కోహ్లి సేనకు ఇదే మంచి అవకాశం. ఈ నూతన సంవత్సరంలో సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లిన కోహ్లి సేనకు పాత సవాళ్లే ఎదురుకానున్నాయి. ఇండియా, సౌతాఫ్రికా తలపడబోతున్న ఈ సిరీస్‌కు 'ఫ్రీడం సిరీస్' అనే పేరు పెట్టారు. ఎందుకంటే ఈ రెండు దేశాలు స్వాతంత్ర్యం కోసం పోరాడి సాధించాయి. అంతేకాదు ఈ రెండు దేశాల్లోనూ క్రికెట్ అంటే ప్రజలకు ఎంతో ఇష్టం. సౌతాఫ్రికా పర్యటనకు టీమిండియా వెళ్లిన ప్రతిసారీ జవాబులేని ఎన్నో ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గతంలో అనేకసార్లు సౌతాఫ్రికా గడ్డపై సిరీస్ గెలిచేందుకు ఎన్నో ఇబ్బందులు పడింది. సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లిన తొలి జట్టు టీమిండియా. వర్ణవివక్ష శకం ముగిసిన తర్వాత మళ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి వచ్చిన సౌతాఫ్రికాతో 1992లో టీమిండియా ఆడింది. ఆ సిరీస్‌కు ఫ్రెండ్‌షిప్ సిరీస్ అనే పేరు పెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇండియా, సౌతాఫ్రికా జట్లు ఆరు సిరీస్‌లు ఆడాయి. అందులోని ఐదు సిరీస్‌ల్లో ప్రొటీస్ గెలిచారు. ఒకటి డ్రా అయింది. మరోసారి ఈ రెండు జట్లు సిరీస్ ఆడబోతున్న సందర్భంగా సౌతాఫ్రికాలో టీమిండియా ప్రతిభను ఓసారి గుర్తు చేసుకుందాం...

1992-93



మహ్మద్ అజారుద్దీన్ నేతృత్వంలోని టీమిండియా తొలిసారి సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లి టెస్టు సిరీస్ ఆడింది. ఈ సిరీస్ అద్భుతంగా ప్రారంభమైంది. డర్బన్‌లో జరిగిన తొలి టెస్టు తొలి బంతికే జిమీ కుక్‌ను కపిల్‌దేవ్ అవుట్ చేశాడు. కెప్టెన్ కెప్లర్ వెస్సెల్స్ సెంచరీ చేయడంతో సౌతాఫ్రికా జట్టు గౌరవప్రదమైన 254 పరుగులు చేసింది. తర్వాత ప్రవీణ్ ఆమ్రే ఎంతో ఓపికతో సెంచరీ చేయడంతో టీమిండియా 277 పరుగులు సాధించింది. చివరికి ఈ మ్యాచ్ డ్రాగా ముగిసింది. జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో అదే సీన్ రిపీట్ అయింది. దీంతో ఆ మ్యాచ్ కూడా డ్రా అయింది. పోర్ట్ ఎలిజబెత్‌లో జరిగిన మూడో టెస్టు మ్యాచ్‌లో అలన్ డొనాల్డ్ భారత బ్యాట్స్‌మెన్ చేత కంట తడి పెట్టించాడు. 139 పరుగులిచ్చి 12 వికెట్లు తీసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో కపిల్ దేవ్ (129) ఒక్కడే రాణించి టీమిండియా ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. కానీ చివరికి సౌతాఫ్రికా 9 వికెట్ల తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఇక కేప్‌టౌన్‌లో జరిగిన చివరి టెస్టు మ్యాచ్ కూడా డ్రాగా ముగిసింది.

1996-97



భారత్‌లో ఓటమికి ఈ సిరీస్‌లో సౌతాఫ్రికా జట్టు టీమిండియాపై ప్రతీకారం తీర్చుకుంది. సౌతాఫ్రికా ఫాస్ట్, బౌన్సీ పిచ్‌లపై అంతగా అనుభవం లేని టీమిండియా డర్బన్‌లో జరిగిన తొలి టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో 100, రెండో ఇన్నింగ్స్‌లో 66 పరుగులకు ఆలౌటైంది. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా 328 పరుగులతో గెలిచింది. తర్వాత కేప్‌టౌన్‌లో జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌లోనూ సౌతాఫ్రికా జట్టు టీమిండియాను ఇబ్బంది పెట్టింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా 7 వికెట్ల నష్టానికి 529 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. తర్వాత సచిన్ టెండూల్కర్ (169), అజారుద్దీన్ (115) సెంచరీలు చేసినప్పటికీ టీమిండియాను ఓటమి నుంచి తప్పించలేకపోయారు. దీంతో టీమిండియా మరోసారి సిరీస్ కోల్పోయింది.

2001-02



ఈ సిరీస్‌ను వివాదాలు చుట్టుముట్టాయి. టీమిండియా అరంగేట్ర ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ సెంచరీ చేసినప్పటికీ టీమిండియా ఓటమిపాలైంది. బ్లెయెమ్‌ఫాంటీన్‌లో జరిగిన తొలి టెస్టులో సౌతాఫ్రికా 9 వికెట్లతో గెలిచింది. ఇక పోర్ట్ ఎలిజబెత్‌లో జరిగిన రెండో టెస్టులో సచిన్ టెండూల్కర్ బాల్ ట్యాంపరింగ్ పాల్పడ్డాడన్న ఆరోపణలు వచ్చాయి. అంతేకాకుండా అతిగా అప్పీల్ చేశారని ఐదుగురు భారత క్రికెటర్లపై ఒక టెస్టు మ్యాచ్ నిషేధం పడింది. ఈ టెస్టు మ్యాచ్ డ్రా అయింది. కానీ సెంచూరియన్‌లో జరిగిన మూడో టెస్టులో టీమిండియా ఇన్నింగ్స్ తేడాతో ఓటమిపాలైంది. అప్పటికి కూడా అక్కడి వాతావరణానికి, పిచ్‌లకు టీమిండియా అలవాటు పడలేదు.

2006-07



ఈ ఫ్రీడం సిరీస్‌లో రాహుల్ ద్రవిడ్ నేతృత్వంలోని టీమిండియా జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన తొలి టెస్టులో 123 పరుగులతో అద్భుత విజయం సాధించింది. ఎస్. శ్రీశాంత్ 10 ఓవర్లలో 40 పరుగులిచ్చి 5 వికెట్లు తీసుకున్నాడు. అయితే డర్బన్‌లో జరిగిన రెండో టెస్టులో సౌతాఫ్రికా జట్టు అనూహ్యంగా పుంజుకుంది. యాష్వెల్ ప్రిన్స్ సెంచరీ చేయగా.. మఖాయా ఎన్తిని ఐదు వికెట్లు తీసుకున్నాడు. సౌతాఫ్రికా 174 పరుగులతో గెలిచింది. చెరో మ్యాచ్ గెలవడంతో మూడు టెస్టుపై ఉత్కంఠ పెరిగింది. ఈ మ్యాచ్‌లో ఇరు జట్లూ హోరా హోరీగా పోరాడాయి. కానీ గ్రేమ్ స్మిత్ అండగా నిలిచి జట్టును గెలిపించాడు. మరోవైపు బ్యాటింగ్ లైనప్ కుప్పకూలడం, పేలవ ఫీల్డింగ్ కారణాల వల్ల టీమిండియాకు ఓటమి తప్పలేదు.

2010-11



ఈ సిరీస్‌లో టీమిండియా పరిణితి ప్రదర్శించింది. గత పర్యటనల కంటే ఈ పర్యటనలో టీమిండియాలో తేడా కనిపించింది. ఎందుకంటే సిరీస్ కోల్పోకుండా టీమిండియా స్వదేశానికి వచ్చింది. సెంచూరియన్‌లో జరిగిన తొలి టెస్టులో టీమిండియా ఇన్నింగ్స్, 25 పరుగులతో ఓటమిపాలైంది. రెండో ఇన్నింగ్స్‌లో సచిన్ 111 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. కానీ డర్బన్‌లో జరిగిన రెండో టెస్టులో టీమిండియా ఎదురుదాడికి దిగింది. వీవీఎస్ లక్ష్మణ్ (96) అద్భుతమైన బ్యాటింగ్, జహీర్ ఖాన్ నిప్పులు చెరిగే బౌలింగ్ వల్ల ఈ మ్యాచ్‌లో టీమిండియా 87 పరుగులతో విజయం సాధించింది. ఇక కేప్‌టౌన్‌లో జరిగిన చివరి టెస్టు డ్రాగా ముగిసింది.

2013-14



ప్రస్తుతం టీమిండియాలో ఉన్న చాలా మంది క్రికెటర్లు ఈ సిరీస్‌లో ఆడారు. కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా ప్రస్తుతం అదే ధీమాను వ్యక్తం చేస్తున్నాడు. జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన తొలి టెస్టులో కోహ్లి 181 బంతుల్లో 119 పరుగులు చేశాడు. తర్వాత సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో వెర్నాన్ ఫిలాండ్ (59) ఒక్కడే రాణించాడు. తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో ఫాఫ్ డు ప్లెసిస్, ఏబీ డివిలియర్స్ సెంచరీలు చేయడంతో సౌతాఫ్రికా పుంజుకుని మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. తొలి టెస్టులో మాదిరిగానే ఇండియా, సౌతాఫ్రికా జట్లు డర్బన్‌లో జరిగిన రెండో టెస్టులోనూ పోరాడాయి. టీమిండియా రెండు ఇన్నింగ్స్‌లలో మురళీ విజయ్, అజింక్య రహానే ప్రతిఘటించినప్పటికీ.. బ్యాటింగ్‌లో జాక్వెస్ కల్లిస్ రాణించడం, బౌలింగ్‌లో డేన్ స్టెయిన్ ఆరు వికెట్లు తీసుకోవడంతో ధోనీ సేన 10 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది.

2018

కానీ మునుపటి కంటే ఈసారి సౌతాఫ్రికా వాతావరణంలో గానీ, ఆ జట్టులో గానీ భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. సౌతాఫ్రికా జట్టులో పూర్వపు క్రికెటర్లు ఒకరిద్దరు తప్ప అంతా కొత్త ముఖాలే. మరోవైపు టీమిండియాలోనూ చాలా మార్పు వచ్చింది. హోం సిరీస్‌లో వరుసగా 9 టెస్టు సిరీస్‌లను కోహ్లి సేన గెలిచి ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ రికార్డును సమం చేసింది. భారత క్రికెట్ బెంచ్ స్ట్రెంగ్త్ మరింత బలోపేతం కావడంతో టీమిండియాలో చోటు దక్కడం అంత సులువేమీ కాదు. ఏమాత్రం సత్తా చాటకపోతే ఇంజురీ కారణాలతో పక్కన పెడుతున్నారు. పిచ్‌ల తయారీలోనూ మార్పు కనిపిస్తోంది. తొలి టెస్టుకు బౌన్సీ పిచ్ తయారు చేయడం లేదన్న వార్తలు కూడా వస్తున్న నేపథ్యంలో ఈసారి కోహ్లి సేన చరిత్రను తిరగరాసే అవకాశముంది.

భువనేశ్వర్ బాధ్యత తీసుకోవాలి

భారత మాజీ బౌలర్ జవగళ్ శ్రీనాథ్

ఇంతవరకు సౌతాఫ్రికాలో టీమిండియా సిరీస్ నెగ్గలేదు. కానీ ఈసారి మాత్రం కోహ్లి సేనపై అందరూ పూర్తి విశ్వాసాన్ని కనబరుస్తున్నారు. ఎందుకంటే సౌతాఫ్రికాకు గట్టి పోటీ ఇవ్వగల బౌలర్ల బృందం కోహ్లి ఉందని నిపుణులు చెబుతున్నారు. చారిత్రాత్మక సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లిన అజారుద్దీన్ నేతృత్వంలోని టీమిండియాలో మాజీ పేస్ బౌలర్ జవగళ్ శ్రీనాథ్ కూడా సభ్యుడు. టీమిండియా బౌలింగ్ అంబుల పొదిలో అనేక ఆయుధాలున్నాయని ఈ 'మైసూర్ ఎక్స్‌ప్రెస్' నమ్ముతున్నారు. ముఖ్యంగా పేస్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ కీలకపాత్ర పోషిస్తాడని జవగళ్ చెబుతున్నారు. 'ప్రస్తుతం టీమిండియా అత్యుత్తమ బౌలింగ్ కాంబినేషన్ ఉంది. గత ఏడాదిన్నర కాలంగా చూస్తున్న దానిబట్టి చెబుతున్నాను. షార్ట్ స్పెల్స్‌లో భువనేశ్వర్ చాలా పొదుపుగా బౌలింగ్ చేస్తున్నాడు. గత కొన్ని నెలలుగా అసాధారణ ప్రతిభ కనబరుస్తున్నాడు. అద్భుతంగా బంతిని స్వింగ్ చేస్తున్నాడు' అని ఐసీసీ మ్యాచ్ రెఫరీగా కొనసాగుతున్న జవగళ్ అన్నారు. పూర్వపు జట్ల కంటే ప్రస్తుత టీమిండియా భిన్నంగా ఉందని.. ఒత్తిడికి ఏమాత్రం లొంగదని ఆయన చెప్పారు. కూకాబుర్ర బంతులను టీమిండియా కుర్రాళ్లు సమర్థవంతంగా ఎదుర్కోగలరని అన్నారు.

పాండ్యా కీలకపాత్ర పోషిస్తాడు

సౌతాఫ్రికా మాజీ ఆల్ రౌండర్ క్లుసెనర్

అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసినప్పటి నుంచి ఆల్ రౌండర్‌లో టీమిండియా వన్డే జట్టులో సుస్థిర స్థానం ఏర్పరచుకున్న హార్దిక్ పాండ్యా తక్కువ కాలంలోనే పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. ఇప్పుడు సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో కఠినమైన సవాల్‌ను ఎదుర్కోబోతున్నాడు. తన సత్తా ఏంటో నిరూపించుకున్నప్పటికీ టెస్టుల్లో అతని సామర్థ్యంపై విమర్శకులు పెదవి విరుస్తున్నారు. కానీ సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో పాండ్యా కీలకంగా మారతాడని మాజీ ఆల్ రౌండర్ లాన్స్ క్లుసెనర్ చెప్పారు. 'పాండ్యాలోని ఆల్ రౌండర్ నాణ్యత అటు బ్యాటింగ్‌లో, ఇటు బౌలింగ్‌లో టీమిండియాకు లబ్ధి చేకూరుస్తుంది. అతనిలోని ప్రతిభ టీమిండియాకు సమతుల్యతను ఇచ్చింది. లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగే మీడియం పేస్ బౌలర్ పాండ్యా జట్టు కూర్పులో కెప్టెన్ విరాట్ కోహ్లికి ఎన్నో ఆప్షన్లను ఇస్తాడు' అని క్లుసెనర్ అన్నారు.


ఇలాంటి పిచ్‌నే మేము కోరుకుంది: ప్లెసిస్



కేప్‌టౌన్: టీమిండియాతో శుక్రవారం ప్రారంభం కానున్న తొలి టెస్టుకు సిద్ధం చేసిన పిచ్ తమ జట్టుకు అనుకూలంగా ఉన్నట్టు సౌతాఫ్రికా కెప్టెన్ ఫాఫ్ డు ప్లెసిస్ అన్నాడు. 'గ్రౌండ్స్‌మన్ అద్భుతంగా పని చేశారు. వాతావరణం చాలా వేడిగా ఉంది. కానీ పిచ్‌ను చూస్తే ఒక మంచి క్రికెట్ ఆడేలా కనిపిస్తోంది. మరీ అంత అద్భుతంగా లేకపోయినప్పటికీ మాకు కావాల్సిన పిచ్‌ను తయారు చేశారనిపిస్తోంది' అని ప్లెసిస్ అన్నాడు. చాలా రోజుల వేడి తర్వాత ప్రధాన పిచ్‌పై పచ్చగడ్డి కనిపిస్తోంది. ఆదర్శంగా కనిపిస్తున్న ఈ పిచ్ పేస్, బౌన్స్, స్వింగ్‌ను ఇస్తుందని ప్లెసిస్ భావిస్తున్నాడు. చాలా కాలం తక్వాత తొలిసారి సౌతాఫ్రికా ప్రధాన బౌలర్లందరూ పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నారు. చాలా కాంబినేషన్లను అనుకున్న తర్వాత బుర్ర బద్దలు కొట్టుకుని ఈ జట్టును ఎంపిక చేశామని ప్లెసిస్ చెప్పాడు.

రంజీలో బిహార్‌ను ఆడించండి

బీసీసీఐకి సుప్రీం కోర్టు ఆదేశం



న్యూఢిల్లీ: రంజీ ట్రోఫీతో పాటు దేశవాళీ టోర్నీల్లో ఆడేందుకు బీహార్ క్రికెట్ అసోసియేషన్‌ను అనుమతించాలని గురువారం బీసీసీఐని సుప్రీం కోర్టు ఆదేశించింది. 'క్రికెట్ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని బిహార్‌ను క్రికెట్ ఆడేందుకు అనుమతించాలని ఈ మధ్యంతర ఉత్తర్వులను జారీ చేస్తున్నాం' అని సుప్రీం కోర్టు తన ఆదేశంలో పేర్కొంది. 70 దశకం నుంచి బిహార్ క్రికెట్ ఆడుతోందని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా అన్నారు. ఎవరో పిటిషన్ వేశారని కాకుండా క్రికెట్ ప్రయోజనాల కోసమే ఈ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినట్టు సుప్రీం కోర్టు వివరించింది. అయితే బిహార్, జార్ఖండ్ అసోసియేషన్ల మధ్య ఇంకా పరిష్కారం కాని విభేదాలున్నాయని సుప్రీంకు బీసీసీఐ తెలిపింది. అయితే అదంతా తర్వాత చూసుకుందామని.. ముందుగా బిహార్ క్రికెట్ ఆడేలా చూడమని ఉన్నత న్యాయస్థానం చెప్పింది.

అశ్విన్‌కు అండగా నిలవండి

భారత పేస్ బౌలర్లకు సచిన్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ: గతంలో అంటే 2011 సౌతాఫ్రికా పర్యటనలో హర్భజన్ సింగ్‌కు జహీర్ ఖాన్ అండగా నిలిచినట్టు ఇప్పుడు రవిచంద్రన్ అశ్విన్‌కు అండగా నిలవాలని భారత పేస్ బౌలర్లను క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కోరారు. సాధారణంగా సౌతాఫ్రికా పిచ్‌లు స్పిన్నర్లకు సహకరించవు. అందుకే సచిన్ ఈ విజ్ఞప్తి చేశారు. అశ్విన్‌కు ఉపయోగపడేలా పిచ్‌పై రఫ్ ప్యాచ్‌లను సృష్టించమని భారత పేసర్లను సచిన్ కోరుతున్నారు. 2010-11 సౌతాఫ్రికా పర్యటనలో ఇదే కేప్‌టౌన్‌లో జరిగిన టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో హర్భజన్‌కు ఏడు వికెట్లు పడ్డాయి. జహీర్, లొన్వాబో సొసొబె పిచ్‌పై స్పిన్నర్లకు కావాల్సినంత రఫ్ ప్యాచ్‌ను సృష్టించారు. ఇషాంత్, శ్రీశాంత్ కూడా రౌండ్ వికెట్ బౌలింగ్ వేశారు. భజ్జీ కుడిచేతి బౌలర్లకు బౌలింగ్ వేసేటప్పుడు ఆ రఫ్ ప్యాచ్ ఎంతో ఉపయోగపడింది' అని సచిన్ వివరించారు.

హైదరాబాద్‌కు వార్నర్, భువీ

ఐపీఎల్ ప్లేయర్స్ రిటెన్షన్



ముంబై: ఐపీఎల్ ప్లేయర్ రిటెన్షన్ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. చెన్నై సూపర్ కింగ్స్ మహేంద్ర సింగ్ ధోనీని, సన్‌రైజర్స్ హైదరాబాద్ డేవిడ్ వార్నర్‌ను, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు విరాట్ కోహ్లీని కొనసాగించాయి. ఏ యే జట్టు ఎవరెవరు క్రికెటర్లను నిలబెటుకున్నాయో ఓసారి చూద్దాం...

- **సన్‌రైజర్స్ హైదరాబాద్:** డేవిడ్ వార్నర్, భువనేశ్వర్ కుమార్
- **చెన్నై సూపర్ కింగ్స్:** ఎంఎస్ ధోనీ, సురేష్ రైనా, రవీంద్ర జడేజా
- **ఢిల్లీ డేర్‌డెవిల్స్:** రిషబ్ పంత్, క్రిస్ మోరిస్, శ్రేయాస్ అయ్యర్
- **రాయల్ చాలెంజర్స్ బెంగళూరు:** విరాట్ కోహ్లీ, డివిలియర్స్, సర్ఫరాజ్ ఖాన్
- **ముంబై ఇండియన్స్:** రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా, జస్‌ప్రీత్ బుమ్రా
- **కోల్‌కతా నైట్ రైడర్స్:** సునీల్ నరైన్, ఆండ్రూ రస్సెల్
- **కింగ్స్ లెవెన్ పంజాబ్:** అక్షర్ పటేల్
- **రాజస్థాన్ రాయల్స్:** స్టీవెన్ స్మిత్

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id. manamtelugudaily1@gmail.com.